**పాఠకులకు విజ్ఞప్తి**

సమస్త పాఠకులకు చేయు విజ్ఞప్తి ఏమనగా వాయిస్ ఆఫ్ న్యూడెమోక్రసీ పత్రిక గత కొన్ని నెలలుగా ప్రచురణకు నోచుకో లేదు. ఆర్థికం, కరోనా వైరస్ తదితర కారణాల రీత్యా పత్రికను మీ ముందుకు తీసుకు రాలేక పోయాము. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము. ఇక ముందు క్రమం తప్పకుండా తీసుక రావడానికి ప్రయత్నిస్తామని తెలియజేస్తున్నాము.

- సంపాదక వర్గం.



వాయిస్ ఆఫ్

# న్యూడెమోక్రసీ

శ్రామిక ప్రజల పక్షపత్రిక

సంపుటి : 6   సంచిక : 5   01.08.2020 నుండి 31.08.2020   పేజీలు : 12   పేజీ-1   ప్రచురణ స్థలం : ఖమ్మం   వెల: 10/-


## కరోనా వైరస్ - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం

కరోనా - కోవిడ్ 19. ఇదొక సూక్ష్మజీవి. ఇంకా చెప్పాలంటే ఒక వైరస్. వైరస్ అంటే లాటిన్ భాషలో విషం అని అర్థం. కరోనా వైరస్ సమకాలీన ప్రపంచాన్ని వణికిస్తున్నది. అగ్రరాజ్యం నుంచి బడుగు రాజ్యాల దాకా ప్రపంచంలోని 213 దేశాలను అతలా కుతలం చేస్తున్నది. వాటి ఆరోగ్య వ్యవస్థలనూ, ఆర్థిక వ్యవస్థలనూ, సామాజిక జీవనాన్ని కల్లోల పరుస్తున్నది. ఇప్పటికే 7 నెలల కాలం దాటింది. అది ఇంకా కట్టడికి రాలేదు. మందు రాలేదు. వ్యాక్సిన్ ప్రయోగాల దశలో వున్నది. చాలా దేశాలలో జనజీవనం అతలా కుతలం అయ్యింది. ఆర్థిక వ్యవస్థ కుదేలు అయ్యింది. స్కూళ్ళు, కాలేజీలు విద్యా సంవత్సరం ప్రారంభంకాక, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురు చూపులు చూస్తున్నారు. జనాలకు జ్వరం వచ్చినా, అనుమాన పడే పరిస్థితి వచ్చింది. రద్దీ వీధులు తెల్ల బోతున్నాయి. ఉత్పత్తి రంగాలు ఉసూరుమంటున్నాయి. జనం, బతుకు జీవుడా అంటూ బాధలు పడుతున్నారు.




ఇప్పటికీ (ఇది వ్రాసే నాటికి 8.8.2020) ప్రపంచంలో దాదాపు 2.17 కోట్ల మంది కరోనా రోగం బారిన పడ్డారు. అందులో 7 లక్షల 71 వేల మంది చనిపోయారు. భారతదేశంలో 20 లక్షల 70 వేలకు పైగా కేసులు రాగా, దేశంలో 50 వేల మంది ఈ రోగాన పడి చనిపోయారు. తెలంగాణా రాష్ట్రంలో 91 వేల కేసులు నమోదు కాగా, 693 మంది చనిపోయారు. పొరుగు ఆంధ్రప్రదేశ్‌లో 2.8 లక్షలకు పైగా కేసులు నమోదు అవ్వగా, 2650 మంది చనిపోయారు. మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ ఈ కేసుల నమోదులో అగ్రభాగంలో వున్నాయి.

### దీని పూర్వాపరాలు

కరోనా వైరస్ చైనాలో మాంసం మార్కెట్‌లో పుట్టిందని, మొదటి కేసు 2019 డిశంబర్‌లో వచ్చిందని ప్రచారం సాగుతున్నది. నిజమే. కోవిడ్ 19కు సంబంధించి మనం పరిగణనలోకి తీసుకున్న మొదటి కేసు చైనాలోని హూనాన్ ప్రాంతంలోనే వచ్చింది. కానీ, యిది చైనా తయారు చేసిందనీ, జీవ రసాయన ఆయుధమనీ, ప్రపంచ మార్కెట్‌ను దెబ్బతీయటానికే చైనా లేబలేటరీలో తయారు చేశారని అమెరికా, పెట్టుబడిదారీ ప్రపంచం ముఖ్యంగా అమెరికా ప్రభావిత, ప్రలోభిత వర్గాలన్నీ ప్రచారం చేశాయి. కానీ, యిది చైనాకు అమెరికా తన సైనికుల ద్వారా పంపించారని, చైనా ఎదురు వాదన చేసింది. ఈ వాదనలు, ఎత్తుగడలు, కువిమర్శలు ఎలా వున్నా - వాటిని అన్నింటిని ప్రక్కకు నెటి ఆక్స్‌ఫర్డ్ నుంచి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలందరూ యిది సహజ పరిణామాల ద్వారా, అంటే వైరస్ మ్యుటేషన్ ద్వారా ఏర్పడిందని ప్రకటించారు. ఇది వాస్తవం. ఈ కోవిడ్ వైరస్ జీవ పదార్థం మీద జీవిలాగా, నిర్జీవ పదార్థం మీద నిర్జీవిగా వున్నది. యిది మనిషి కణజాలాన్ని కొవ్వు కణాన్ని అడ్డం పెట్టుకొని, మనిషిలో ప్రభావాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా ఊపిరితిత్తులు (శ్వాసకోశం), రక్త నాళాల మీద ప్రధానంగా ప్రభావితం చూపిస్తున్నది. మనిషిలో రోగ నిరోధక శక్తి, శక్తివంతంగా వుంటే అది లొంగి పోతున్నది. అందుకే 95 నుంచి 97 శాతం మందికి నయమవుతున్నది. చాలా మందికి జలుబు లాగా వచ్చి పోతుంది. షుగర్, శ్వాసకోశ వ్యాధులు, బి.పి, యితరాల్లో దీర్ఘకాల వ్యాధులు వున్న వారి మీద ఎక్కువ ప్రభావం చూపి, మరణాలకు దారి తీస్తుంది. శ్వాస తీసుకోలేక పోవడం, ఆయాసం ఉన్న వారికి సకాలంలో వైద్యం అందితే ఊరట లభిస్తుంది.

ఈ కరోనా వైరస్‌కు చరిత్ర వున్నది. 80 ఏండ్ల నాడే యిది భూమి మీద వున్నది. ఇటీవలే మనిషిలోకి జన్యు మార్పిడి ద్వారా వచ్చింది. ఇది గబ్బిలాలలో సహజంగా వుంటూ వచ్చింది. 2003 సంవత్సరంలో గబ్బిలాల నుంచి పిల్లిలోకి వచ్చింది. అందులో నుంచి ఒంటెలలోకి వచ్చింది. 2013లో పిల్లులలో నుంచి మనిషిలోకి చేరే మార్పును సంతరించుకున్నది. మొదట ఇది అరేబియా ప్రాంతంలో జరిగింది. అందుకే దీనిని మెర్సికోవ్ (Mersikov) అని

(మిగతా 2వ పేజీలో)

## కామ్రేడ్ లింగన్న ఎత్తిన విప్లవ పతాకాన్ని సమున్నతంగా నిలబెడదాం!

ప్రతిఘటనా పోరాట యోధుడు కామ్రేడ్ లింగన్న అమరత్వం పొంది జులై 31కి ఒక సంవత్సరం. కా॥ లింగన్న ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞగా, మొదటి వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపిచ్చింది. నార్త్-ఈస్ట్ రీజనల్ కమిటీ తన ప్రాంతంలో జులై 24 నుండి 31 వరకు వారం రోజులు సంతాప సభలు జరపాలని పిలుపిచ్చింది.

కా॥ లింగన్నని గత సం॥ జులై 31న వందలాది పోలీసు మూక తనున్న ప్రదేశాన్ని చుట్టుముట్టింది. శత్రువు చేత చిక్కిన కా॥ లింగన్నని అత్యంత క్రూరంగా చిత్రహింసలు పెట్టి చంపివేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన మరుసటి రోజు నుండి ఎన్‌కౌంటర్లుండవని కేసీఆర్ పదేపదే పలికిన మాటలు బూటకమని రుజువుపర్చుకున్నాడు. తెలంగాణను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కొనసాగించిన దాష్టీకాలన్నింటినీ టీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. ప్రజాస్వామిక హక్కులను హరించి వేస్తున్నది. కేంద్ర ప్రభుత్వంచే శభాష్ అనిపించు కోవడానికి ఎంతో తాపత్రయపడుతున్నది. అందులో భాగమే బూటకపు ఎన్‌కౌంటర్లు. కా॥ లింగన్నని ఎన్‌కౌంటర్ పేరిట చేసిన ప్రభుత్వ హత్య.

భద్రాద్రి కొత్తగూడెం ఎస్.పి. ఆధ్వర్యంలో ఈ క్రూర హత్యకి ఒడిగట్టింది. కా॥ లింగన్నని చంపిన సమాచారం తెలుసుకొన్న ప్రజలు వందలాది మంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ ప్రియతమ నాయకుడిని విగత జీవిగా చూడటంతో ప్రజల్లో కసి, ద్వేషం పెల్లుబికింది.



లింగన్న ప్రథమ వర్ధంతి

హతమార్చిన పోలీసుని ప్రతిఘటించారు. కాల్పులు చేసి, ప్రజలను చెల్లాచెదురు చేసి కా॥ లింగన్న శరీరాన్ని స్వాధీన పర్చుకొని దొంగచాటుగా జిల్లా కేంద్రానికి తరలించారు. బాడీని ప్రజలకి అప్పగించకుండా వుండేందుకు శతవిధాల ప్రయత్నం చేశారు.

మరణించిన లింగన్న మృతదేహం కూడా రాజ్యాన్ని గజగజ వణికించింది. లింగన్న మరణానంతరం తన జ్ఞాపకార్థం స్థూపం నిర్మించుకుంటుంటే శాడిస్టు పోలీసులు దుర్మార్గంగా కూల్చివేసారు. నేటికీ స్థూప నిర్మాణాన్ని అడ్డుకొంటున్నారు. ఆ ప్రాంత ప్రజలకు అత్యంత ప్రేమ పాత్రుడయిన కా॥ లింగన్న స్థూప నిర్మాణాన్ని అడ్డుకొనే చట్టం ఎక్కడ వుంది? విప్లవోద్యమంలో అమరత్వం పొందిన వీరులనేక మందికి స్మారక చిహ్నాలని నిర్మించుకోవడం వారి హక్కు. దాన్ని అడ్డుకోవడం చట్ట వ్యతిరేకం, పాశవికం.

కా॥ లింగన్న అమరత్వం పొంది సంవత్సరం గడుస్తున్న సందర్భంలో ప్రథమ వర్ధంతి సభ రాష్ట్రంలో, దేశంలో జరుపుకోవాలని పార్టీ నిర్ణయించింది. దానిలో భాగంగా జరుపుతున్న ప్రథమ వర్ధంతి సభలను జరగకుండా ఆటంక పర్చడం తెలంగాణ ప్రభుత్వ దుర్మార్గత్వం స్పష్టమవుతోంది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు కా॥ మధుని అక్రమంగా నిర్బంధించి తప్పుడు కేసులో యిరికించి జైలుకి పంపడం అక్రమం. ప్రతిఘటనా పోరాట ప్రాంతమంతటా నేటికీ తీవ్ర నిర్బంధాన్ని

మిగతా 11వ పేజీలో)

(1వ పేజీ తరువాయి)

పిలిచారు – మెర్సికోవ్ అంటే మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (Middle East Respiratory Syndrome) అని పిలిచారు. 2015 సం॥లో ఇది కొరియన్ రిపబ్లిక్‌కు విస్తరించింది. 2019 ఆఖరులో చైనాలో కన్పించింది. జనవరి 30న మొదటి కేసు మన కేరళలోని త్రిసూర్‌లో వెల్లడయ్యింది.

మానవ సమాజంలో, ప్రకృతిలో, ప్రకృతి విధ్వంసం, కర్బన వాయువులు అధిక మొత్తాలలో వెలువడుతుండటం తదితరాల వలన రకరకాల వైరస్‌లు పుట్టి ప్రజలను భీతావహుల్ని చేస్తున్నాయి. 1918–1920లలో 'స్పానిష్ ఫ్లూ' వచ్చి వేలాది మందిని బలిగొన్నది. 1981లో హెచ్ఐవి-ఎయిడ్స్ వైరస్ వెల్లడయ్యింది. 2002–2004లో సార్స్ (ఎస్ఏఆర్ఎస్) వైరస్ వెల్లడయ్యింది. 2013–16 వరకు పశ్చిమ ఆఫ్రికాలో ప్రధానంగా ఎబోలా వైరస్ వచ్చింది. అందుకే ఈ వైరస్ ఒక పట్టాన వుండటం లేదు. పరిణామం చెంది మరో రూపంలో మరింత తీవ్రంగా వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఈ వైరస్‌కు వ్యాక్సిన్ కనుగొనడానికి ప్రపంచ ఫార్మా కంపెనీలు పోటీపడి పనిచేస్తున్నాయి. రకరకాల మందులు ఏవీ పనిచేస్తాయో పరీక్షిస్తూనే, టీకా ఆవిష్కరణకు యత్నాలు చేస్తున్నాయి. ప్రస్తుత భీతావహ వాతావరణంలో ఆ మందు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరికీ అవసరం. అందుకే ఫార్మా కంపెనీలు, ఎంఎన్‌సీలు పోటీ పడి, పరుగులు పెడుతున్నాయి.

## భారత దేశంలో ప్రభావం

కరోనా ప్రభావం భారతదేశంలో వివిధ రంగాలపై తీవ్రంగా వున్నది. భారతదేశంలో చేతివృత్తులు, చిన్న పరిశ్రమలు, వీధి వ్యాపారాలు, ట్రాన్స్‌పోర్టు, టూరిజం, నిర్మాణ రంగం చాలా తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. వీటన్నింటి ఫలితంగా అంతకు ముందే జాతీయాదాయం పడిపోతున్న పరిస్థితి వుండగా, దీనితో అభివృద్ధి మైనస్‌లోకి పోయింది. 2020 ఆర్థిక సంవత్సరంలో భారత జి.డి.పి. –10 (మైనస్ 10) శాతానికి పడిపోతుందని ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం మార్చి 22న జనతా కర్ఫ్యూ పెట్టింది. ఆ తరువాత దేశ వ్యాపితంగా లాక్‌డౌన్ విధించింది. ఈ లాక్‌డౌన్ కాలంలో అన్ని రంగాలు స్తంభించి పోయాయి. దీనితో పొట్ట చేత బట్టుకొని వలస వచ్చిన కూలీలు ఉపాధి లేక, చేతుల్లో డబ్బులు లేక, జీతాలు యివ్వని ఫలితంగా స్వంత ఊళ్లకు బయలు దేరారు. ప్రభుత్వం వారిని గాలికొదిలేసింది. ఫలితంగా పిల్లలతో, మూటలతో, వృద్ధులు, ఆడా, మగా కాలి నడకన వందల, వేల కి.మీ. కాలినడక సాగించారు. ఎర్రటి ఎండా కాలం – ఆకలి డొక్కలు – ఒకటా, రెండా – వందల, వేల కిలో మీటర్లు – వలస కూలీలు దేశంలో కాశీ నుంచి కన్యాకుమారి దాకా, కలకత్తా నుంచి అమృతసర్ దాకా సాగించిన కాలినడక దేశంలో ఎందరి హృదయాలను కదిలించిందో. వృద్ధులు, కడుపుతో వున్న స్త్రీలు నెత్తురోడుతూ నడిచిన నడక, పడిన నరక యాతన పాలకులను కదిలించ లేక పోయింది. ఈ నడక క్రమంలోనే 150 మంది దాకా చనిపోయారు. ఇది ప్రభుత్వ ప్రణాళిక లేని ఫలితం. ఆర్భాటపు ప్రకటనలే తప్ప, ఆచరణాత్మకం గాని విధానాల ఫలితం – ఇది భారత చిత్ర పటాన నెత్తుటి మరక లాగా మిగిలిపోయింది.

వీరి వలసల కారణంగా నిర్మాణరంగం కుదేలయ్యింది. అనేక పరిశ్రమలకు యిబ్బంది ఏర్పడింది. దేశ వ్యాపితంగా 14 కోట్ల మంది వలస కార్మికులు చీమల పుట్టల్లాగా రోడ్ల మీది కొచ్చారు. తమ పుట్టిన స్థలాలను వెతుక్కుంటూ వెళ్లారు. కానీ, అర్థాంతర లాక్‌డౌన్ ప్రకటించడమేగానీ, వీరిని వారి గమ్య స్థానాలకు చేర్చాలనే సోయి, వారికి 'తగిన సమయం' ఇవ్వాలనే జ్ఞానం ప్రభుత్వానికి లేకుండా పోయింది. జరగాల్సిన భీభత్సం ఎంతో జరిగాక, కొన్ని రైళ్లను వేసి చేతులు దులుపుకున్నది. కేంద్ర ప్రభుత్వం ఎంత బాధ్యతారహితంగా వ్యవహరించిందో!

కరోనా బాధితులకు సహకారం అందించకుండా కాలం గడిపారు. చివరకు అనేక విమర్శల అనంతరం 20 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించారు. ఈ ప్యాకేజీ ప్రజలకు వుపయోగపడేది కాదు. అదంతా పెద్ద పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్లకే వుపయోగపడేది. కనీసం ఎం.ఎస్.ఎం.ఈ. (సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు) కూడా వుపయోగపడే విధానాలు అందులో లేవు.

ఈ పాకేజీలోనే కరోనాకు, ప్రస్తుత పరిస్థితికి సంబంధం లేని విధంగా కోర్ సెక్టార్ (పబ్లిక్)ను ప్రైవేటీకరణ చేశారు. బొగ్గు, ఉక్కు, సహజవాయువు, చివరకు ఇస్రోలో సైతం ఎఫ్‌డిఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు)లకు నూరు శాతం అనుమతులు యిచ్చారు. అలానే రైల్వే లైనులో 109 రూట్లను ప్రైవేట్ వర్గాలకు అప్పగిస్తున్నారు. ఈ పేరున తమ ప్రైవేటీకరణ, ఎం.ఎన్.సి.ల అనుకూల విధానాలను అమలు జరిపారు. కార్మికుల పని గంటలు పెంచారు. ఈ కాలంలోనే కార్పొరేట్ శక్తులకు 5% కార్పొరేట్ టాక్స్ తగ్గించారు. 56 వేల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశారు.

చిన్న పరిశ్రమలను పట్టించుకోలేదు. కానీ, ఇవే దేశంలో 70 శాతం ఉపాధిని సమకూర్చేవి. దేశంలో 6.33 కోట్ల సూక్ష్మ, చిన్న పరిశ్రమలు వున్నాయి. వీటిలో 11 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిని పట్టించుకోకుండా వదిలివేశారు. 3 నెలల లాక్‌డౌన్ కాలంలో సైతం ఎం.ఎస్.ఎం.ఈ.ల మీద జీఎస్టీని రద్దు చేయలేదు. కరెంట్ బిల్లులను సైతం రద్దు చేయలేదు. పైగా వారి నుంచి నెలవారీగా వసూలు చేసే టాక్సులను సైతం వదిలి పెట్టకుండా వసూలు చేశారు. ప్రభుత్వ విధానాలు, నిర్లక్ష్యం ఫలితంగా ఎంఎస్ఎంఈలలో 37% (అంటే మూడవ వంతు) పైగా తమ వ్యాపారాలు మూసివేస్తున్నట్లు అఖిల భారత వస్తూత్పత్తి దారుల సంస్థ (ఎఐఎంఓ) యిటీవల ప్రకటించింది.

మొత్తంగా ఈ 20 లక్షల కోట్ల ప్యాకేజీ డొల్ల. సామాన్యులకు, ఉపాధి రంగంలో కొట్టుమిట్టాడుతున్న వారికి ఏ వుపయోగం లేదు. కేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి మాటలు గారడి మాటల్ని తలపించాయి.

అలానే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయా రంగాల పరిరక్షణకు, వలస కార్మికులను ఆదుకోవడానికి ఏమీ చేయలేదు. నిర్మాణాత్మకమైన ఏ చర్యా తీసుకోలేదు. కొన్ని రాష్ట్రాలు ప్రకటించినట్లు డీజిల్, పెట్రోల్‌లపై సెస్సు భారాన్ని కూడా తగ్గించలేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వుపయోగించుకుని, మరింతగా కార్మిక హక్కులను కాలరాయడానికి పూనుకున్నారు. వివిధ రూపాలలో ప్రజల మీద ఇంకా భారాలు మోపడానికే యత్నించారు.

## వలస కార్మికుల నుంచి అసంఘటిత రంగాల దాకా కష్టాలు – కన్నీళ్లు – ప్రభుత్వ సహాయ నిరాకరణ

దేశంలో వలస కార్మికుల వెతలు ప్రపంచమంతా చూసింది. 14 కోట్ల మంది బతుకు జీవుడా అంటూ కాళ్ళీడ్చుకుంటూ స్వస్థాలకు వెళ్ళారు. ఎక్కడ ప్రాణం వుంటుందో, పోతుందో, గంటలేకున్నా – అయినా వాళ్ళ దగ్గర వుంటే చాలనుకుని వెళ్ళారు. వారి కష్టాలకు, కన్నీళ్ళకు ప్రభుత్వాలు చలించలేదు. వారి మానాన వారిని వదిలి వేశారు.

## పోటు రంగారావు

ఇంకా దేశంలో అసంఘటిత రంగంలో పదుల కోట్ల మంది వున్నారు. వీరిని ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోలేదు. గోడౌన్లలో ముక్కి పోతున్న బియ్యాన్ని రేషన్ కార్డు మీద 10 కేజీలు యిస్తూ సరిపుచ్చింది. కార్డులేని వారి గతి అంతేనన్నట్లు చేసింది. అనేక నిరసనలు వచ్చిన తర్వాత కార్డు లేని వారికి యిస్తామని ప్రకటించారు. ఎవరికి యిచ్చారో, ఎవరికి యివ్వలేదో లెక్కలే లేవు.

హైదరాబాద్‌లో తాపీ, మట్టి, కార్పెంటర్, పెయింటర్, ప్లంబర్, ఎలక్ట్రిసిటి వర్కర్స్, మార్బుల్ వర్కర్స్, రాడ్ బైండర్స్ ఇలాంటి రకరకాల పనులు చేసే వారు 20 లక్షల మంది వున్నారు. వీరందరికి, వెల్‌ఫేర్ బోర్డులు వున్నాయి. కానీ వీటి నుంచి ఏ సహాయం చేయలేదు. ముఖ్యంగా తెలంగాణా ప్రభుత్వం మాటలు చెప్పింది.

ఈ లాక్‌డౌన్ కాలంలోనే న్యూఢిల్లీ ప్రభుత్వం రెండు దఫాలుగా ఈ అసంఘటితరంగ కార్మికులకు రూ. 10,000 లు సహాయం అందించింది. పంజాబ్ ప్రభుత్వం మూడు దఫాలుగా రూ. 9,000 లు అందించింది. హర్యానా ప్రభుత్వం వారానికి రూ. 1000 ల చొప్పున 5 వారాలకు రూ. 5,000 లు సహాయం అందించింది. కేరళ ప్రభుత్వం రూ. 3,000 లు, 17 రకాల నిత్యావసర వస్తువులు అందించింది. రాజస్థాన్ ప్రభుత్వం రూ. 3,500 లు, మధ్యప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, తమిళనాడు ప్రభుత్వాలు రూ. 2,000 లు చొ॥న, మణిపూర్, ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్ ప్రభుత్వాలు కొంత మేరకు సహకారం అందించాయి. తెలంగాణా ప్రభుత్వం నెలకు కేవలం 1500 రూ॥లు ఇచ్చి చేతులు దులుపుకున్నది.

కానీ, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చప్పట్లు, తాళాలు మోగించడం, దీపాలు వెలిగించడం మీదనే శ్రద్ధ పెట్టాయి.

మన రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు వున్నది. దాని నిధి 2,214 కోట్లు వున్నాయి. అవి ఆ కార్మికుల నిధి. వారి సంక్షేమానికి ఖర్చు పెట్టాలి. భవన నిర్మాణాలలో 10 లక్షలకు పైగా నిర్మించే పనికి గాను, ప్రతీ ఖర్చు రూ. 100 లలో 1 రూపాయి అంటే 1% ఈ సంక్షేమ బోర్డుకు చెల్లించాలి. ఆ మేరకు 2014 నుంచి 2020 వరకు జమ అయ్యింది. 2214 కోట్ల రూపాయలు. ఈ నిధులు ఆపద సమయంలో కూడా ఖర్చు పెట్టకుండా ప్రభుత్వం ఇతర అవసరాలకు, సౌకర్యాలకు వాడుకుంటుంది. ఇది దారుణం.

కొన్ని నిర్మాణ సంస్థలు ఈ నిధికి చెల్లించాల్సినవి చెల్లించడం లేదు. హైదరాబాద్ మెట్రో వారు 162 కోట్ల రూ॥లు, మిషన్ భగీరథ వారు 368 కోట్ల రూపాయలు, కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రగతి భవనం, ఎమ్మెల్యే వసతి గృహం, తదితర ప్రభుత్వ కట్టడాల నుండి వసూలు కావాలి. జి.హెచ్.ఎం.సి. పరిధిలోని బకాయిలే దాదాపు 2,000 కోట్లు ఈ నిధికి జమ కావాలి.

ఇవి జమ చేయక పోగా, ఉన్న నిధిని కార్మికులు లాక్‌డౌన్ పీరియడ్‌లో కడుపులు కాల్చుకుంటూ వుంటున్నా వినియోగించలేదు.

రేషన్ కార్డులు లేనివారు, భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు చెందిన కార్డులు కలిగి వున్నవారు 2 లక్షల మందికి పైగా తెలంగాణ రాష్ట్రంలో, ఎక్కువగా హైదరాబాద్ నగరంలో వున్నారు.

ఇతర రంగాల సంక్షేమ బోర్డుల పరిస్థితి కూడా యిదే. ప్రభుత్వం వారి నిధిని, వారికి అత్యవసర పరిస్థితులలో కూడా ఖర్చు పెట్టక పోవడం చూస్తే ప్రభుత్వం ఈ శ్రామికుల పట్ల ఎలాంటి శ్రద్ధ చూపించటం లేదని అర్థమవుతున్నది.

## వైద్యో నారాయణో – 'హరీ'

కరోనా ముంచుకొస్తున్నా – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు నామమాత్రం. డిశంబర్ నుంచి హెచ్చరికలు వస్తున్నా, ముఖ్యంగా జనవరిలో కేరళలో ప్రారంభమయినా, ప్రభుత్వాలను మార్చడానికి, ట్రంప్ సభలను ఏర్పాటు చేయడానికి ఆరాటపడింది తప్ప, ఏ చర్యలూ చేపట్టలేదు. మార్చి 24 నుంచి లాక్‌డౌన్ ప్రకటించినా, 3 నెలలపాటు ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయడానికి పూనుకోలేదు. లాక్‌డౌన్ విధించడం, వీధుల్లోకి వచ్చిన వారిని బాదడం చేశారు కానీ, కరోనాను ఎదుర్కోవడానికి నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించలేదు. ఫలితంగా ఈ నాటికి జిల్లా, మండల కేంద్రాలలో కోవిడ్ టెస్టులకు తగిన ఏర్పాట్లు లేవు. రోగులు గంటల తరబడి లైనులో నిలబడాల్సి వస్తున్నది. పాజిటివ్ వచ్చిన వారు ఏ హాస్పిటల్‌లో చేరాలో అనే సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ జిల్లా కేంద్ర హాస్పటల్లో సైతం ఆక్సిజన్ అందించలేని పరిస్థితి ఎదురవుతున్నది. తెలంగాణాలో తగిన టెస్ట్ కిట్‌లే సమకూర్చుకోలేదు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడులలో రోజుకు 17 వేల నుంచి 46 వేలకు పైగా టెస్టులు చేస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలో కనాకష్టంగా నిన్న, మొన్నటి వరకు 9,500 మాత్రమే టెస్టులు చేస్తున్నారు. ఇంత తక్కువగా చేయడంలోని మతలబు కూడా తక్కువ వుందని చూపించుకోవడం, కొందరికి వేరే మార్గాలకు మళ్ళించడానికేనని స్పష్టమవుతున్నది.

ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో 1085 కంటైన్‌మెంట్ జోన్లు వుండగా, 2941 బృందాలు వాటిపై నిఘా పెట్టాయని చెబుతున్నది. సుమారు 1.5 లక్షల ఇండ్లు క్వారంటైన్‌లో వున్నాయని చెబుతున్నది. దాదాపు 1100 సెంటర్లలో పరీక్షలు చేస్తున్నట్లు చెబుతున్నది. ఇవన్నీ ప్రభుత్వ లెక్కలు – కానీ చాలా మంది ప్రైవేట్‌గా పరీక్షలు చేయించుకుంటున్నారు. ఎవరికి వారే హోం క్వారంటైన్‌లో గప్‌చుప్‌గా వుంటున్నారు. ప్రైవేట్ హాస్పటల్స్‌లో లక్షలకు లక్షలు పోస్తూ చికిత్స చేయించుకుంటున్నారు.

ప్రభుత్వం ముందు చూపుతో కోవిడ్ హాస్పటల్స్‌ను పెంచలేదు. ప్రైవేట్ హాస్పటల్స్‌ను తమ స్వాధీనంలోకి తీసుకోలేదు. మొత్తం వైద్యం తమ బాధ్యతగా అందించే పనికి పూనుకోలేదు. బడ్జెట్ కేటాయింపులు 100 లేదా 200 కోట్లు మాత్రమే. ప్రభుత్వం హడావుడిగా సచివాలయానికి మాత్రం 400 కోట్లు కేటాయించడాన్ని బట్టి కాని ప్రభుత్వ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

పైగా గాంధీ హాస్పటల్, ఇతర ప్రభుత్వ హాస్పటల్లో సౌకర్యాలు మెరుగుపరచలేదు. ఎక్కువ మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే. వారికి జీతాలు కూడా నెలనెలా యివ్వడం లేదు. ఉద్యోగ భద్రత లేదు. పైగా డాక్టర్ల రిక్రూట్‌మెంట్ లేదు. ఫలితంగా గ్లౌజులు, మాస్కులు కూడా యివ్వకుండా వారిని ఈ అంటు వ్యాధితో పోరాడమంటున్నారు. వారికి సౌకర్యాలు లేక అసౌకర్యంగా వుండటమేకాదు, వారు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఏర్పడింది. ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి కరోనా ఆరంభ దశలో, వీరత్వం ప్రకటించి, చప్పట్లు కొట్టించారు. దీపాలు వెలిగించారు. నేడు చేతులెత్తేసి దాని గురించి కనీసంగా మాట్లాడటం లేదు. ప్రజలను కరోనా వైరస్‌కు వదిలి వేశారు.

## ప్రైవేట్ దోపిడీ

ఇదే అదనుగా ప్రైవేట్ హాస్పటల్స్ దుకాణాలు తెరిచాయి. కొందరు ఫైవ్‌స్టార్ నుంచి సాధారణం వరకు లాడ్జిలు బుక్ చేసి వైద్యం అందిస్తామని నర్సులను పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ప్రైవేట్ హాస్పటల్స్‌లో చేర్పుకున్న వారిని కరోనా కంటే, వారి బిల్లులతో భయపెడుతున్నారు. 5 లక్షల నుంచి 16 లక్షల దాకా బిల్లులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. సాధారణ హాస్పటల్స్ సైతం రోజుకు 70 వేల చొ॥న ముందే డిపాజిట్ కట్టించుకుంటున్నారు. ప్రజలను లూటీ చేస్తున్నారు. ప్రభుత్వానికి తెలిసినా, దానిని నివారించే పరిస్థితి లేదు. ప్రైవేట్ దందా యధేచ్ఛగా సాగుతున్నది.

## సైన్స్ మాత్రమే ఎదుర్కొంటుంది

కరోనా అంటువ్యాధి. మ్యుటేషన్ ద్వారా వచ్చింది. దీని పరిణామానికి అనుగుణంగా సైన్స్ మందు కనుక్కోవాలి. కనుక్కొంటుంది. ఆ కృషి కొనసాగుతున్నది.

కానీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి మన ప్రభుత్వాల దాకా, బాబాలు, యోగులు, భోగులు, స్వాములు దీనిని మూఢత్వంగా మార్చే యత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మార్చి 22న జనతా కర్ఫ్యూ, ముగింపున, చప్పట్లు, తాళాలు కొట్టమని ప్రకటిస్తే, ఆర్ఎస్ఎస్, బీజేపీ సోషల్ మీడియా మూఢత్వ ప్రసార భావజాలాన్ని ప్రజల మీదకు వదిలింది.

(మిగతా 5వ పేజీలో)

# ఆగస్టు 5 - చరిత్రలో చీకటి రోజు

## సంపాదకీయం

ఆగస్టు 5- మోడీ హయాంలో 'బ్లాక్ డే'గా మిగిలిన రోజు. చారిత్రక యధార్థాలను, చలన జీవితాలను చీకటి గర్భంలోకి నిర్ధాక్షిణ్యాగా నెట్టిన రోజు. ఒక ఆగస్టు 5 - కాశ్మీర్ జాతి ఆకాంక్షలన్నింటిని సమాధి చేసి, వారి కలలనూ, నడకనూ ఆంక్షల చట్రంలో బంధించి, సంవత్సర కాలం అయిన రోజు. కాశ్మీర్ జాతినీ, వారి హద్దు, పద్దులనే ముక్కలు చేసి, ఉన్మాదంతో తృప్తిగా నవ్విన రోజు. ప్రజలు మూగవేదన, మౌనరోదనలతో కునారిల్లుతూ - నాజీయిజాన్ని భారత మోడీయిజంగా భరిస్తున్న రోజు. మరొకటి - చారిత్రక విభాత సంధ్యల మానవతా వికాసంలో, పయనంలో విలసిల్లిన బహుళ సంస్కృతిని, భిన్న మతాల సమ్మేళనాన్ని ఛిద్రం చేస్తూ, విద్వేష, మూఢత్వ బాణాల మాటున, భూమిలో పాతుకున్నవే రామాలయ నిర్మాణ యిటుకలు. చూడటానికి భక్తి రసమో, ముక్తి రసమో కానీ... అది జరిగిన తీరు భారత లౌకిక సంవిధానమనే దానికి నగ్నంగా సమాధి చేసిన రోజు.




అయోధ్య రామాలయం - ఆర్ఎస్ఎస్, బీజేపీల అవిశ్రాంత ఎజెండా - ఒక సుదీర్ఘ కాలపు అధికార అందలంబు కోసం సాగించిన ప్రయాణం, అది దేశాన్ని రెండు ముక్కలుగా మానసికంగా విడదీసింది. ఆ ప్రయాణం నిండా ఎంతటి నెత్తురును పారించిందో? ఎంత అనాగరికతనూ, హింసా కాండనూ ప్రోది చేసిందో?! ఆధునిక కాలంలో సుస్థిరంగా ఉండాల్సిన జీవితాలు నిలువెల్లా చిగురుటాకులా వణికి పోయిన కాలమిది. అందుకే విద్వేషాగ్నుల పాలకులకు అది ఒక మోదం. విలాపాగ్నుల జన జీవనానికి అది ఒక ఖేదం - బేధం

1925వ సంవత్సరములో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పుట్టింది. దాని ప్రణాళికలో హిందూ రాష్ట్ర భావం తప్ప అయోధ్య రామాలయం అనే అంశమే లేదు. 1951లో జనసంఘ్ పుట్టింది. అలానే 1964లో వి.హెచ్.పి. అంటే విశ్వ హిందూ పరిషత్ పుట్టింది. వీటన్నింటి జెండాలో, ఎజెండాలో రామాలయం, అయోధ్య అనే అంశాలే లేవు. అందుకే ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ ప్రకటించినట్లుగా యిది 5 శతాబ్ధాల పోరాటం అనేది అతిశయోక్తి - అబద్ధం. అయోధ్య, రామమందిరానిదంతా 3 దశాబ్ధాల (30 సం॥ల) నడమంత్రపు రాచబాట.

ఆర్ఎస్ఎస్, బీజేపీలు భారత రాజకీయ రంగాన వేళ్ళూనుకోవడానికి 1987 ప్రాంతంలో ఈ అయోధ్య, రాముడిని ఎజెండాగా ఎత్తుకున్నారు. ఆ నినాదం మీద ఆనాడు అద్వానీ రథయాత్రతో, భారత లౌకిక విధానంపై దండయాత్ర చేశాడు. ఊరూరా ఇటుకలతో ర్యాలీలు చేయించారు. వెనుకబడిన సమాజాన, సాంస్కృతిక చైతన్యం పరిమితంగా వున్న దేశాన రాముడికి గుడి పేరుతో దైవభక్తిని ప్రేరేపించారు. ఆ మాటున హిందూ - ముస్లిం విభజన రేఖ పెరిగిపోయింది. దేవాలయాల చుట్టూ, మతాల చుట్టూ, విద్వేషాల పట్టుతో రాజకీయం చెలరేగి పోయింది. హిందూ సేనలు కరవాలాలు దూయటం ఆరంభించారు. ఈ క్రమంలో 1992 డిశంబర్ 6వ తేదీన 4 శతాబ్ధాల బాబరీ మసీదు నేల మట్టం చేయబడింది. అదొక పూనకం. పాలకులు, కాషాయ శక్తులు కలిసి ఆడిన నాటకీయ ప్రక్రియలో ఆ గుమ్మటం నేలకూలింది. ఆ గుమ్మటాల కింద రాజ్యాంగ మత సామరస్యతా పుటలు నలిగి పోయాయి.

అందు నుంచే 2004లో 2 సీట్లు వున్న బీజేపీ 2014 నాటికి అధికార శక్తిగా మారి పోయింది. 2019 నాటికి మరింత పట్టును పార్లమెంటు మీద బిగించింది. 2వ దఫా అధికారం దాని నిజ ఎజెండాతో చెలరేగిపోవడానికి తోడ్పడింది. వరుస క్రమంలో కాశ్మీర్‌లో 370ని రద్దు చేయటమే గాకుండా, దాని ఉనికినే మార్చి వేసింది. తరువాత సుప్రీం కోర్టు లిటిగేషన్‌ను కూడా మ్యుటేషన్ చేసుకుని, బాబరీ మసీదు కూల్చివేత, నేరపూరిత చర్య అంటూనే, పాప పంకిల చేతులకే ఆ స్థలాన్ని అప్పగించింది. ఆలయ నిర్మాణాన్ని ట్రస్ట్‌కు అప్పగించినా, అది ఉత్తుత్తి మాటే అయ్యింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పరివారమే ఆ నిర్మాణాన్నీ, నడకనూ నిర్ణయిస్తున్నది. ఆ తరువాత సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీ చట్టాలనూ తెచ్చింది. పౌర జాబితా తయారు పేర పక్కా హిందూ రాష్ట్ర నిర్మాణానికి రాజ్యాంగ సౌధాన్ని వినియోగించుకున్నది.

ఆలయ నిర్మాణం మీద వివాదం ఇంత వివాదాస్పదం, వైషమ్యం, ఉద్రిక్తతలు పెరగడం యాధృచ్ఛికంగా జరగలేదు. ఇది సావధానంగా, సామరస్యంగా పరిష్కరించుకోవడానికి అవకాశమున్నా, దానికి అంగీకరించలేదు. ఆర్ఎస్ఎస్ ఈ సమస్యకు ఆజ్యం పోసింది. కేవలం రామాలయం కోసం కాదు. రాజ్యం కోసం. అందుకే 30 ఏండ్లు ఆ సమస్యను సాగదీసింది. దేశంలో ఆర్థిక, రాజకీయ, విద్యా, వైద్యం సమస్యల కంటే ఆలయ నిర్మాణమే జాతి గౌరవం అనేలా హిపోక్రసీని రగిలించాయి. అందుకే మధ్యలో రాజీ వాతావరణం ఏర్పడినా ఆర్ఎస్ఎస్ చెదరగొట్టింది. చెడగొట్టింది.

సిప్లాసింగ్ (Cipla Singh) అనే జర్నలిస్టు 'అయోధ్య రామాలయం - బాబరీ మసీదు' అనే పుస్తకం రాశారు. అది హిందీ పుస్తకం. ఆ పుస్తకంలో ప్రభుత్వ సమాచార పత్రాలతో, వాస్తవాలతో ఆయన అనేకం పేర్కొన్నారు.

1987లో షాబాను కేసును ప్రభుత్వం తిరగదోడి, నాటి ముస్లిం పెద్దలను సంతృప్తి పరిచింది. అదే సందర్భంలో హిందువుల కోసం రాజీవ్ గాంధీ రామాలయం తలుపులు తెరిపించాడు. దీని వెనుక ఆర్ఎస్ఎస్ వత్తిడి వున్నది. దానికి లొంగిపోయిన చరిత్ర కాంగ్రెస్‌ది. ఫైజాబాద్ కోర్టులో నడుస్తున్నప్పుడు, ఈ వివాదంపై 1992లో ఒక ట్రస్ట్‌ని ఏర్పరిచారు. ఆనాడు ఇరుపక్షాల మత పెద్దల సమక్షంలో జరిగిన సుధీర్ఘ చర్చలలో ఒక అంగీకారానికి వచ్చారు. ఆనాటికీ విదేశాలలో వున్న టెక్నాలజీ ప్రకారం బిల్డింగ్ నమూనా చెదరకుండానే, యధాతథంగా వేరే చోటుకు తరలించవచ్చు. బాబరీ మసీదు కట్టడాన్ని ఆ టెక్నాలజీతో ప్రక్కకు తరలించి, ఆ స్థలంలో రామమందిరం కట్టాలని ఆలోచించారు, నిర్ణయానికి వచ్చారు. ముస్లిమ్ నాయకుడు సయ్యద్ షాబుద్దీన్, ఆర్ఎస్ఎస్ తరపున అశోక్ సింఘాల్ సైతం దానికి అంగీకరించారు. ఆ తరువాత అశోక్ సింఘాల్‌ను ఆనాటి ఆర్ఎస్ఎస్ ఛీఫ్ బాలసాహెబ్ దేవరస్ పిలిచి, చీవాట్లు వేసి, ఇంత తేలిగ్గా పరిష్కారమైతే, మన సుధీర్ఘకాల ప్రణాళిక ఏం కాను? అని ప్రశ్నించాడట. ఆ మందలింపుతో తదుపరి సమావేశంలో అశోక్ సింఘాల్, ఆర్ఎస్ఎస్ పెద్దలు రూటు మార్చారు. అంటే సమస్యకు శాంతియుత పరిష్కారం, ఆలయ నిర్మాణానికి మాత్రమే దారితీస్తుంది. రాముడికి గుడి మాత్రమే నిర్మాణం జరుగుతుంది. కానీ ముందు ప్రభుత్వంలోకి రావాలనే రాజకీయ ఎజెండా నెరవేరదు. అందుకే ఏ శాంతియుత మార్గాల ద్వారా రామాలయ నిర్మాణానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు అంగీకరించలేదు. రామరాజ్య కాంక్షలు కదా! రామరాజ్య స్థాపన శంభూకుని తల తెగ నరకడం లాగా నెత్తురూ, కన్నీళ్ళూ, విధ్వంసం, భీభత్సం లేకుండా జరగదు కదా!

దేశంలో రాముడికి 800కు పైగా దేవాలయాలు వున్నాయి. భద్రాచలం లాంటి అతిపెద్ద ఆలయాలు వున్నాయి. ఈ స్థితిలో రాముడికి గుడి లేదనడం కరెక్టు కాదు. పైగా గుడి కట్టుకోవడానికి విధ్వంసాలకే పూనుకోవాల్సి వుందా? అయోధ్యలో యింకా రామాలయాలూ వున్నాయి.

సంత్ తులసిదాస్ రామభక్తుడు. ఆయన 'రామ చరిత్ మానస్' అనే గ్రంథం క్రీ.శ. 1640లో రచించాడు. అందులో అయోధ్యలోనే, బాబరీ మసీదు స్థలంలోనే రాముడు జన్మించాడనే ప్రస్థావనే తేలేదు. అప్పటికి క్రీ.శ. 1527లోనే బాబరీ మసీదును నిర్మించారు.

ఎటొచ్చి - మందిరాలూ, మసీదులూ, చర్చీలూ, మతాలూ, కులాలూ మన ఉద్వేగాలకూ, విద్వేషాలకూ కారణాలుగా మారుతున్నాయి. మన నిరుద్యోగం, పేదరికం, అసమానత్వం, అనారోగ్యం, అవినీతి, ఇలాంటి సామాజిక రుగ్మతల కంటే - సంకుచిత దృక్పథాల చుట్టూ మన మానసిక వేదనల్ని త్రిప్పుతున్నారు. అంబానీ, ఆదానీల సంపద, కుబేరుల సంఖ్య పెరుగుతూ, 1 శాతం మంది చేతులో 75 శాతం సంపద పోగు బడుతుంటే - వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఆత్మహత్యలు, భద్రతలేని బతుకులు సాగుతుంటే... ఆ జీవిత యధార్థ వ్యధల మీద మన చూపులు పోకుండా, ఆలయాలు, మూఢ విశ్వాసాలు అడ్డుపొరల్లా, మన కండ్లను కమ్ముతున్నాయి.

అందుకే లౌకిక రాజ్యాంగం అని చెప్పుకున్న భారత రాజ్యాంగానికి, అగ్ర ప్రతినిధిగా వున్న ప్రధాన మంత్రి మోడీ, ఒక మత ఆలయ నిర్మాణానికి పునాది రాయివేయడం, స్వాములు, మత విద్వేషకులతో కలగలసి సాష్టాంగాలకు పోవడం, మన సమాజ పోకడను తెలియజేస్తున్నది. తెగింపు, బరితెగింపు తేటతెల్లంగా బయటికి వస్తున్నది. రామరాజ్య నిర్మాణమంటే చల్లటి ప్రజా పాలన అనేది భ్రమ. శంభూకుడి తల నరికిన రాజ్యం - గుజరాత్ నరబలి సాగించిన రాజ్యం. నేడు దేశంలో హిందూ మత రాజ్యంగా రూపుదిద్దుకుంటున్నది. ఆర్ఎస్ఎస్ 100 ఏండ్ల ఉన్మాద కుల, రంగులుగా విప్పారుతున్నది. మన ప్రజాస్వామ్యానికీ, లౌకిక విధానానికీ అది పాతర. మన హక్కుల గొంతుల పోరాటానికి చెర. మొత్తంగా నాజీయిజం తిరిగి, మోడీ యిజంగా ఫాసిస్టీకరణ వేగంగా జరగుతున్న దానికి యిది మరో సంకేతం.

దేవుడు, దయ్యం మీద భక్తితో పూనకానికి పోతే, ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం. అందుకే ఈ ఫాసిస్టు రీతిని ఎండగట్టాలి. ఎదుర్కోవాలి.

# చీకటి రోజులలో బందీలు - చెరసాలలో వరవరరావు, సాయిబాబా

*జైలు గోడలని చూపించి భయపెడతావేం*
*జులుం చెలాయించే మాటలనీ*
*మూఢత్వం ఆవరించిన రాత్రినీ*
*నేను ఒప్పుకోను, లోబడి లొంగిపోను*

*- హబీబ్ జాలిబ్*

కవి వరవరరావు, 80 సంవత్సరాల వయసు, జైలు నిర్బంధంలో మగ్గుతున్నాడు. కవి, రచయితా, ఉద్యమ కారునిగా నాలుగు దశాబ్దాలకి పైబడిన వరవరరావు రాజకీయ జీవితంలో తప్పుడు కేసులూ, జైలు నిర్బంధమూ కొత్త కాదు, నిత్యం ఒక భాగంగానే వున్నాయి. ఇప్పుడు కూడా అలాంటి తప్పుడు, బూటకపు ఆరోపణలపైన్నే తనని నిర్బంధించారు. వయసు పైబడిన వరవర రావుని ఉపా చట్టం కింద, బీమా–కోరేగాం కేసులో ఇరికించి నిర్బంధించారు. ఈ కేసులో ఇంకొక పదిమంది ప్రజా కార్యకర్తల, న్యాయవాదులని కూడా ఇరికించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వరవరరావు పదహారు నెలలు పూణేలోని యెరవాడ జైలులో పద్దెనిమిది నెలల నిర్బంధం తరవాత, ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో బొంబాయి తలోజా జైలుకి మార్చారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వరవరరావుకి సెయింట్ జార్జ్, జెజె ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స అందించామని చెప్పిన తర్వాత, కోవిడ్ వ్యాధి సంక్రమించింది. కుటుంబ సభ్యులు తనని జెజె ఆసుపత్రిలో చూసే సమయానికి ఆయన ఎలాటి సహాయమూ లేకుండా మంచంలో పడి వున్నారు, బట్టలు మూత్రంతో తడిసి వున్నాయి. చివరికి తనని నరాల వ్యాధి చికిత్సకి నానావతి ఆసుపత్రికి తరలించారు. సుదీర్ఘ నిర్బంధం తన ఆరోగ్యాన్ని, దేహాన్ని బాగా దెబ్బతీసింది. మనిషిని కుంగదీసింది. నిర్భీతిగా, నిక్కచ్చిగా సూటిగా, స్పష్టంగా మాట్లాడే మనిషిని అస్పష్టంగా, మాటలకై తడబడే దుస్థితిలోకి నెట్టింది. ఇజ్రాయిల్ పౌరురాలు, పాలస్తీనా కవి దరీన్ తతూర్‌ని, ఇజ్రాయిల్ ప్రభుత్వం నిర్బంధించింది. ప్రజలు ప్రతిఘటించాలని తన కవిత్వంలో పిలుపునిచ్చినందుకు తనకి జైలు శిక్ష వేశారు, టెర్రరిస్టులతో తనకి సంబంధాలున్నాయని ఆరోపించారు. "నేను నిర్బంధంలో వున్న కవిని. నేరారోపణ నన్ను ఆపాదమస్తకం కుంగిపోయేలా చేసింద"ని దరీన్ తతూర్ అంటుంది. వరవరరావు మీద కూడా, బీమా కోరేగావ్ కేసులో హింసకు ప్రేరేపించాడనే నేరాన్నే మోపారు.

హింసకు ప్రేరేపించి, రెచ్చగొట్టిన అసలు కుట్రదారులు స్వేచ్ఛగా, ఎలాంటి అడ్డంకులూ లేకుండా తిరుగాడుతుంటే, ఆ హింసా ఘటనలతో ఎలాంటి ప్రమేయమూ లేని వ్యక్తులని నిరంకుశ ఉపా చట్టంకింద నిర్బంధించిన ఉదంతాలకి బీమా కోరేగావ్ కేసు మరొక ప్రత్యక్ష ఉదాహరణ. 2018 జనవరి 1 న జరిగిన ఘటనలకు బాధ్యులుగా ఉపా చట్టం కింద వరవరరావుతో సహా పదకొండు మందిని నిర్బంధించారు. పూణె నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో వున్న బీమా కోరేగావ్ వద్ద జరిగిన యుద్ధానికి, ద్విశతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్న వారిపై కాషాయ మూక దాడికి పాల్పడింది. ఈ హింసా దాడికి మూడు రోజుల ముందు, సమీప గ్రామంలో దళిత సైనికుడు గోవింద్ గోపాల్ మెహర్ సమాధిని





కూడా వాళ్ళే ధ్వంసం చేశారు. అయినా డిసెంబరు 31న ఎల్గార్ పరిషద్ నిర్వహించిన సభలో ఉపన్యాసాలే హింసను ప్రేరేపించాయని పోలీసులు ఆరోపిస్తున్నారు. హేనీ బాబుతో సహా ముద్దాయిలుగా పేర్కొన్న మిగతా పదకొండు మంది గానీ, ఎవ్వరూ ఎల్గార్ పరిషద్ సభలో ప్రత్యక్షంగా పాల్గొన్నవాళ్ళు కాదు. వరవరరావు కూడా ఆ సభలో లేరు. అయినా, పూణే పోలీసులు, ఎన్ఐఎ తప్పుడుకేసును బనాయించారు. ఉపా చట్టాన్ని మోపారు. ఉపా నిరంకుశ చట్టం అన్ని సహజ న్యాయ సూత్రాలనీ కాలరాస్తుంది. నిర్దిష్టమైన నేరారోపణలు, విచారణ జరపకుండా జాప్యం చేస్తూ బెయిల్ విజ్ఞప్తులని పదే, పదే తిరస్కరించారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారాన్ని కోల్పోవడంతో, కేసుని మహారాష్ట్ర పోలీసుల నుంచి తప్పించి కేంద్ర సంస్థ ఎన్ఐఏకి అప్పగించారు. వైరస్, వరవరావు వృద్ధాప్య స్థితిని చూపించి ప్రయోజనం పొందజూస్తున్నారని ఎన్ఐఏ వాదించడం దాని అమానవీయతకి పరాకాష్టగా నిలుస్తుంది. ఉపా చట్టం వ్యక్తులనే, సంస్థలనే నేరస్తులుగా ముద్రవేస్తుంది. నేరాన్ని ఆరోపించిన వాళ్ళు ఆ నేరాన్ని రుజువు చేయాల్సిన బాధ్యత వహించాల్సిన సహజ న్యాయ సూత్రాలకి విరుద్ధంగా, నిందితులే తమ నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాల్సిన స్థితికి నెడుతుంది. వరవరరావు విచారణలో వున్నా ఒక ఖైదీ. శిక్ష పడలేదు, నేరారోపణకి రుజువులు లేవు, నిర్దిష్టమైన విచారణా లేదు, అయినా ఆయన ఇప్పటికే ఇరవై నెలలుగా జైలులో మగ్గుతున్నాడు.

వరవరరావు ఇంకా విచారణలో వున్న ఖైదీగా జైలు నిర్బంధంలో ఉండగా, 90 శాతం అంగ వైకల్యంతో వున్న ప్రొఫెసర్ సాయిబాబా శిక్ష పడిన ఖైదీగా నాగపూర్ జైలులో కొనసాగుతున్నాడు. నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధాలు కలిగివున్నాడనే ఆరోపణ మీద ఒక మహారాష్ట్ర కోర్టు సాయిబాబాకి జీవిత ఖైదు శిక్ష విధించింది. 2014లో అరెస్టయిన సాయిబాబా బెయిల్ పై బయటికి వచ్చిన తర్వాత మళ్ళీ నిర్బంధంలోకి తీసుకున్నారు. 2017 నుంచి నాగపూర్ జైలులో ఒంటరి నిర్బంధ శిక్షని అనుభవిస్తూ వున్నాడు.

'ఎక్కడ చనిపోతుందో తెలియని ఈగ లాగా నేను నా సెల్‌లో తిరుగుతూ వున్నాన'ని జైలులో వున్న ఇటాలియన్ కమ్యూనిస్టు గ్రాంసీ అంటాడు. అండా సెల్‌లో సాయిబాబా అలాంటి స్థితిలోనే మగ్గి పోతున్నాడు. అయితే, సాయిబాబా తన శారీరక వైకల్యం మూలంగా అలా తిరగను కూడా తిరగలేడు. కనీస వసతులు,వైద్య సదుపాయాలు సైతం లేకుండా చీకటి కొట్లో మగ్గే మనిషి అవస్థలకు సాయిబాబా పరిస్థితి ఒక ఉదాహరణ. తన దైనందిన కార్యక్రమాలని కూడా తనకుతానుగా చేసుకోలేని స్థితిలో ఎలాంటి సహాయమూ లేని అనారోగ్యకరమైన వాతావరణంలో సాయిబాబా నిర్బంధ శిక్షని అనుభవిస్తున్నాడు. గత జూలై నెలలో సాయిబాబా తన న్యాయవాదితో ఫోన్ లో మాట్లాడి తన పరిస్థితిని వివరించాడు. తన చుట్టూ కరోనా వ్యాధి వ్యాపిస్తూ ఉందనీ, తనకి కూడా వ్యాధి సోకే ప్రమాదం పొంచివుందనీ తెలియజేశాడు. పట్టించుకునేదెవరు? నిస్సహాయమైన తన ఆక్రందన కోర్టులకి వినపడుతుందా? మృత్యుశయ్యపై వున్న తన తల్లిని కడసారి చూసే అవకాశం కోసం బెయిల్ ఇవ్వాలని అభ్యర్థిస్తూ సాయిబాబా నాగపూర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసాడు. సాయిబాబా తల్లి కంటెయిన్మెంట్ జోన్‌లో ఉందనీ, బెయిల్‌పై తనని విడుదల చేస్తే, కరోనా వ్యాధి సోకే అవకాశం ఉందనీ కోర్టులో ప్రభుత్వం పచ్చి అబద్ధమాడింది. కోర్టు ఆ మాటలని అంగీకరించి సాయిబాబాకి బెయిల్ నిరాకరించింది. తన తల్లిని కడసారి చూసుకునే హక్కుని నిరాకరించింది. ఆ తల్లి చివరికి తన కొడుకుని చివరిసారి చూసుకోకుండానే చనిపోయింది. జైలు సిబ్బందికీ, ఖైదీలకీ కరోనా వ్యాధి సోకుతున్న వాతావరణంలో, మరణశయ్యపై వున్న తన తల్లిని చూసుకోవడంకంటే, జైలులో ఉండడమే సాయిబాబాకి శ్రేయస్కరం అన్న దుర్మార్గమైన ప్రభుత్వ వాదనని కోర్టు అంగీకరించింది. తనకి కనీసం తాత్కాలికమైన ఊరట కలిగించమని వేడుకుంటున్న సాయిబాబా విజ్ఞప్తులని కూడా కోర్టు వినిపించుకో లేదు.

ధిక్కార స్వరాలు, నిరసన గళాలు జైళ్ళలోనే మగ్గిపోవాలి. కాషాయ మూకల న్యాయ సూత్రమిదే. కోర్టులు కూడా ఇదే న్యాయమంటున్నాయి. కాషాయ మూక దేశంలోని అన్ని పాలనా వ్యవస్థల పైనా పట్టు సంపాదించింది. న్యాయవ్యవస్థ ఇందుకు మినహాయింపుగాలేదని రుజువవుతూవుంది. ఇవి చీకటి రోజులు. ఈ చీకటి రోజులని ప్రశ్నించి, ఎదిరించి, వీటి గురించి గొంతెత్తి మాట్లాడేవాళ్ళు ఇప్పుడు బాధితులు. ఈ చీకటి శాశ్వతం కాదు, దీన్ని పారద్రోలాల్సిందే!



## ఆగస్టు 7, 8 తేదీలలో స్కీం కార్మికుల నిరసన కార్యక్రమం

దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు పిలుపులో భాగంగా ఏడు ఎనిమిది తేదీలలో రెండు రోజులు నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. ఆ పిలుపులో భాగంగా అంగన్వాడి, ఆశావర్కర్లు ,మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

ఐఎఫ్‌టీయు నాయకత్వాన 15 మండల కేంద్రాల్లో 30 పాఠశాలల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘము రాష్ట్ర సెక్రెటరీ ప్రసాద్ నాయకత్వం వహించాడు. ఆయా మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో గోవిందమ్మ, దేవమ్మ ,నాగమ్మ ,పార్వతమ్మ, లక్ష్మి ,నీలకంఠం తదితరులు నాయకత్వం వహించారు.

# కనుమరుగవుతున్న నా కలల దేశం

ఆగస్ట్ 5, 2020 తీవ్రమైన విచారాన్ని, నష్టాన్ని కలిగించిన రోజు. ఎగుడుదిగుడుగా ఉన్నా, అందమైన, మానవత్వంతో కూడిన, విస్తృత ప్రజా బాహుళ్యానికి సమాన పౌరసత్వం ఉండాలన్న భావనలతో, ఆశాజనకంగా కొనసాగుతున్న భారతదేశ ప్రయాణాన్ని, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం నిలిపివేసిన రోజుగా చరిత్ర గుర్తుంచుకుంటుంది.

అది అసమానమైన అహంభావంతో, హిందూత్వ ఆధిపత్య భావజాలమే పునాదిగా, భారత రాజ్యాంగంలో దేశ ప్రజలు చేసిన ప్రతిజ్ఞను పూర్తిగా తారుమారు చేస్తున్న ప్రభుత్వం.

ఈ విషాదాన్ని ముందే చెప్పారా? 1948, జనవరి నెల చలికాలపు రోజు మధ్యాహ్న సమయాన సర్వమత ప్రార్ధనలలో ఉన్న మహాత్మాగాంధీ బలహీనమైన శరీరంలోకి బుల్లెట్లు దూసుకు పోయిన నాటి నుండి, హంతకుని భావజాలం చివరికి విజయం పొందేందుకే కట్టుబడి ఉందా? ఏదో ఒక రోజు ఈ దేశం అన్ని విధాలుగా సమానంగా ప్రతీ విశ్వాసం, ప్రతీ కులం, ప్రతీ వర్గం, ప్రతీ స్త్రీ, పురుషునికీ, సమాన సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ఉన్న ప్రతీ జాతికి, ప్రతీ వర్ణానికి, సామర్థ్యం ఉన్న ప్రతీ ఒక్కరికీ చెందుతుందని కన్న రంగుల కలలన్నీ కల్లలవడం అనివార్యమైందా?. ఇదే కల భవిష్యత్ తరాలకు నిజం కాకుండా నాశన మైనట్లేనా?

అదుపు లేని సమూహాల హింసాత్మక చర్యలతో కూల్చి వేయబడిన మధ్య యుగాల కాలం నాటి ఒక మసీదు స్థానంలో నిర్మించనున్న హిందూ దేవాలయ నిర్మాణం కోసం జరిగే ఒక ప్రైవేటు కార్యక్రమానికి, రాజ్యాంగ నియమ నిబంధనలను అన్నింటినీ ఉల్లంఘించి అధ్యక్షత వహించడానికి తీసుకున్న మన ప్రధానమంత్రి నిర్ణయం హిందూమత తీవ్రమైన పురుష ఆధిపత్య విజయాన్ని సూచిస్తుంది. భారతదేశ కొత్త రిపబ్లిక్ లో స్థిర నివాసం ఏర్పరుచుకున్న ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకొనే భయంకరమైన ప్రాంతాల్లో అది ఒకటి అని, భారతదేశంలోని మైనారిటీ మతస్థులకు స్పష్టంగా అర్థమయ్యేందుకే ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

### అనైతిక, క్రూర రాజకీయాలు

నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి ఇంత గొప్ప కార్యక్రమానికి హాజరు కాలేకపోవచ్చు. వారి భావజాలం పై విశ్వాసం లేని ఒక వైరస్ కారణంగా అతని రాక విచిత్రంగా ఆగిపోయింది. కానీ నేడు నరేంద్ర మోడీ చారిత్రాత్మకమైన రోజున అయోధ్యకు చేరడంలో, 2002 నుండి నేటి వరకు అనైతిక, క్రూరమైన రాజకీయాల్లో అతని సన్నిహితుని పాత్రను చరిత్ర ఖచ్చితంగా గుర్తించాలి. కాషాయ దుస్తుల్లో ఉండి చేసిన తప్పుడు పనులకు క్షమాపణలు కూడా చెప్పని అలవాటుతో ద్వేష రాజకీయాలు ఆచరించే మరొక మోడీ సహాయకుడు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఏ వివరమూ ఇవ్వలేదు.

బాబ్రీ మసీదు కూల్చివేత ఉద్యమ నిర్మాతలైన అద్వానీ, మురళీ మనోహర్ జోషీలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యత ఇవ్వకుండా మరుగున పరిచారు. 1989 లో అద్వానీ రథయాత్రకు ఉపయోగించిన టొయోటా రథం ప్రతీ చోటా రక్తపు మరకలను వదిలి వెళ్తూ, భయాందోళనలకు గురి చేసింది. ఆ రథం ఫోటోలే నరేంద్రమోడీ ఉద్యమానికి జూనియర్ వాలంటీర్ అనే విషయాన్ని తెలియజేశాయి. మోడీ అయోధ్యలో అడుగు పెట్టిన సమయం, తన భావజాల మార్గదర్శిని అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఊహలో మెజారిటీ మతంగా ఉన్న హిందూ మత రాజ్యంగా మన గణతంత్ర రాజ్యం యొక్క రూపాన్ని మార్చే ప్రయత్నాన్ని సూచించింది. ఈ సమయంలో మోడీ చరిత్రలో ముఖ్యమైన తన కీర్తి, వైభవాల గురించి ఎవ్వరితోనూ పంచుకునేందుకు ఇష్టపడడం లేదు.

కానీ మోడీ-అమిత్ షా-ఆదిత్యనాథ్ త్రయం మాత్రమే ఒక పురాతన కాలపు యుద్ధాన్ని ఒక నిర్ణయాత్మకమైన, నాటకీయ ఉచ్ఛస్థితికి తీసుకొని వచ్చారు. ఒక శతాబ్దానికి పైగా కాలం నుండి హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతుదారులు ముస్లింలనూ, క్రైస్తవులనూ రెండవ తరగతి పౌరులుగా నివసించడానికి అనుమతించే హిందూ రాజ్య స్థాపన కోసం నిర్విరామంగా పోరాడుతున్నారు. బాబ్రీ మసీదును కూల్చివేసి, ఆ స్థలంలో రాముని దేవాలయాన్ని నిర్మించేందుకు చేసిన ఉద్యమం, ప్రక్కప్రక్కన ఉన్న రామ్ చాబుత్రా, బాబ్రీ మసీదులకు సంబంధించిన అనుకూలమైన ఒప్పందం లాంటి రాజకీయాలను భగ్నం చేసి స్వేచ్ఛను కోరే ప్రత్యామ్నాయ తలంపుకు బలమైన సంకేతం.

బాబ్రీ మసీదు స్థలంలో రామాలయాన్ని నిర్మించేందుకు చేస్తున్న ఉద్యమం విభజన తర్వాత జరిగే మత హింసకు, హత్యలకు గొప్ప ప్రేరణ. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రామ మందిర నిర్మాణానికి పునాది రాయి వేసేది స్పష్టమైనప్పటికీ, భగల్ పూర్ నుండి బొంబాయి, భోపాల్, గుజరాత్, ఉత్తర భారతదేశంలోని హిందీ ప్రాంతాల్లోని అసంఖ్యాకమైన నగరాలు, పట్టణాల వరకు రక్తపాతంతో కూడిన రామ మందిర శంకుస్థాపనలు జరిగాయి. ఈ క్రమంలోనే రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన అధికారులే నేరం చేసిన వారిని శిక్షించకుండా చట్టాన్ని, రాజ్యాంగాన్ని అలక్ష్యం చేశారు.

అందుకు బదులుగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు అసలు వాస్తవాలను మాట్లాడకుండా, చిత్తశుద్ధిలేని తనంతో, ద్వంద స్వభావంతో, చాలా ప్రమాదకరంగా గణతంత్ర రాజ్య వ్యవస్థ పునాదులు లేకుండా చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వ రాజకీయ చర్యలకు, ప్రభుత్వ నిర్ణయాలకు బహిరంగ మద్దతు పలుకుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ప్రధానమంత్రి బాబ్రీ మసీదు తాళాలు తీశాడు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇంకొక వ్యక్తి ప్రధానిగా ఉన్న సమయంలోనే మసీదును కూల్చి వేశారు.

## హర్ష మందిర్

అనేక మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రుల పదవీ కాలంలోనే పెద్ద ఎత్తున మతపరమైన చిచ్చులు రగిలాయి.

### కాంగ్రెస్ ద్వంద వైఖరి

నేడు కూడా, రామ మందిరానికి పునాది రాయి వేస్తున్నప్పుడు అనేక మంది రాజకీయ ప్రతిపక్ష నాయకులు, రాత్రి పూట పెద్ద దీపాల వెలుగు (హెడ్ లైట్స్) లో చిక్కుకుపోయిన లేడిపిల్లలా, దుర్బలమై, విచారంతో, చలనం లేకుండా, కలవర పడుతూ ఎటువైపు పరుగెత్తాలో నిర్ణయించుకోలేని స్థితిలో ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారు. " విచార కరమైన విషయం ఏమిటంటే, మంచి లేక చెడు చేయడానికి మానసిక సంసిద్ధత లేని వారే ఎక్కువ చెడు చేస్తారని " ఈ సందర్భంగా హన్నా ఆర్జెంట్ చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ లో కొన్ని వర్గాల వారు దేవాలయ నిర్మాణానికి బహిరంగంగా స్పష్టమైన మద్దతు ఇస్తున్నారు. కొందరు వేరుపడి పోయిన హిందూ ఓటరుకు చికాకు కలిగించ కుండా ఉండేందుకు మౌనంగా ఉండమని సలహా ఇస్తున్నారు.

" సీతమ్మ తల్లి, రామయ్యల సందేశం, దయాదాక్షిణ్యాలతో రామలల్లా మందిర నిర్మాణానికి వేస్తున్న పునాది రాయి జాతి ఐక్యతకు, సౌభ్రాతృత్వానికి, సాంస్కృతిక ఏకీకరణకు ఒక మంచి సందర్భం", అని కాంగ్రెస్ పార్టీలో అత్యంత పలుకుబడి కలిగిన వ్యక్తులలో ఒకరైన ప్రియాంకా గాంధీ వాద్రా ట్వీట్ చేశారు.

కేవలం హిందువులకు మాత్రమే కాక భారతీయులందరికీ ప్రధాన మంత్రి అయిన వ్యక్తి, కోర్టు ఆదేశాలనూ, చట్టాలనూ అతిక్రమించి, విధ్వంసకర సమూహాలు ఒక పెద్ద మసీదును కూల్చివేసిన స్థలంలో ఒక హిందూ దేవాలయ నిర్మాణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానమంత్రి ప్రతీక (సింబాలిజమ్) ఐక్యతకూ, సౌభ్రాతృత్వానికీ ఏ విధంగానూ ఒక మంచి సందర్భం కాలేదని చెప్పేందుకు వామపక్షాలు తప్ప ఎవరూ సిద్ధంగా లేరు.

వైవిధ్యమైన ఆరాధన, సాంస్కృతిక వ్యక్తీకరణలను అధిక సంఖ్యాకుల హింసాయుత అణచివేత, బ్రాహ్మణ భావజాల మరియు హిందూత్వ తీవ్రవాదం లోకి వాటి బలవంతపు విలీనీకరణల ప్రతివాదానికి ఇది ప్రతీక. మొత్తం రాజకీయ చట్రంలో ఏ ఒక్కరూ, భారత దేశంలోని ముస్లింలకు,ఇతర మైనారిటీ మతస్థులకు, వారి యొక్క సంస్కృతి, హక్కులు అధిక సంఖ్యాకుల స్వాధీనతకు అంగీకరించమని భరోసా ఇచ్చేందుకు సిద్ధంగా లేరు.

ఇది ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నుకోబడిన ప్రభుత్వం, ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఎన్నుకోబడి, రెండవ దఫా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, కాబట్టి తమ పార్టీ భావజాలానికీ, దార్శనికతకూ అనుగుణంగా భారతదేశాన్ని రూపుదిద్దేందుకు ప్రజలు ఆదేశించారని ప్రస్తుత ప్రభుత్వ మద్దతుదారులు వాదించవచ్చు. భారతీయ జనతా పార్టీకి ఎన్ని ఓట్లు లభించాయి, ఎవరు ఆ ఓట్లు వేశారు అనే విషయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, మొత్తం ఓట్లలో బీజేపీకి 37.6 శాతం ఓట్లు లభించాయి. వాటిలో 36 శాతం ఓట్లు హిందూ ఓటర్లు వేశారు. మెజారిటీ హిందువులు అంటే 52 శాతం ఓటర్లు బీజేపీ నాయకత్వం లోని ఎన్డీఏ కూటమికి ఓటు వేశారు. ప్రయోజనాలు పొందిన కులాలకు చెందిన వారు ఎక్కువగా బీజేపీని ఎంచుకున్నప్పటికీ, ప్రతీ మూడవ దళిత ఓటరు ఈవీఎం మీద ఉన్న బీజేపీ కమలం గుర్తు పైనే ఓటు వేశారు.

2014లో మోడీ ఉద్యోగాలు కల్పించి, దేశాన్ని అభివృద్ధి చేస్తామని వాగ్దానం చేసినట్లు కాకుండా, 2019 లో హిందూ జాతీయతా వాదమనే స్పష్టమైన రాజకీయ సందేశాన్ని ఇచ్చాడు. కాబట్టి భారతదేశంలోని మెజారిటీ హిందూ ఓటర్లు హిందూ జాతి చట్టాన్ని మరియు దాని అమలును ముందుకు తీసుకొని వెళ్ళేందుకు తనను ఆదేశించారని విశ్వసించడాన్ని మోడీ సమర్థించుకున్నాడు. మెజారిటీ ఆధిపత్య మత వర్గాల, జాతుల మద్దతుతో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం మానవత్వపు విలువలు గల ప్రజాస్వామ్యానికి ఏమి చేయగలదో 1930 లలో నాజీ జర్మనీ అనుభవమే ఒక భయంకరమైన ఉదాహరణ. బలమైన హింసాత్మక అసంఖ్యాక ఆధిపత్య మతస్థుల నుండి మైనారిటీ మతస్థులను కాపాడలేని ప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

### పెరుగుతున్న అసహన ప్రజాస్వామ్యం

ఏదో ఒక రోజు ద్వేషం, ముందో వెనకో ప్రేమ పైన విజయం సాధిస్తుందని ముందే చెప్పబడుతుందా? అనే ప్రశ్నను ఈ వ్యాసం ప్రారంభంలోనే నేను అడిగాను.

అయోధ్యలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వేసిన పునాది రాయి, భారతదేశాన్ని సంప్రదాయాల ప్రకారం అభిషేకించినట్లు, లేక రాజకీయ శాస్త్రవేత్త అయిన అశుతోష్ వర్షిణి వివరించిన విధంగా భారత దేశాన్ని ఒక అసహన ప్రజాస్వామ్య దేశంగా నిర్ణయించినట్లు సూచిస్తుంది. 500 సంవత్సరాలకు పైగా ఒక చోట ఉన్న ఒక మసీదు స్థానంలో ఒక వైభవోపేతమైన దేవాలయాన్ని నిర్మిస్తారు. పొడవైన ఈ దేవాలయం నీడలో నేను పెరిగిన నా దేశం హెచ్చు స్థాయిలో మరుగున పడి, శాశ్వతంగా లేకుండా పోతుంది.

అయినప్పటికీ, ఈ దేశం తనను అదుపు చేసే హీన బుద్ధిగల మత మౌఢ్యుల కన్నా గొప్పదని నేను నమ్ముతాను. సమాన పౌరసత్వ భావన ఉన్న ఒక మానవతా విలువలు గల దేశానికి పెద్ద దెబ్బ అని నేను అంగీకరిస్తాను. కానీ అది ఇంకా చల్లారలేదని కూడా నేను నమ్ముతాను. *( "సౌల్.ఇన్" (05.08.2020) సౌజన్యంతో)*

*అనువాదం -బోడపట్ల రవీందర్ వైరా ఖమ్మం జిల్లా 9848412451*

---

(2వ పేజీ తరువాయి)

ఆ సమయంలో చంద్రుడు రేవతి అనే కొత్త నక్షత్రంలోకి వెళుతున్నాడని చెబుతూ, ఆ సమయం అమావాస్య, చీకటి రోజు, ఆ సమయంలో వైరస్, బ్యాక్టిరియా, వాటి జీవులు, దుష్టశక్తులు ఆ రోజుల్లో గరిష్ట సామర్థ్యంతో వుంటాయని చెప్పారు. అందుకే 130 కోట్ల మంది చప్పట్లు కొడితే, ఆ వైబ్రేషన్ వలన, శబ్ద తరంగాల వలన వైరస్ శక్తి కోల్పోతుందని, అందుకే మన పూర్వీకులు ఎత్తైన కొండల మీద వున్న దేవాలయాలలో గంటలు మ్రోగిస్తారని ప్రచారం చేశారు. చిన్నా, పెద్దా మోతలు మ్రోగించారు. 4 నెలలు గడిచింది. వైరస్ సామూహికత సంతరించుకున్నది తప్ప పోలేదు.

ఒక బాబా గారు అప్పడాలు తింటే పోతుందని అన్నారు. మరొక స్వామి గోమూత్రం తాగితే పోతుందని అన్నారు. ఇంకా స్వామీజీ మే 5వ తేదీన పుటుక్కున మాయమవుతుందన్నాడు. కానీ, తిరుపతి కొండల నుంచి స్వామీజీల వరకు ఈ వైరస్ బారిన పడుతూనే వున్నారు.

*ఇదంతా మూఢత్వం... ప్రజలను మోసగించడం. మూర్ఖులను చేయడం.*

మరోవైపు కరోనా కట్టడి చేయలేక చేతులెత్తేసి రామ మందిరానికి శంకుస్థాపన చేశారు. భక్తిమాటున తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకో జూస్తున్నారు. ఇంకోవైపున చైనాతో, నేపాల్‌తో, పాక్‌తో కయ్యాలు పడుతూ ప్రాంతీయ ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారు. వీటిని సాకుగా చూపి అత్యధిక ధర పెట్టి రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసారు. ఆ విమానాలు మన బలానికి నిదర్శనమంటూ తెగ గొప్పలకు పోయారు.

కరోనా వ్యాధి నివారణలో న్యూజిలాండ్, ఉత్తరకొరియా లాంటి చిన్న దేశాలు ఎంతో శ్రమించి కట్టడి చేశాయి. చైనా, దక్షిణ కొరియా నియంత్రించాయి. వారు మొత్తం ప్రైవేట్ వైద్యాన్ని కంట్రోలుకు తెచ్చి ప్రజలకు వైద్యం అందించారు. మన దేశంలో కొన్ని రాష్ట్రాలు శక్తికి మించి కృషి చేశాయి. కేరళ అందులో ముందు వరుసలో వున్నది.

ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతి కోవిడ్ పేషంట్‌కు తన బాధ్యతగా మెరుగైన వైద్యం అందించాలి. దీనిని ఆరోగ్యశ్రీలో చేర్చాలి. ఈ కష్టకాలంలో ప్రభుత్వాలు ప్రతి కుటుంబానికి నెలకు రూ. 7,500 ల నుంచి రూ. 10,000 లు సహాయం అందించాలి. చిన్న పరిశ్రమలకు రాయితీలు యివ్వడం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి యివ్వడం! రైతాంగాన్ని ఆదుకోవడం చేయాలి. ప్రభుత్వ యంత్రాంగం ప్రస్తుత స్థితిలో అనవసర నిర్మాణాలు వదిలి, కరోనా బెడ్లను, దాని సౌకర్యాలను పెంచాలి. కరోనా మాటున ప్రతిపక్షాల నిరసన కార్యక్రమాలను కూడా సాగకుండా చేసే చర్యలను ఆపాలి. ప్రతిపక్షాలతో చర్చించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలి.

## మరో తోడేలు - కుందేలు కథ

# చైనాతో అమెరికా ప్రారంభించిన ప్రచ్ఛన్న యుద్ధం

హౌస్టన్ నగరంలోని చైనా కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని, 72 గంటల్లోగా మూసి వేయాలని, అమెరికా ప్రభుత్వం, చైనాను ఆదేశించింది. దీనితో, చైనాతో అగ్రరాజ్యం అమెరికా ప్రారంభించిన ప్రచ్ఛన్న యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. వాస్తవానికి, రెండు సంవత్సరాల క్రిందటనే అమెరికా, చైనాపై తీవ్ర స్థాయిలో వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించింది. కోవిడ్ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుండి, తాను తీసుకుంటున్న వరుస చర్యలతో అమెరికా, చైనాతో తాను సాగిస్తున్న వాణిజ్య యుద్ధాన్ని, సర్వవ్యాపిత ప్రచ్ఛన్న యుద్ధంగా మార్చివేసింది. ఇప్పుడు, హౌస్టన్‌లోని తన కాన్సులేట్ కార్యాలయాన్ని మూసివేయాలని అమెరికా యిచ్చిన ఆదేశంతో, వీరి మధ్య దౌత్య యుద్ధం తీవ్ర రూపానికి చేరుకుంది. ఈ అసంబద్ధ చర్యను వుపసంహరించుకోవాలని చైనా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పెడచెవిన పెట్టడంతో, చైనా కూడా, ప్రతి చర్యగా చెంగ్డూలోని అమెరికా కన్సురేట్ జనరల్ కార్యాలయాన్ని కూడా 72 గంటల లోపు మూసివేయాలని ఆదేశించాల్సి వచ్చింది. ఈ రెండు దేశాల కార్యాలయాల మూసివేతలు పూర్తయ్యాయి. ఇంతటితో కూడా ఆగకుండా, అమెరికా ప్రభుత్వం, కొందరు చైనా విద్యార్థులను, తమ దేశ వ్యాక్సిన్ పరిశోధనా రహస్యాలను దొంగిలించారనే సాకుతో అరెస్టు చేసింది. దౌత్య మర్యాదలను, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను వుల్లంఘించి, తమ అధికారులను చైనా కన్సులేట్ కార్యాలయంలోకి పంపించి వీరంగం సృష్టించింది.

### కరోనా వ్యాక్సిన్ సమస్య

ప్రస్తుతం, ప్రపంచ దేశాల మధ్య కరోనా వ్యాక్సిన్ తయారీ విషయంలో తీవ్రమైన పోటీ నెలకొని వుంది. ఎవరు ముందు తయారు చేస్తారు? ఎవరు, మంచి ఫలితాన్నిచ్చే విధంగా తయారు చేస్తారు? ఎవరు చౌకగా తయారు చేస్తారు? ఎవరు, ప్రపంచంలో ఎక్కువ ఆర్డర్లు సంపాదించి అమ్ముకోగల్గుతారు? ఇది, వేలు, లక్షల కోట్ల డాలర్ల వ్యాపారం. ప్రపంచంలో యిప్పుడు 25 కంపెనీలు వ్యాక్సిన్ల తయారీ ప్రక్రియలో వివిధ దశలలో వున్నాయి. ప్రతి దశ ప్రయోగాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతి అవసరమవుతుంది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఒక వ్యాక్సిన్ తయారీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిని 'ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్' అని పిలుస్తున్నారు. దీనిని యూరోపియన్ ఫార్మస్యూటికల్ కంపెనీ ఆస్ట్రా జెనికా స్పాన్సర్ చేస్తున్నది. అమెరికాకు చెందిన బిల్ గేట్స్ కంపెనీ, ఈ వ్యాక్సిన్ కొనుగోలు కోసం ఒప్పందం కుదుర్చుకున్నది. భారత ప్రభుత్వం భాగస్వామిగా వున్న 'గావి అలయెన్స్' కూడా ఈ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. భారత దేశంలో కూడా రెండు వ్యాక్సిన్‌ల తయారీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. అహ్మదాబాద్ కేంద్రంగా వున్న కేండిలా హెల్త్ కేర్, హైదరాబాద్ కేంద్రగా వున్న భారత్ బయో టెక్ సంస్థలు ఫేస్-1, ఫేస్-2 పరీక్షలకు అనుమతి పొందాయి. రష్యా కూడా ఒక వ్యాక్సిన్ తయారీలో వుంది. పైన పేర్కొన్న 25 వ్యాక్సిన్ల పరిశోధనలలో 5 మాత్రమే ఫేస్-2 పరీక్షలను పూర్తి చేసుకొని ఫేస్-3 పరీక్షల నిర్వహణ దశలో వున్నాయి. మూడవ స్టేజీలో, వేల సంఖ్యలో ప్రజలపై ప్రయోగాలు జరుగుతాయి. ముఖ్యంగా వయోవృద్ధుల మీద, దీర్ఘకాలిక జబ్బులు వున్న వారి మీద ప్రయోగాలు చేస్తారు. వీటిలో 3 కంపెనీలు చైనాకు చెందినవి. పరిశోధనలో, చైనా, తమ కన్నా ముందున్నదనే ఈర్ష్యా, ద్వేషాలతో, అమెరికా, చైనా మీద తమ పరిశోధనా ఫలితాలను దొంగిలించారనే తప్పుడు ఆరోపణలకు పూనుకుంటున్నది. కొన్ని యూరోపియన్ దేశాలు, రష్యా మీద కూడా యిలాంటి ఆరోపణలకు పూనుకున్నాయి. తమ మీద ఆరోపణలు నిరాధారమైనవనీ, దురుద్దేశ పూరితమైనవనీ, పరిశోధనలో, ప్రయోగాలలో ముందు వరుసన తామే వుండగా, తాము యితరుల పరిశోధనా ఫలితాలను దొంగిలించాల్సిన అవసరమేమిటనీ చైనా ప్రశ్నించింది. పైగా, చైనా అధ్యక్షుడు, జిన్ పింగ్ తాము కనిపెట్టే వ్యాక్సిన్‌ను 'ప్రపంచ సొత్తు' (world good)గా మారుస్తామని, అందరికీ అందుబాటు చేస్తామని ప్రకటించాడు. తమ వ్యాక్సిన్లను వ్యాపారం చేసుకొని లక్షల కోట్లు లాభాలు గడించాలనుకునే కంపెనీలకు, దేశాలకు, చైనా కన్నెర్రగా మారటంలో ఆశ్చర్య మేముంది?

### చైనాతో వ్యాపారంలో, అమెరికా లోటు సమస్య

అమెరికా - చైనాల మధ్య వ్యాపారంలో, అమెరికా భారీ లోటును, చైనా భారీ మిగులును, వరుసగా నమోదు చేస్తూ రావటం, అమెరికాకు మింగుడు పడని సమస్యగా వుంటూ వచ్చింది ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత, 'అమెరికా ఫస్ట్', 'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తా' లాంటి నినాదాలు యిస్తూ వచ్చాడు. 'స్వేచ్ఛా వ్యాపార పోటీ'లో చైనాను ఓడించటం సాధ్యం కాదని అర్థం చేసుకున్న ట్రంప్, చైనా, 'తన దేశంలో పనిచేస్తున్న అమెరికా కంపెనీల సాంకేతిక పరిజ్ఞానాన్ని బలవంతాన స్వంతం చేసుకుంటున్న'దనే ఆరోపణతో, చైనా నుండి వచ్చే దిగుమతుల మీద భారీగా పన్నులు విధించటానికి పూనుకున్నాడు. చైనా కూడా, దీనికి ప్రతి చర్యగా అమెరికా నుండి దిగుమతుల మీద పన్నులు విధించింది. అమెరికా, రెండవసారి, మళ్లీ భారీగా పన్నులు పెంచటం, చైనా, దీనికి ప్రతి చర్యలు తీసుకోవటం - గత రెండు సంవత్సరాలలో జరిగింది. రెండు దేశాల మధ్య ఇదొక వ్యాపార యుద్ధంగా మారింది. ఇది, ప్రపంచ వ్యాపారం మీద తీవ్రమైన వ్యతిరేక ప్రభావాన్ని కల్గించింది. అమెరికా వ్యవసాయోత్పత్తులకు చైనా ఒక పెద్ద మార్కెట్. చైనా నుండి దిగుమతులలో, అమెరికా పరిశ్రమల్లో వినియోగించే ముడి పదార్థాలు, సెమి-ప్రాసెస్సుడు అంశాలు అనేకం వున్నాయి. పర్యవసానంగా, అమెరికా పారిశ్రామిక వేత్తల నుండి, రైతాంగం నుండి చైనాపై వ్యాపార ఆంక్షాలను సడలించాలనే వత్తిడులు వచ్చాయి. ఫలితంగా అమెరికా, చైనాతో మరొకసారి వ్యాపార చర్చలను సాగించింది. కొన్ని సడలింపులకు, యిరు పక్షాల మధ్య అంగీకారం కుదిరింది. మళ్లీ, ఈ అక్టోబరులో మరో వరుస చర్చలు జరపాలని యిరుపక్షాలు నిర్ణయించుకున్నాయి. ఇంతలో, అమెరికా-చైనా సంబంధాలు దారుణంగా దిగజారాయి. ఇప్పుడీ చర్చలు జరుగుతాయో, లేదో అనే విషయంలో సందిగ్ధత నెలకొని వుంది.

కోవిడ్-19 సంక్షోభం తలెత్తక ముందు వరకు, అమెరికా, చైనాకు వ్యతిరేకంగా, ప్రధానంగా, వాణిజ్య యుద్ధానికి పరిమితమయింది. కాని, కోవిడ్ సంక్షోభం ప్రారంభం నుండి, దాని దాడి సర్వతోముఖ రూపం తీసుకుంది. గిల్లికజ్జా పెట్టుకునే ధోరణితో అమెరికా వ్యవహరించసాగింది. చైనా మీద దాడి చేయటానికి, నిత్యం యేదో ఒక సాకును వెతకటం ప్రారంభించింది. రోజూ, ఏదో ఒక రాయి విసరటం ప్రారంభించింది.

డి.వి.కృష్ణ

హౌస్టన్‌లోని చైనా కాన్సులేట్ ఆఫీసు మూసివేత ఆదేశంతో యిది పరాకాష్టకు చేరింది.

### కోవిడ్ సంక్షోభం - అమెరికా ఘోర వైఫల్యం

కోవిడ్ సంక్షోభాన్ని చైనా ప్రభుత్వం ముందుగా గుర్తించి, దానిని అదుపు చేయటానికి కఠినమైన చర్యలకు పూనుకుంది. ఫలితంగా, రెండు నెలల్లోనే, దీనిని అదుపు చేసి, మళ్లీ పారిశ్రామిక, సేవా, పర్యటన, రవాణా రంగాలను పునరుద్ధరించగల్గింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, కోవిడ్-19ను అవగాహన చేసుకోవడంలోనూ, అదుపు చేయడంలోనూ పూర్తిగా విఫలమయ్యాడు. ఇది మామూలు 'ఫ్లూ' లాంటిదేనని ఒకసారి, క్లోరోక్విన్ గోలీలు వేసుకుంటే తగ్గి పోతుందని మరోసారి, ఇది తొందరలోనే అదృశ్యమై పోతుందని యింకోసారి, బాక్టీరియా నిర్మూలన ఇన్‌ఫెక్టెంట్లను వాడితే నయమవుతుందని మరొకసారి, మాస్కులు అవసరం లేదని ఒకసారి, లాక్‌డౌన్‌లు అవసరం లేదని మరొకసారి - యిష్టానుసారం, బాధ్యతా రహితమైన ప్రకటనలు చేస్తూ వచ్చాడు. అమెరికా లాంటి ధనవంతమైన అగ్రరాజ్యం తీవ్రమైన మాస్కుల కొరతను, వెంటిలేటర్ల కొరతను యెదుర్కొని క్రిందు, మీద కావలసి వచ్చింది. వ్యాధి సోకుతున్న వారి సంఖ్యలోనూ, చనిపోతున్న వారి సంఖ్యలోనూ అమెరికా, ప్రపంచంలోనే నంబరు-1 స్థానానికి చేరుకోవటమే కాకుండా, ఆ స్థానంలోనే నిలకడగా కొనసాగుతూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో, ట్రంప్‌కు, తన వైఫల్యానికి ఒక కుంటి సాకు కావలసి వచ్చింది. ఒక బలిపశువు కావలసి వచ్చింది. దీనితో, అతడు 'కరోనా వైరస్‌ను చైనా తన దేశంలో సృష్టించి, ప్రపంచం మీదికి వదిలింద'నే దుర్మార్గమైన ఆరోపణకు పూనుకున్నాడు. దీనికి 'చైనా వైరస్' అని 'ఊహాన్ వైరస్' అని అతడు పేరు పెట్టి, చైనాను అపఖ్యాతి పాల్జేయటానికి పూనుకున్నాడు. తమ పరిశోధనా బృందాలను, చైనా లాబొరేటరీలను తనిఖీ చేయటానికి అనుమతించాలని, చైనాను డిమాండ్ చేశాడు. తమ దేశాలకు కల్గిన నష్టానికి చైనా పరిహారం చెల్లించాలని ట్రంప్ డిమాండ్ చేశాడు. తమ దేశంలో వ్యాధి గుర్తించబడగానే, చైనా అంతర్జాతీయ సమాజానికి తెలియజేయకుండా సమాచారాన్ని దాచి పెట్టిందని, అమెరికా ఆరోపించింది. చైనా తమకు సరైన సమయంలోనే సమాచారం యిచ్చిందని, తాము ప్రపంచ దేశాలను సరైన సమయంలోనే హెచ్చరించామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ) ప్రకటించినందుకు, చైనా సకాలంలో సరైన చర్యలు తీసుకొని కరోనాను అదుపు చేసిందని అభినందించినందుకు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ ఆరోగ్య సంస్థపై మండి పడ్డాడు. అది, చైనాకు తొత్తుగా వ్యవహరిస్తుందని విమర్శించాడు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు తమ వాటా నిధులను నిలిపి వేస్తూనూ, దాని నుండి వైదొలగుతూనూ ట్రంప్ తల బిరుసు ప్రకటన చేశాడు.

అమెరికా ఆరోపణలన్నిటికీ, చైనా దీటుగా జవాబిచ్చింది. ఏ వైరస్‌నూ ఒక ప్రాంతానికో, ఒక దేశానికో అంటగట్టకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ యిచ్చిన నిర్దేశాన్ని చైనా వుటంకించింది. గతంలో సార్స్ వైరస్ అమెరికాలో పెట్టి, యితర దేశాలకు వ్యాప్తి చెందిందని, అంత మాత్రాన దానిని 'అమెరికా వైరస్' అని తాము పిలవలేదని చైనా వివరణ యిచ్చింది. అమెరికా నుండి వ్యాపించిన వైరస్‌లకు నష్ట పరిహారం చెల్లించాలన్న ఆదేశాన్ని, ఆనాడు ఎవరూ డిమాండు చేయలేదని చైనా గుర్తు చేసింది. కోవిద్ - 19 వైరస్‌కు మూలాలు కనుక్కోవటానికి తమకు అభ్యంతరం లేదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలలో యిందుకు పరిశోధనలు జరిగితే తాము సహకరిస్తామని చైనా ప్రకటించింది.

కోవిద్-19 వైరస్‌ను తాము గుర్తించగానే 2020 జనవరి 3న ప్రపంచ ఆరోగ్య సంస్థకు సమాచారమిచ్చామని చైనా తెలియజేసింది. కోవిడ్-వైరస్ ఒక అంతర్జాతీయ ఆరోగ్య సమస్య అని, దానిని ప్రపంచ దేశాలన్నీ పరస్పర సహకారంతో యెదుర్కోవాలని, యిందుకు అంతర్జాతీయ సమాజంతో తాము పూర్తిగా సహకరిస్తామని చైనా ప్రకటించింది. అమెరికా కాని, పశ్చిమ దేశాలు కానీ, కోవిద్‌ను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి, తమ మీద నిందలు వేసి తప్పించుకో చూడటం కాని, తమ దేశ ప్రజల దృష్టిని మళ్లించటానికి చూడటం కాని సరైనది కాదని చైనా హితవు చెప్పింది.

అమెరికా, ఇతర పశ్చిమ దేశాలన్నిటిలోనూ ఆరోగ్య వ్యవస్థంతా ప్రైవేటీకరించబడింది. ప్రజా ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా బలహీన పర్చబడింది. కరోనా ఇతర జబ్బుల లాంటిది కాదు. వ్యక్తి ప్రయోజనాలకే సంబంధించినది కాదు. దీనిని గుర్తించటం, పరీక్షలు చేయటం, వైద్యం చేయటం - సామాజిక ప్రయోజనానికి సంబంధించిన విషయం. ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన విషయం. ఈ సమస్య పరిష్కార బాధ్యతను, గరిష్ట లాభాలు సంపాదించటమే లక్ష్యంగా పనిచేసే ప్రయివేటు వైద్యరంగం పరిష్కరించలేదు. నయా వుదారవాద విధానాలలో భాగంగా, ప్రభుత్వ ఆరోగ్య రంగం యిప్పటికే ప్రయివేటీకరించ బడింది. ఇప్పటికిప్పుడు ఆఘమేఘాల మీద ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను యేర్పాటు చేసి, ప్రజలందరికీ వుచిత వైద్య సౌకర్యాలు కల్పించటం సాధ్యం కాదు. కనుక, అమెరికా, యూరపు దేశాలు, నయా వుదారవాద విధానాలను అనుసరిస్తున్న భారత్ లాంటి దేశాలు లాక్ డౌన్‌లైతే ప్రకటించాయి. కాని 'వ్యాధి గుర్తింపు, పరీక్షలు, వైద్యం' చర్యలను కంటి తుడుపుగానే చేస్తున్నాయి తప్ప, సంపూర్తిగా నిర్మూలించే చర్యలను చేపట్టలేక పోతున్నాయి.

లాక్‌డౌన్‌లు శాశ్వత పరిష్కారం కాజాలవు. వ్యాధిని నిర్మూలించే వరకు తీసుకోవలసిన తాత్కాలిక చర్యలు మాత్రమే. వ్యాధిని అదుపు చేయకుండా లాక్‌డౌనులు యెత్తివేస్తే, వ్యాధి మళ్లీ విజృంభిస్తుంది. వ్యాధి విజృంభిస్తే, మళ్లీ పూర్తి లాక్‌డౌన్‌లకు పోవలసి వస్తుంది. పూర్తి లాక్‌డౌనులు ఆర్థిక సంక్షోభానికి, సాంఘిక సంక్షోభానికి దారి తీస్తాయి. చైనాలో ప్రభుత్వం, మొదట, ఖచ్చితమైన లాక్‌డౌన్ అమలు జరిపి, ఈ కాల వ్యవధిలో కోవిడ్ పూర్తిగా అదుపుకు చర్యలు తీసుకోగల్గింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో, ఒక సామాజిక బాధ్యతగా దీనిని నిర్వహించి నందువల్ల మాత్రమే యిది సాధ్యమయింది. దీనితో, చైనా తన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా తెరవగల్గింది. ఉత్పత్తిని, ఉపాధిని ఎక్కువ శాతం పునరుద్ధరించగల్గింది. ఇటీవలి త్రైమాసికాలలో 3.2% ఆర్థికాభివృద్ధిని సాధించి, ప్రపంచంలోనే రికార్డును సృష్టించగల్గింది. అమెరికా, యూరపు దేశాలు, చైనా నుండి సరైన గుణపాఠాలు తీసుకోవటానికి సిద్ధంగా లేవు. మరోప్రక్క, చైనా పట్ల ద్వేష భావాన్ని పెంచుకొని, దుష్ప్రచారాలకు లంకించుకున్నారు. చైనాను నిందించినందువల్ల ఈ దేశాల కరోనా సంక్షోభమూ పరిష్కారం కావటం లేదు. వారి ఆర్థిక వ్యవస్థలూ పునరుద్ధరణకు నోచుకోవటం లేదు. ఇన్‌ఫెక్షనులూ, మరణాలూ ప్రమాదకర స్థాయికి పెరిగి పోతున్నాయి. ఆర్థిక సంక్షోభమూ తీవ్రతరమవుతున్నది. అనేక దేశాలు మళ్లీ "పూర్తి లాక్ డౌన్‌లు" ప్రకటిస్తున్నాయి. దేశం మొత్తంగానో, కొన్ని ప్రాంతాలలోనో "అత్యవసర పరిస్థితులను" ప్రకటిస్తున్నాయి. "జాతీయ విపత్తుల"ను ప్రకటిస్తున్నాయి. ఈ వైఫల్యాలకు మూల విరాటుగా వున్న అమెరికా, ప్రజల దృష్టిని

మళ్లించటానికి, చైనాపై యిలాంటి ఆరోపణలకు పూనుకుంటున్నా, దీనిని ఎవరూ నమ్మే పరిస్థితి లేదు.

## చైనా, మైనారిటీ ప్రజల మానవ హక్కులను వుల్లంఘిస్తున్నదనే ఆరోపణ

దీనితో అమెరికా, మరో ఆరోపణకు లంకించుకుంది. చైనాలోని క్సిన్ జియాంగ్ ఉగర్ మైనారిటీ ప్రజల స్వయం పాలిత ప్రాంతంలో చైనా ప్రభుత్వం మానవ హక్కుల వుల్లంఘనకు పూనుకుంటున్నదని ఆరోపించింది. బలవంతపు జనాభా నియంత్రణకు పూనుకుంటున్నదని, యిందువల్ల వీరి జనాభా తగ్గిపోయిందని ఆరోపించింది. ఈ ఆరోపణ పచ్చి అబద్ధమని, ఈ ప్రాంతపు యిటీవల జనాభా పెరుగుదల రేటు జాతీయ జనాభా పెరుగుదల రేటు కన్నా, ఎక్కువగా వుందని పేర్కొంది. చైనాపై అబద్ధపు ఆరోపణ చేస్తున్న అమెరికాలో మొదటి నివాసులైన నేటివ్ ఇండియన్ల జనాభా1842లో (కొలంబస్ అమెరికాను కనిపెట్టిన సంవత్సరం) 6 కోట్లు వుండింది. ఆ సంఖ్య ఈనాటికి 52 లక్షల, 22 వేలకు దారుణంగా తగ్గిపోయిన వాస్తవాన్ని చైనా ప్రభుత్వం గుర్తు చేసింది.

క్సిన్ జియాంగ్ ప్రాంతంలోని మైనారిటీ ప్రజలను జైళ్లలో నిర్బంధించి, వారి శరీర భాగాలను, చైనా ప్రభుత్వం బలవంతాన సేకరిస్తున్నదని మరో ఆరోపణ అమెరికా చేసింది. ఇది మరో పచ్చి అబద్ధమని చైనా కొట్టి వేసింది. 'చైనాలో శరీర భాగాలను విరాళంగా సేకరించటానికి నిర్దిష్ట చట్ట నిబంధనలున్నాయ'ని, వాటిని చైనా ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తున్నదని పేర్కొంది. శరీర భాగాలను విరాళంగా యివ్వటానికి ప్రజలు పెద్ద యెత్తున ముందుకు వస్తున్నారని, కనుక, ఎవరి నుండి నిర్బంధంగా శరీర భాగాలను సేకరించవలసిన అవసరమే తమకు లేదని కూడా చైనా ప్రభుత్వం పేర్కొంది.

కొన్ని పారిశ్రామిక సంస్థలు, ముస్లిం మైనారిటీ మహిళలతో బలవంతపు శ్రమ చేయించుకుంటున్నారని మరో ఆరోపణను అమెరికా చేసింది. ఈ పేరుతో కొన్ని సంస్థలపై, అమెరికా కొన్ని ఆంక్షలను విధించింది. వీరు స్వచ్ఛందంగానే పని చేస్తున్నారని, ఈ పేరుతో, అమెరికా వీరి ఉపాధి హక్కుకు భంగం కల్గిస్తున్నదని చైనా ప్రభుత్వం విమర్శించింది. అమెరికా, బానిస విధానంతోనే అభివృద్ధి చెందిందని, ఈ నాటికీ అక్కడ, నల్లజాతి అమెరికన్ల పట్ల వివక్ష చూపించబడ్తున్నదని, వేలాది మంది ప్రతి సంవత్సరం ఘోరంగా హత్య చేయబడుతున్నారని అమెరికాలోనూ, ప్రపంచ దేశాలలోనూ అమెరికా జాత్యహంకారానికి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతుంటే, అమెరికా పాలకులు చైనాపై వేలు చూపించటం హాస్యాస్పదంగా వుందని, చైనా విమర్శించింది.

క్సిన్ జియాంగ్ ప్రాంతంలో, కొన్ని మౌఢ్య ముఠాలు టెర్రరిస్టు చర్యలకు పూనుకుంటున్నాయని, దేశం నుండి వేర్పాటు కుట్రలకు పూనుకుంటున్నాయని, కొన్ని అశాస్త్రీయ, తాంత్రిక భావాలను ప్రచారం చేస్తున్నాయని, వీటికి వ్యతిరేకంగా చట్టబద్ధ చర్యలకు మాత్రమే పూనుకుంటున్నామని చైనా ప్రభుత్వం వివరించింది. అమెరికా, కొన్ని యూరపు దేశాలు, ఆస్ట్రేలియా, ఈ ముఠాలకు అంతర్జాతీయ స్థావరాలను కల్పిస్తున్నాయని, నిధులను సమకూరుస్తున్నాయని, వీటికి అనుకూలంగా ప్రచారాన్ని సాగిస్తున్నాయని చైనా ప్రభుత్వం వివరించింది.

చైనా, తన దేశంలోని మైనారిటీ తెగల, మతాల ప్రజల పట్ల, యెంతో ప్రగతిశీల, ప్రజాస్వామిక దృక్పథంతో వ్యవహరిస్తున్నదని, వీరి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధను కనపరుస్తున్నదని పేర్కొంది. క్సిన్ జియాంగ్ ఉగర్ స్వయం పాలిత ప్రాంతంలోని ప్రజలు, చైనా విముక్తి చెందే నాటికి యెంతో వెనుకబాటు తనంలోను, పేదరికంలోనూ మ్రగ్గుతుండే వారని, చైనా విముక్తి చెందినప్పటి నుండి వీరి అభివృద్ధికి యెంతో కృషి జరిగిందని చైనా ప్రభుత్వం పేర్కొంది. 2014 నుండి ఈ ప్రాంత ప్రజలలో 2.38 మిలియనుల మందిని పేదరికం నుండి బయటకు తీసుకు రావటం జరిగిందని, 2014 ప్రారంభంలో, ఈ ప్రాంత జనాభాలో 22.84% మంది పేదరికంలో వుండగా, 2019 నాటికి, వీరి శాతం 6.5%కి తగ్గిపోయిందని చైనా ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రాంత బడ్జెట్టులో 70 శాతాన్ని ప్రజల సంక్షేమాన్ని మెరుగు పర్చటానికి వుపయోగిస్తున్నామని పేర్కొంది. హైస్కూలు వరకు ఉచిత విద్యను కల్పిస్తున్నామని, కాలేజీ విద్యకు సబ్సిడీలు కల్పిస్తున్నామని చైనా ప్రభుత్వం పేర్కొంది. సబ్సిడీపై, ఒక్క సంవత్సరంలో 2,12,700 కుటుంబాలకు ఇళ్లు నిర్మించామని, 2018 నుండి, 22 కౌంటీలలో, 3,76,100 కుటుంబాలకు ఇళ్లు నిర్మించి పెట్టామని చైనా ప్రభుత్వం పేర్కొంది. కాలేజీ గ్రాడ్యుయేట్లకు వుపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పింది.

చైనా విధానాల పట్ల ఎవరికైనా అభ్యంతరాలుండొచ్చు. విమర్శలూ వుండొచ్చు. కాని, ఈ కారణంతో, ఆ దేశంపై నిషేధాలు విధించటం సరయింది కాదు. ఇలా చేయటం, ఆ దేశ ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవటం మాత్రమే అవుతుంది. అమెరికా, పశ్చిమ దేశాలు, చైనాపై దురుద్దేశపూరితంగా తప్పుడు ఆరోపణలు చేయడమే కాకుండా, ఆ దేశానికి వ్యతిరేకంగా కుట్రలు, కుతంత్రాలకు పూనుకుటున్నాయి. అమెరికా, ఏకంగా, పార్లమెంటులో, 'క్సిన్ జియాంగ్ మానవ హక్కుల వుల్లంఘన చట్టం' పేరుతో ఒక చట్టాన్ని ఆమోదింపచేసింది. పై సాకుతో చైనాపై ఆంక్షలు విధించటానికి వుద్దేశించబడిందీ చట్టం. ఇది బరి తెగింపు చర్య మాత్రమే. అమెరికా ఆధిపత్య విధానానికీ, యితర దేశాల ఆంతరంగిక విధానాలలో జోక్యం చేసుకునే విధానానికీ ఇదొక మచ్చుతునక మాత్రమే.

## హాంకాంగ్ సమస్య

1840–1842 మధ్య ఆంగ్లేయులు చైనాపై నల్ల మందు యుద్ధాన్ని చేశారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు, భారత దేశంలో రైతులతో బలవంతాన నల్లమందు పండింపచేసి, దానిని తీసుకుపోయి చైనాలో రహస్యంగా అమ్ముకోవటం సాగించారు. ఆనాటి చైనా రాచరిక ప్రభుత్వం, నల్ల మందు వ్యాపారాన్ని నిషేధించింది. దీనితో, బ్రిటీషు వారు, చైనా ప్రభుత్వంపై యుద్ధం సాగించి, దానిని ఓడించారు. చైనా ప్రభుత్వం తప్పనిసరై నల్లమందు వ్యాపారాన్ని అనుమతించాల్సి వచ్చింది. 1842లో బ్రిటన్, చైనాల మధ్య నాంకింగ్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పంద షరతులలో భాగంగా హాంకాంగు ద్వీపాన్ని, చైనా, బ్రిటన్‌కు అప్పగించవలసి వచ్చింది. తర్వాత జరిగిన అనేక ప్రజా పోరాటాల నేపథ్యంలో 1898 జూన్ 9న జరిగిన ఒప్పందం ద్వారా, బ్రిటన్, హాంకాంగ్ ఆక్రమణను 99 సంవత్సరాల కౌలుగా మార్చటం జరిగింది. కౌలు వ్యవధి 1997లో పూర్తి కావటంతో బ్రిటన్, హాంకాంగ్‌ను 1997లో చైనా ప్రజా రిపబ్లిక్‌కు అప్పగించవలసి వచ్చింది. తనకు స్వాధీనమయ్యే నాటికి హాంకాంగ్‌లో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, బూర్జువా రాజకీయ వ్యవస్థ కొనసాగుతున్నందువల్ల 'ఒక దేశం – రెండు వ్యవస్థలు' అనే విధానాన్ని చైనా అమలు జరుపుతూ వచ్చింది అంటే, చైనాలో సోషలిస్టు వ్యవస్థ, ఏక పార్టీ పాలన వున్నప్పటికీ, హాంకాంగ్‌లో మాత్రం స్వేచ్ఛా పెట్టుబడిదారీ విధానం, బహుళ పార్టీ బూర్జువా ప్రజాస్వామ్యం కొనసాగుతాయన్న మాట. అయితే, హాంకాంగ్, చైనాలో అంతర్భాగం అనే విధానాన్ని మాత్రం ప్రశ్నించటానికి వీల్లేదు. హాంకాంగ్ భద్రత చైనా ప్రభుత్వం చేతుల్లో వుంటుంది. కాని, గత ఒకటి – రెండు సంవత్సరాలుగా, అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు హాంకాంగ్‌లో కుట్రలు చేస్తూ వచ్చాయి. తమ ఏజంట్లతో, హాంకాంగ్ స్వతంత్రం కోసం పోరాటాన్ని చేయిస్తూ వచ్చారు. చైనాను ఒంటరి చేసే విధానంలో భాగంగా, ఈ మధ్య కాలంలో హాంకాంగ్‌లో కుట్రలు, కుతంత్రాలు సాగిస్తూ వచ్చారు. పర్యవసానంగా యిటీవల జరిగిన చైనా జాతీయ కాంగ్రెసు సమావేశం ఒక ఆంతరంగిక భద్రతా బిల్లును ఆమోదించింది. దీని ప్రకారం, చైనా నుండి విడిపోవాలని ఆందోళన చేయటం, టెర్రరిస్టు కార్యకలాపాలకు పూనుకోవటం, ఆంతరంగిక శాంతికి భంగం కల్గించటం శిక్షార్హమైన నేరాలవుతాయి. ఈ చట్టం కారణంగా, అమెరికా, బ్రిటన్‌ల కుట్రలు, కుతంత్రాలకు ఆటంకం యేర్పడింది. దీనితో, అమెరికా బ్రిటన్ ప్రభుత్వాలు, హాంకాంగ్‌తో వున్న ప్రత్యేక ఆర్థిక సంబంధాలను, ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటనలు చేస్తున్నాయి. ఇవి, చైనా ఆంతరంగిక వ్యవహారాల్లో నగ్నమైన జోక్యమూ, రెచ్చగొట్టే చర్యలూ మాత్రమే.

## తైవాన్ సమస్య

1949లో, కొమింటాంగ్ పార్టీపై విజయం సాధించి, చైనా కమ్యూనిస్టు పార్టీ విప్లవాన్ని విజయవంతం చేసింది. అప్పుడు, కొమింటాంగ్ పార్టీ నాయకుడు చాంగ్–కై–షేక్ చైనా నుండి తైవాన్ దీవికి పారిపోయి, అక్కడొక అమెరికా తొత్తు ప్రభుత్వాన్ని యేర్పాటు చేశాడు. అమెరికా ప్రభుత్వ పలుకుబడితో, తైవాన్‌లోని చాంగ్–కై–షేక్ ప్రభుత్వాన్నే నిజమైన చైనా ప్రభుత్వంగా ఐరాస గుర్తించింది. తైవాన్‌కు సెక్యూరిటీ కౌన్సిల్‌లో కూడా సీటు లభించింది. కాని, మావో నాయకత్వంలోని చైనా ప్రభుత్వం, ఒక బలమైన ఆర్థిక శక్తిగా, రాజకీయ శక్తిగా మారటంతోనూ, అత్యధిక ప్రపంచ దేశాలు, దానినే నిజమైన చైనాగా గుర్తించటంతోనూ, అమెరికా ప్రభుత్వం దిగివచ్చి, 1970లో చైనా ప్రజా రిపబ్లిక్‌నే నిజమైన చైనా ప్రభుత్వంగానూ, తైవాన్‌ను చైనాలో అంతర్భాగంగానూ గుర్తిస్తూ ప్రకటన చేసింది. ఐ.రా.స. భద్రతా సమితిలో తైవాన్‌ను తప్పించి, చైనాకు స్థానం కల్పించారు. ఇటీవలి దాకా, అమెరికా ప్రభుత్వం, యిదే విధానాన్ని అమలు జరిపింది. ఇప్పుడు, ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్, తైవాన్‌కు ఎక్కడలేని ప్రాధాన్యత యిస్తున్నాడు. ఇటీవల తైవాన్ అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన సాయి ఇంగ్ వెన్‌ను నూతన అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు అభినందనలు తెలియజేస్తూ ప్రకటన చేశాడు. ఇది కూడా చైనాను పనికట్టుకొని రెచ్చగొట్టే మరో చర్య.

## దక్షిణ చైనా సముద్రంలో అమెరికా కవ్వింపు చర్యలు

దక్షిణ చైనా సముద్రం, చైనా, వియత్నాం బ్రూనో, హాంకాంగ్, తైవాన్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ దేశాల తీరాలను కలిగి వుంది. ఈ దేశాలన్నిటిలోనూ చైనా పెద్ద దేశం. హాంకాంగ్, తైవాన్‌లు కూడా చైనాలో అంతర్భాగాలే. దక్షిణ చైనా సముద్రం నుండి అమెరికా 8304 మైళ్ల దూరంలో వుంది. దానికీ, దక్షిణ చైనా సముద్రంలో సహజ ప్రయోజనాలేవీ లేవు. ఈ సముద్రానికి చెందిన అంతర్జాతీయ జలాల ద్వారా సరుకులు రవాణా చేసుకునే హక్కు మాత్రమే. ప్రపంచంలో అన్ని దేశాలతోపాటు దానికి వుంది. కాని, అమెరికా, ప్రపంచ పోలీసుగా తనను తాను భావించుకుంటుంది. ప్రపంచ మంతటి మీదా, అన్ని దేశాల మీద, సముద్రాల మీద, ఆకాశంలోనూ తనకు గుత్తాధిపత్యం వుందని అది భావిస్తుంది. చైనా, అమెరికాల మధ్య, దక్షిణ చైనా సముద్రంలో వివాదానికి, అమెరికా ఆధిపత్య ధోరణే కారణం. చైనాను చుట్టివేసి, ఏకాకిని చేయటానికే జపాన్, ఫిలిప్పీన్స్, దక్షిణకొరియా, తైవాన్ దేశాలలో అమెరికా తన సైనిక శిబిరాలను కొనసాగిస్తున్నది. చైనా, రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా యెదగటం పట్ల, తన ఆధిక్య స్థానాన్ని కూడా సవాలు చేస్తుండటం పట్లా, దానికి భరించలేనంత కడుపు మంటగా వుంది. అందుకే, అది, దక్షిణ చైనా సముద్రంలో తాను ఒంటరిగానూ, ఇతర దేశాలతో కలిసి విమాన వాహక సైనిక యుద్ధ నౌకలతో విన్యాసాలు సాగిస్తూ, అమెరికా–చైనాల మధ్య ఘర్షణలు చోటు చేసుకునే ప్రమాదాన్ని సృష్టిస్తున్నది. ఏ క్షణమైనా యుద్ధం బ్రద్దలయ్యే ముప్పును కొనితెస్తున్నది. ఇందుకు, అది, కొన్ని కుంటి సాకులు చెప్తున్నది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో, చైనా అన్యాయమైన క్లెయిములు చేస్తున్నదని, యితర దేశాల హక్కులకు భంగం కల్గిస్తున్నదని వాదిస్తున్నది.

ఇటీవల, దక్షిణ చైనా సముద్రంలో, అమెరికా సైనిక కార్యకలాపాలు ఊపందుకున్నాయి. అమెరికా యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాల వునికి బాగా పెరిగింది. 2009తో పోలిస్తే, అమెరికా యుద్ధ ఓడల సంఖ్య 60 శాతం పెరిగింది. యుద్ధ విమానాల పర్యవేక్షణ పర్యటనలు 2020 మే నెలలో 35 జరిగితే, జూన్ నెలలో 49, జూలై నెలలో 67కు పెరిగాయి. ప్రతి రోజూ సగటున 3 నుండి 5 యుద్ధ విమానాలు చక్కర్లు కొడుతున్నాయి. చైనా కూడా, తన రక్షణ సన్నద్ధతను పెంచుకోవటానికి జూలై నెలలో సైనిక విన్యాసాలను సాగించింది. ఈ మోహరింపులు, యిరువురి మధ్య అనుకోకుండా ఘర్షణలకు దారితీసే ప్రమాదముందని సైనిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా యుద్ధ నౌకలు, విమానాలు, చైనా రాజధాని బీజింగ్ నగరం మీద దాడి చేయగల్గినంత సమీపంలో ప్రయాణిస్తున్నాయని చెప్తున్నారు.

చైనా, దాని పొరుగు దేశాల మధ్య, దక్షిణ చైనా సముద్రంలో హక్కులపై కొన్ని వివాదాలు కొనసాగుతున్న మాట వాస్తవమే. వీటి పరిష్కారం కోసం ఈ దేశాల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి. ఒక ఒప్పందానికి రావటానికి తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నాయి. అమెరికా, వీరి మధ్య ఒప్పందం కుదరకుండా కుట్రలు, కుతంత్రాలకు పూనుకుంటున్నది. చైనాకు వ్యతిరేకంగా యితర దేశాలను రెచ్చగొట్టి, వేరు చేసే ప్రయత్నాలు చేసున్నది. ఈ ప్రాంత దేశాలన్నిటికి అమెరికా, యితర పశ్చిమ దేశాలు కొనసాగించిన దోపిడి, దురాక్రమణల సమిష్టి అనుభవాలు, వలస, నయావలస దోపిడీ, ఆధిపత్య అనుభవాలు తలబొప్పి కట్టేంతగా వున్నాయి.

అమెరికాకు దోపిడి, దురాక్రమణ, ఆధిపత్యాల గత చరిత్రే కాకుండా, అత్యంత రక్తసిక్తమైన వర్తమాన చరిత్ర కూడా వుంది. రెండవ ప్రపంచ యుద్ధం పూర్తి కాగానే, జపాన్ చెప్పుల్లో కాళ్లు పెట్టి కొరియాపై యుద్ధాన్ని సాగించిన చరిత్ర దానిది. ఇటీవల కూడా దక్షిణ కొరియాతో కలిసి, ఉత్తర కొరియాను అదుపు చేసే పేరిట, అది జపాన్ సముద్రంలో సైనిక విన్యాసాలను సాగించింది. భారతదేశంతో కలిసి హిందూ మహా సముద్రంలోసైనిక విన్యాసాలు సాగించింది. వియత్నాం, లావోస్, కంబోడియాలలో సుదీర్ఘకాలం దురాక్రమణ యుద్ధాన్ని కొనసాగించి, లక్షలాది మందిని పొట్టన పెట్టుకున్న చరిత్ర దానిది. ఇండోనీషియాలో సుహార్తో సైనిక నియంతృత్వాన్ని యేర్పరచి లక్షలాది మంది కమ్యూనిస్టులను ఊచకోత కోయించిన చరిత్ర దానిది. పిలిప్పీన్స్‌లో, తన సైనిక బలగాలతో మార్కోస్ నియంతృత్వానికి రక్షణ కల్పించిన చీకటి చరిత్ర దానిది. పశ్చిమాసియానంతా రావణాసుర కాష్టం చేయటమేకాకుండా, ఇరాన్ మీద దుర్మార్గమైన ఆంక్షలు విధించి, వైమానిక దాడితో ఆ దేశ ముఖ్య నాయకుడిని హత్య చేసిన దేశం అమెరికా అనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలి. ఈ చరిత్రను చైనా పొరుగు దేశాలేవీ మర్చిపోకూడదు. చైనా కూడా పూర్తి వెసులుబాటును ప్రదర్శించి, పొరుగు దేశాలతో సామరస్యాన్ని సాధించాలి. ఆధిపత్య ధోరణులకు యెట్టి పరిస్థితుల్లోనూ పూనుకోకూడదు.

## అమెరికా -చైనా సంబంధాలు యింతగా దిగజారటానికి కారణాలేమిటి?

మూడు సంవత్సరాల క్రిందటి వరకు, అమెరికా – చైనాల మధ్య సాధారణ సంబంధాలే కొనసాగాయి. ఈ మూడు సంవత్సరాలలోనే, యివి, వేగంగా దిగజారాయి. 1978లో చైనా 'ద్వారాలు తెరవటం – సంస్కరణలు' అనే విధానాన్ని చేపట్టినప్పుడు, దానిని అమెరికా ఆహ్వానించింది. అంతర్జాతీయ సమాజంతో దౌత్య సంబంధాలకు చైనా షరతుగా పెట్టిన 'ఒకే చైనా – పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో తైవాన్ అంతర్భాగం' అనే విధానాన్ని అమెరికా అంగీకరించి, చైనాతో దౌత్య సంబంధాలను యేర్పరచుకుంది. చైనాలో పెద్ద యెత్తున పెట్టుబడులు పెట్టింది. చైనాతో వ్యాపారాన్ని భారీ యెత్తున పెంచుకుంది. చైనాను ప్రపంచ వాణిజ్య సంస్థలో చేర్చుకోవటానికి ఆమోదం తెలిపింది. జి.20

(మిగతా 8వ పేజీలో)

# జాతీయ విద్యావిధానం 2020 - తీరు తెన్నులు

జులై 29వ తేదీన కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై అనేక వార్తాకథనాలు వచ్చాయి. చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ రమేష్ పోఖ్రియాల్ దీనిని ఒక అపూర్వమైన విద్యావిధానంగా అభివర్ణించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ విద్యావిధానం భారత దేశాన్ని ఒక విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్ద గలదని ప్రశంసించారు. కాంగ్రెస్ తదితర జాతీయ పార్టీలు దేశ భవిష్యత్‌ను రూపొందించే విద్యావిధానాన్ని రూపొందించడంలో పార్లమెంటును ప్రక్కన పెట్టడాన్ని తీవ్రంగా ఖండించాయి. ఈ విధానంలో మౌలిక అంశాలు పరిశీలించాలి.




ఈ నూతన విద్యావిధానంలో భాగంగా మానవ వనరుల అభివృద్ధి శాఖను తిరిగి విద్యాశాఖగా మార్చు చేయడం, పూర్వ ప్రాథమిక విద్యను తప్పనిసరి చేయడం, సెకండరీ మరియు హైయ్యర్ సెకండరీ విద్యలను కలిపివేసి మొత్తాన్ని సెకండరీ విద్యగా పరిగణించడం, పాఠశాల విద్యను 5+3+3+4 గా పునర్వ్యవస్థీకరించడం, పాఠశాలలో పాఠ్య మరియు సహపాఠ్య, ప్రకృతి మరియు సామాజిక శాస్త్రాలు, అకడమిక్ మరియు వొకేషనల్ అనే అడ్డుగోడలను తొలగించడం వంటి విషయాలు ఉన్నాయి. అలాగే, ఉన్నత విద్యలో యం.ఫిల్ కోర్సులను రద్దుచేయడం, మల్టిపుల్ ఎక్జిట్‌ను ప్రవేశపెట్టడం, ఉన్నత విద్యా కోర్సులలో ఛాయిస్ బేస్ట్ క్రెడిట్ సిస్టమ్ అనే విధానాన్ని ప్రవేశపెట్టడం, టెక్నికల్ విశ్వవిద్యాలయాలు, మెడికల్ విశ్వవిద్యాలయాలు, అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయాలు వంటి అధ్యయన విషయాల వారీ విశ్వవిద్యాలయాలపద్ధతి కాక ప్రతి విశ్వవిద్యాలయంలో అన్ని అధ్యయన విషయాలు ఉండాలని, పరిశోధనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, బి.ఇ.డి మరియు యం.ఇ.డి కోర్సులు అనేవి బహుళ అధ్యయన విషయాలు ఉండే విశ్వవిద్యాలయాలలో మాత్రమే భాగంగా ఉండాలని, విశ్వవిద్యాలయాల బయట ఉన్న ప్రతి కళాశాల స్వయం ప్రతిపత్తిగల కళాశాలలుగా మారాలని ఇంకా అనేక వ్యవస్థాత్మక విషయాలు ఈ విధానంలో ఉన్నాయి. మరి ఇవన్నీ మంచి చర్యలేనా అడిగితే ముఖ విలువను బట్టి చెప్పడం కష్టం. విద్యావ్యాపారం పునాదిలో ఉన్నప్పుడు ఇంకా అదనంగా పాలకుల చూపు గతం వైపు ఉన్నప్పుడు చెడు విధానాలు అమలు అవుతాయి మరియు మంచి విధానాలు వికటిస్తాయి. 1986 నాడు కాంగ్రెస్ వారు తీసుకువచ్చిన జాతీయ విద్యావిధానంలో కూడా కొన్ని మంచి ప్రతిపాదనలు ఉండినాయి అయితే అవి కాగితాలకే పరిమితం అయ్యాయి కాగా వారి అసలు అజండా, విద్యావ్యాపారీకరణ మాత్రం బేషుగ్గా అమలు జరిగింది. 1986 విధానం వలనే ఈ విధానంలో కూడా కొన్ని అనుకూల విషయాలతో పాటు పాలకుల ప్రధానమైన అజండా కూడా ఉంది.

నేడు భారత దేశంలో విద్యారంగం ఎదురొంటున్న ప్రధాన సమస్య విద్యావ్యాపారం. మరి ఈ నూతన విద్యావిధానం విద్యావ్యాపారాన్ని నిషేధిస్తుందా? ఈ విషయమై కస్తూరి రంగన్ నివేదికలో ఉన్న అరకొర ప్రకటనలు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదించి విడుదల చేసిన ప్రస్తుత విధాన పత్రంలో లేవు. ప్రైవేటు యాజమాన్యాలు విద్యను ఒక లాభాపేక్ష లేని సంస్థగానే నడపాలి అనే ఒక ఆదర్శం మాత్రం ఈ విధానంలో ప్రకటించారు. ఇటువంటి ఆదర్శాల ప్రకటన వలన ఎంతమాత్రం ప్రయోజనం ఉండదని వేరుగా చెప్పనవసరం లేదు. విద్యావ్యాపారాన్ని వ్యతిరేకిస్తూ గతంలో మోహినీ జైన్ వర్సస్ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం కేసులో జస్టిస్ కుల్‌దీప్ సింగ్ ఇచ్చిన తీర్పులో ఏమన్నారంటే 'ఒక సొసైటీ గానీ లేదా ఒక ట్రస్టుగాని విద్యా సంస్థను స్థాపించవచ్చు మరియు నడువవచ్చు కాని తాము ప్రభుత్వ బాధ్యతను పంచుకుంటున్నామని వారు అర్థం చేసుకోవాలి, ఫలానా కోర్సుకు ప్రభుత్వ విద్యాసంస్థలో ఎంత ఫీజు ఉందో అంతకంటే ఎక్కువ ఫీజు వసూలు చేయకూడదు.' సదరు తీర్పు అర్థం ఏమిటి? విద్యలో వ్యాపారం కూడదు. దాతృత్వ సంస్థలు తమ స్వంత నిధులతో విద్యను సుమారు ఉచితంగా అందించవచ్చు అని ఆ తీర్పు అర్థం. అయితే ప్రస్తుత నూతన విద్యా విధానంలో ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ రంగం కంటే ఎక్కువ ఫీజులు వసూలుచేయకూడదని ఎక్కడా చెప్పలేదు. ఇక ఈ విధానం విద్యావ్యాపారాన్ని నిషేధించకపోయినా కనీసం నియంత్రిస్తుందా అంటే అదీ లేదు. పైగా ఒక పాఠశాలకు లేదా ఒక కళాశాలకు ఇంత స్థలం ఉండాలి, గదులు ఇంత విశాలంగా ఉండాలి వంటి అమలులో ఉన్న నిబంధనలు రద్దుచేయాలని ఈ విధానం నిర్దేశిస్తున్నది. ప్రైవేట్ యాజమాన్యాల వారు తమ విద్యాసంస్థలో ఏఏ వసతులు ఉన్నాయో వాటిని వెబ్‌సైట్ లో పారదర్శకంగా ప్రదర్శిస్తే చాలని ఈ విధానం పేర్కొంటుంది. ఫీజు నియంత్రణకు అక్రిడిటేషన్ గ్రేడ్లు వారిగా గరిష్ట పరిమితులు నిర్ణయించబడతాయి అని పేర్కొనడం జరిగింది. అంటే

**రమేష్ పట్నాయక్**
అఖిల భారత విద్యా హక్కు వేదిక

ఫీజు పెంచుకోవాలంటే ప్రైవేటు యాజమాన్యాలు పై స్థాయి గ్రేడ్ కొరకు 'ప్రయత్నించుకుంటే' సరిపోతుందన్న మాట. అక్రిడిటేషన్ రంగంలో కూడా ప్రైవేటు సంస్థలు రాబోతున్నాయి కాబట్టి అది పెద్ద సమస్య కాకపోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ విధానం విద్యావ్యాపారాన్ని నిషేధించడం లేదు సరికదా, పరిమితంగా ఉన్న నియంత్రణలను కూడా నీరుగారుస్తున్నది. కాంగ్రెస్ తెచ్చిపెట్టిన విద్యావ్యాపారానికి అదనంగా ఈ బి.జె.పి నాయకత్వాన గల ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దాతృత్వాన్ని ప్రోత్సహించాలి అనే పేరుతో దాతృత్వ సంస్థలుగా చెప్పుకునే సంస్థలకు ప్రభుత్వ నిధులను ధారాదత్తం చేయనున్నది. ఈ విధానం పేరు పబ్లిక్ ఫిలాంత్రఫిక్ పార్టనర్‌షిప్ (పి.పి.పి). ఈ విధానం పాలక పక్ష భావజాల సంస్థలకు నిధులను మళ్ళించడానికి రూపొందించబడిందనే విమర్శ వినిపిస్తుంది.

ఈ విద్యావిధానం కొంగ్రొత్త సమస్యలను ముందుకు తీసుకు వస్తుంది. ఈ విద్యావిధానం రాజ్యాంగంలో పొందుపరచబడిన రిజర్వేషన్లకు కూడా చెల్లుచీటి ఇచ్చింది. మొత్తం విధాన పత్రంలో విద్యార్థులకు సీట్లు కేటాయించే విషయంలో మరియు విద్యా సంస్థల ఉద్యోగాల నియామకం అన్న విషయంలో రిజర్వేషన్ అన్న పదమే లేదు. సామాజిక న్యాయం గురించి వ్రాసారు. కాని అది ఆర్థిక సహకారానికి ఇతర సహకారాలకు కుదించబడింది. విధాన పత్రంలో రిజర్వేషన్లు ఉండవు అని వ్రాయలేదు, కాని ఉంటాయని కూడా వ్రాయలేదు. ప్రధానంగా ఈ మధ్యనే సుప్రీం కోర్టు రిజర్వేషన్‌లు ప్రాథమిక హక్కు కాదు అనే ధోరణిలో వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రభుత్వం యొక్క విధాన పత్రం కూడా అసందిగ్ధంగా లేకపోవడం అనేక ప్రశ్నలకు చోటిస్తున్నది. ఇక ఉపాధ్యాయుల మరియు అధ్యాపకుల పదోన్నతుల విషయానికి వస్తే ఆ సందర్భంలో కూడా రిజర్వేషన్‌ల ప్రస్తావన లేకపోవడమే గాక, సీనియారిటీ గురించిన ప్రస్తావన లేదు. విద్యా సంస్థల వారీగా నియామకాల విధానాలు రూపొందించుకునే విధానం మరియు ప్రొబేషన్ విధానం ప్రవేశపెట్టాలని నిర్దేశించబడింది. పనితీరుపై ఆధారపడి ఉద్యోగాన్ని ఖరారు చేయడం, పదోన్నతుల ఇచ్చే విధానం ఉండాలని నిర్దేశించబడింది. నాయకత్వ లక్షణాలను ముందుగానే గుర్తించి వారి అభివృద్ధికి ప్రత్యేకమైన నిచ్చెనలు (లేడర్స్) కల్పించాలని పేర్కొనబడింది. మరొక విషయం, పదోన్నతులలో నాయకత్వ లక్షణాలకు, విద్యా సంస్థ అభివృద్ధి ఎడల నిబద్ధతకు మరియు సామాజిక సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించబడింది. మరి కొలవడానికి వీలుకాని నాయకత్వ లక్షణాలు, నిబద్ధత మరియు సామాజిక సంబంధాలకు పదోన్నతు లలో ప్రాధాన్యత ఇస్తే అది ఆత్మాశ్రయ నిర్ణయాలకు దారితీయదని ఎలా చెప్పగలం. పదోన్నతులలో రిజర్వేషన్లకు, సీనియారిటీకి చివరికి విద్యార్హతలకు కూడా చోటు ఉండదేమో అనే ఆందోళనలు వ్యక్తం అవు తున్నాయి. ఈ విధానం సార్వత్రిక నిబంధనల స్థానంలో అధిపతుల విచక్షణాధికారానికి ఎక్కువ పాత్ర కల్పించింది. అంటే రిజర్వేషన్లు, సీనియారిటీ మరియు రూల్ ఆఫ్ లా ప్రశ్నార్థకం అవుతాయన్నమాట.

ఈ జాతీయ విద్యావిధానం 2020 ప్రధాన లక్షణాలలో అధికార కేంద్రీకరణ ఒకటి. పాఠశాల విద్యకు వస్తే ఈ విధానం ప్రకారం పాఠ్యపుస్తకాలను కూడా కేంద్రమే రూపొందిస్తుంది. కేంద్రం పంపిన పాఠ్య గ్రంథాలలో ఎటువంటి మార్పులు చేయకూడదు. రాష్ట్రాలు సప్లిమెంటరీలు మాత్రం ప్రచురించుకోవచ్చు. మునుపెన్నడూ లేని విధంగా పాఠ్య వస్తువు కేంద్రీకరణ జరుగుతుంది. ఇక ఉన్నత విద్య విభాగంలో వైద్యవిద్య మరియు న్యాయవిద్య తప్పించి మిగిలిన వ్యవస్థను అంతటినీ నియంత్రియంచడానికి ఒక 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమీషన్ ఆఫ్ ఇండియా' ఏర్పాటు చేయబడుతుంది. ఇది తన నాలుగు సరిక్రొత్త అంగాలు 1) యన్.హెచ్.ఇ.ఆర్.సి ; 2) యన్.ఏ.సి; 3) హెచ్.ఇ.జి.సి; 4) జి.ఇ.సి ద్వారా ఉన్నత విద్యా వ్యవస్థను నియంత్రించడం, విద్యా సంస్థలకు అక్రిడిటేషన్ ఇవ్వడం, నిధులు మంజూరు చేయడం మరియు ఉన్నత విద్యా కోర్సులను రూపొందిడం మరియు వాటి ప్రమాణాలను నిర్దేశించడం చేస్తుంది, 1948 నాటి రాధాకృష్ణ కమీషన్ విశ్వ విద్యాలయాలు నియంత్రించబడకూడదు. న్యాయస్థానాల వలెనే అవి కూడా స్వయంప్రతిపత్తి కలిగి ఉండాలని భావించింది. విశ్వవిద్యాలయాలు స్వయం నియంత్రితం కావాలని భావించింది. అందుకే యూనివర్శిటీ రెగ్యులేటరీ కమిటీని నియమించాలని సిఫారసు చేయలేదు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని మాత్రమే చెప్పింది. అనాటి ప్రభుత్వం అలాగే చేసింది. అయితే ఇప్పుడు నూతన విద్యా విధానం ప్రకారం పైన చెప్పినట్లు విశ్వవిద్యాలయాలను నియంత్రించడానికి ఒక కమీషన్ ఏర్పడబోతూంది. విశ్వవిద్యాలయాలను ప్రభుత్వాలు నియంత్రించడం ఎడల మనకు అభ్యంతరం లేకపోతే మిగిలినవన్నీ వివరాలే. కొత్త సంస్థల ఏర్పాటు, ఉన్న సంస్థల పేరు మార్పు మరియు అధికారాల పునఃపంపిణీ మాత్రమే. ఎన్ని సంస్థలున్నా హైయ్యర్ ఎడ్యుకేషన్ కమీషన్ ఆఫ్ ఇండియా అనేది దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యను నియంత్రిస్తుంది. అధికార కేంద్రీకరణకు ఈ విధానం బలమైన ప్రాతిపదికలు కలిగి ఉందని స్పష్టంగా చెప్పవచ్చు. విశ్వవిద్యాలయాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాల మరియు రాష్ట్ర స్థాయి ఉన్నత విద్యా సమితుల పాత్ర నామమాత్రం చేయబడింది. ఇది రాష్ట్రాల ఫెడరల్ హక్కులకు భంగకరమైనది. ఈ విషయంపై ప్రాంతీయ పార్టీలు స్పందిస్తాయి అని భావిద్దాం. ఈ విధానంలో ముందు వెనుకలుగా ప్రతి యూనివర్శిటీకి ఒక బోర్డు ఆఫ్ గవర్నర్స్‌ను ఏర్పాటు చేస్తారు. విశ్వవిద్యాలయంపై సర్వాధికారాలు ఈ బోర్డు ఆఫ్ గవర్నర్స్‌కు ఉంటాయి. మరి ఈ బోర్డు ఆఫ్ గవర్నర్స్ పాలక పార్టీ వ్యక్తులతో నింపబడుతుందని విశ్వవిద్యాలయాలు పాలక పార్టీల వస్తుగత మరియు భావజాల ప్రయోజనాలకు కేంద్రంగా మారుతాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

సాధారణంగా విద్య అనేది మార్పుకు చోదక శక్తిగా భావించ బడుతుంది. కాని ఈ విధాన పత్రం విద్యావ్యవస్థ సంప్రదాయాలను కాపాడే విధంగా రూపొందించబడాలని నిర్దేశిస్తుంది. దేశ సంస్కృతిలో అంతర్ ఘర్షణను గాని, కాలంతరంలో మార్పును గాని అలాగే స్థలాంతరంలో వైవిధ్యాన్ని కాని ఈ విధాన పత్రం నమోదుచేయలేదు. సంస్కరణోద్యమ ముందుకాలానికి చెందిన సాంఘిక దురాచారాలనే భారతీయ సంస్కృతి అని భావించి వాటిని కాపాడడం విద్యారంగ కర్తవ్యంగా ధృవీకరిస్తే విద్య అనేది అంధకారంవైపు ప్రయాణం అవుతుంది. ఏది ఏమైనా ఈ విధానంపై ఒక లోతైన చర్చ జరగాలి.

# రైలు మార్గాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించండి-ఇఫ్టు జాతీయ కమిటీ పిలుపు-అమలు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ నిస్సిగ్గుగా 109 రైలు మార్గాల ప్రైవేటీకరణ పూనుకుంది. భారత రైల్వే వ్యవస్థకు నూట అరవై సంవత్సరాల చరిత్ర ఉంది. సాధారణ ప్రజలకు అతి తక్కువ ధరలతో, మంచి ప్రయాణాన్ని కల్పించే రైల్వేలను, ప్రైవేటు వాళ్ళకి అప్పగించడం పెను ప్రమాదంగా మారనుంది. భారత రైల్వేలో లక్షలాది మంది కార్మికవర్గం పనిచేసి కోట్ల సంపద కూడ పెట్టారు.

కరోనా సంక్షోభ కాలంలో పాలకవర్గాలు కరోనా ని ఎలా ఎదుర్కోవాలనే విషయం కాకుండా లాభాలు వచ్చే సంస్థలను ప్రైవేట్ వాళ్లకు ఎలా కట్టబెట్టాలి, విదేశీ పెట్టుబడులను ఎలా ఆహ్వానించాలి అని ఆలోచిస్తున్నది. 130 కోట్ల భారతీయులు భయం గుప్పిట్లో జీవిస్తున్న కాలంలో, వారికి అండ ఇవ్వాల్సింది పోయి నేడు కార్పొరేట్ కంపెనీలకు ఎలా సేవ చేయాలని పాలకవర్గాలు ఆలోచిస్తున్నాయి. అందులో భాగం గానే విదేశీ పెట్టుబడులను 100% ఆహ్వానించడానికి, 109 రైలు మార్గాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి పచ్చజెండా ఊపారు. భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న అనేక కార్మిక హక్కులను హరించడానికి, ఆర్డినెన్స్ రూపంలో వాటిని కట్టడి చేయడానికి పునుకున్నారు. వీటిని వ్యతిరేకిస్తూ భారత కార్మిక సంఘాల సమైక్య జాతీయ కమిటీ జూలై 24న దేశవ్యాపితంగా రైలు మార్గాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 23 రైల్వే స్టేషన్ల పరిధిలో ఐ.ఎఫ్.టి.యు శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు.

**ఖమ్మం రైల్వే స్టేషన్** వద్ద నిరసన చేయడానికి అనుమతి ఇవ్వకపోవడంతో చంద్రపుల్లారెడ్డి భవన్ దగ్గర నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. రామయ్య, జిల్లా ఐఎఫ్టియు నాయకులు అశోక్, రామారావు, కె శ్రీనివాస్, రంగయ్య, నాగేశ్వరరావు, పి వెంకన్న, పటేల్ తదితరులు పాల్గొన్నారు.

**మధిర:** రైల్ రూట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐఎఫ్టీయు జిల్లా అధ్యక్షులు వెంకన్న నాయకత్వాన ఐఎఫ్టీయు నేతలు డి. శ్రీనివాస్, కే. పుల్లారావు, వై బాబు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**కారేపల్లి:-** కారేపల్లి రైల్వే స్టేషన్లో ఇఫ్టు నాయకత్వాన నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, బి. వీరు, హుస్సేన్, రవి పాల్గొన్నారు.

**ఖమ్మం రూరల్:** ఎం. వెంకటాయపాలెం దగ్గర నిరసన తెలిపారు. పుల్లయ్య, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం:-** కొత్తగూడెం రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. సంజీవ్ సతీష్ శ్రీనివాస్ నాయకత్వం వహించారు.

**మణుగూరు:-** రైల్వే స్టేషన్ ముందు ఇఫ్టు నాయకత్వాన నిరసన వ్యక్తం చేశారు. మధుసూదన్ రెడ్డి, ఎండీ గౌస్, రాజు సమ్మయ్య, చారి, శ్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ జిల్లా:-** నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైళ్ల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. రాజన్న, జిల్లా నాయకులు బక్కన్న, రామ లక్ష్మణ్, గఫూర్, గంగన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల:-** గద్వాల రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేయడానికి పూనుకోగా, పోలీసులు కార్యకర్తలను అరెస్ట్ చేయడానికి సిద్ధమయ్యారు. వారి నుంచి తప్పించుకొని నిరసన వ్యక్తం చేసి స్టేషన్ మాస్టర్ శివరాం ప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

**జగిత్యాల:-** కోరుట్ల రైల్వేస్టేషన్ లో నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు సిహెచ్ భూమేశ్వర్, భీమయ్య, యం. గంగాధర్, పోషల్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్:-** జిల్లా రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మురళి, ఎల్.బి. రవి, శివకుమార్‌లు పాల్గొన్నారు.

**ఆర్మూర్:-** రైల్వే స్టేషన్ ముందు ఐఎఫ్టీయు జిల్లా జిల్లా కార్యదర్శి దాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్తన్న, జిల్లా నాయకులు శివాజీ, సుంకరి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కృష్ణంరాజు పాల్గొన్నారు.

**బోధన్:-** బోధన్ రైల్వే స్టేషన్ ముందు ఐఎఫ్టియు జిల్లా నాయకులు మల్లేష్ నాయకత్వాన నిరసన కార్యక్రమం చేశారు.

**అదిలాబాద్:-** జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ ముందు వెంకట్ నారాయణ నాయకత్వాన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జగన్, మహేష్, విజయ్, సుభాష్ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్:-** జిల్లా రైల్వే స్టేషన్ ముందు ఐఎఫ్టి రాష్ట్ర కోశాధికారి శ్రీ వెంకటేష్ నాయకత్వాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాంబశివుడు, దాసు, సతీష్‌లు పాల్గొన్నారు.

**నారాయణపేట్:-** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో ఐఎఫ్టీయు నాయకులు ఎం. హన్మేశ్, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశీనాథ్, నాయకులు నర్సిములు, ఎదిరింటి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

**దేవరకద్ర:-** రైల్వే స్టేషన్ దగ్గర ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ ,కొల్లఅంజన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

**యాదాద్రి భువనగిరి:-** ఆలేరు రైల్వే స్టేషన్ ముందు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఐఎఫ్టియు సహాయ కార్యదర్శి ఆర్ జనార్ధన్ నాయకత్వం వహించాడు. ఐఎఫ్టీయు జిల్లా నాయకులు సుదర్శన్, పి రమేష్, శ్రీను, ఏ వెంకటేష్, నరేష్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

**నల్లగొండ:-** రైల్వే స్టేషన్ ముందు నాయకులు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగేష్ ,చారి, కే వెంకన్న, డి నరసింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. పిడిఎస్‌యు సాగర్ కూడా మద్దతు తెలియజేశారు.

**వరంగల్:-** వరంగల్ రైల్ స్టేషన్ ముందు రైలు రూట్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, పసునూరి రాజు, బాల్రాజ్, బయ్యన్న, ఫణి మరియు రమేష్‌లు పాల్గొన్నారు

**మహబూబాబాద్:-** రైలు రూట్ల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఇఫ్టు పిలుపులో భాగంగా రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి సూర్యనారాయణ, శ్రీధర్, జి. యాకయ్య, లింగయ్య, యాకయ్య, భాస్కర్ రెడ్డి, టి.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

**బయ్యారం:-** బయ్యారం మండల కేంద్రంలో మన కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు దీనికి వీరభద్రం నాయకత్వం వహించారు

**రామగుండం:-** రామగుండం రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎఫ్టీయూ రాష్ట్ర సభ్యులు వెంకన్న జిల్లా నాయకులు అశోక్, రాజమల్లు, మల్లేష్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి:-** రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయు రాష్ట్ర కమిటీ సభ్యులు నరేష్ జిల్లా నాయకులు రమేష్, ధర్మ, గుమ్మడి వెంకన్నలు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై హమాలీల కార్మికుల సమ్మె పిలుపు

రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై కేంద్రాలు 182 ఉన్నాయి. ఇందులో దినసరి కూలీలు ,హమాలీలు ,ఉద్యోగులు సుమారు నాలుగువేల మంది పనిచేస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు, ఒకసారి వేతన ఒప్పందం జరిగే ఆనవాయితీ ఉంది ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2019 డిసెంబర్ లో చేయాల్సిన ఒప్పందాన్ని ఇప్పటివరకు ఆలస్యం చేస్తూ వస్తున్నారు. దీనితో సిఐటియు, ఏఐటియుసిలో ప్రధానంగా సమ్మె పిలుపునిచ్చారు. మూడు జిల్లాల్లో ఐఎఫ్టియు కూడా సివిల్ సప్లైస్ లో పనిచేస్తున్నది. ఎనిమిది నెలలుగా వేతన ఒప్పందం చేయకుండా ఆలస్యం చేయడాన్ని నిరసిస్తూ ఆ సమ్మెలో ఐఎఫ్టీయు కూడా భాగస్వామ్యం అయ్యింది. పాల్వంచ, ములకలపల్లి గిరిజన కార్పొరేషన్ సెంటర్ లో సమ్మెలో ఉన్నారు దీనికి గోనెల రమేష్, వేల్పూరు రమేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

(7వ పేజీ తరువాయి)

దేశాలలో చైనాను భాగస్వామి చేసింది. చైనా తన ప్రధాన వ్యాపార భాగస్వామిగా మారి అది ఆటంక పెట్టలేదు. చైనా, అమెరికా ప్రపంచాధిపత్యాన్ని రాజకీయంగా కాని, సైనికంగా కాని ఎక్కడా సవాలు చేసింది కూడా లేదు. దీనికి భిన్నంగా, రష్యా, ఉక్రెయిన్‌లో నాటో ఆధిపత్యాన్ని సైనికంగా అడ్డుకుంది. సిరియాలో ప్రత్యక్షంగా సైనిక జోక్యం చేసుకొని అమెరికాను ఆ ప్రాంతం నుండి వైదొలిగేలా చేసింది. పశ్చిమాసియాలో రష్యా, అమెరికా ఆధిపత్యాన్ని ప్రత్యక్షంగా సవాలు చేస్తున్నది. అయినా, అమెరికా, రష్యాను కాకుండా, చైనానే తన తక్షణ, ప్రత్యక్ష గురిగా చేసుకోవటం గమనార్హమైన విషయం.

ఈ సంవత్సరం నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో తమ దేశ ప్రధాన ఆర్థిక, రాజకీయ ప్రత్యర్థి అయిన చైనాతో తాను దృఢంగా పోరాడుతున్నానని అమెరికా ప్రజలను నమ్మించటం, చైనా మీద దాడిని ట్రంప్ తీవ్రతరం చేయటానికి తక్షణ కారణం కావొచ్చు. ఇందుకోసమే, సైనిక సమీకరణతోసహా, యింత సర్వతో ముఖ దాడికి అమెరికా పూనుకుంటున్నదని నమ్మటం కష్టంగా వుంది.

### చైనాతో ఘర్షణకు అమెరికా చెబుతున్న కారణాలు

### చైనా చెప్తున్న సమాధానం

చైనా, తనను దాటవేసి, ప్రపంచంలో నం.1 ఆర్థిక శక్తిగా మారాలని చూస్తున్నదనీ. ప్రపంచాధిపత్యాన్ని తన చేతుల్లో నుండి గుంజుకోవాలని ప్రయత్నిస్తున్నదనీ, తన ప్రపంచాధిపత్యానికి సవాలుగా మారిందనీ అమెరికా బహిరంగంగానే విమర్శిస్తున్నది.

తాను, ఒక దేశం ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించే విధానానికే వ్యతిరేకం అని చైనా చెప్తున్నది. కనుక, అమెరికాను ఆధిపత్యం స్థానం నుండి తొలగించి, ఆ స్థానాన్ని తాను చేపట్టాలనే వుద్దేశం తనకెంత మాత్రం లేదని చైనా జవాబిచ్చింది. తనకు ప్రపంచంలో ఎక్కడా సైనిక స్థావరాలు లేవని, తనకు విస్తరణ వాద వాంఛ లేదని అది చెప్తున్నది.

అమెరికా నాయకత్వంలో రూపొందించబడిన అంతర్జాతీయ ఆర్థిక విధానాల పరిధిలో, నియమ నిబంధనల పరిధిలో వ్యవహరించి మాత్రమే తాను ఆర్థికంగా రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందానని అది జవాబిస్తున్నది. గతంలో ఆధిపత్య శక్తులుగా యెదిగిన దేశాలలాగా తాను వలస వాదాన్ని కానీ, బానిస విధానాన్ని కాని అనుసరించ లేదని, యుద్ధాలకు పూనుకోలేదని అది జవాబిస్తున్నది. తన దేశ అభివృద్ధి, తన ప్రజల జీవన పరిస్థితుల మెరుగుదలే తన లక్ష్యాలని అది చెప్తున్నది. ప్రపంచ శాంతిని తాను కోరుతున్నానని, ప్రపంచ దేశాలన్నీ, ఉమ్మడిగా ఆమోదించిన అంతర్జాతీయ ఆర్థిక, న్యాయ సూత్రాలకు లోబడి వ్యవహరించాలని, పరస్పర లాభదాయకమైన సంబంధాలను కొనసాగించాలని కోరుతున్నానని అది చెప్తున్నది.

చైనా, తన టెక్నాలజీని దొంగతనం చేస్తున్నదని, కరెన్సీ మేనిప్యులేషన్ (తన కరెన్సీ విలువను కృత్రిమంగా తక్కువగా చూపించటం)కు పూనుకుంటున్నదని అమెరికా ఆరోపిస్తున్నది. ఇవి, ఆధారం లేని, అబద్ధపు ఆరోపణలని చైనా కొట్టి వేస్తున్నది. టెక్నాలజీ రంగంలో వేగంగా కొత్త ఆవిష్కరణలు చేసుకుంటూ అమెరికాను అధిగమించి పోయే స్థితికి తమ సంస్థలు చేరుకోవటాన్ని అమెరికా జీర్ణించుకోలేక పోతున్నదని చైనా ఆరోపిస్తున్నది.

చైనా, ప్రపంచ దేశాలపై తన వ్యవస్థను, తన సిద్ధాంతాన్ని, విలువలను రుద్దటానికి పూనుకుంటున్నదని, ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి, చైనా పెను ముప్పుగా మారిందని, దీనిని ఓడించటానికి ప్రపంచ దేశాలన్నీ చైనాకు వ్యతిరేక కూటమిగా యేర్పడాలని అమెరికా పిలుపునిచ్చింది.

తాను తన సిద్ధాంతాన్ని కాని, తమ రాజకీయ వ్యవస్థను కాని ఏ దేశం మీద రుద్దదలచుకోలేదని, సిద్ధాంతాలను, వ్యవస్థలనూ ఎగుమతి చేయటం తమ విధానం కాదని చైనా జవాబిచ్చింది. అదే సమయంలో, ఇతర దేశాలు, తమ దేశంలోకి వారి సిద్ధాంతాలను కానీ, వ్యవస్థలను కానీ ఎగుమతి చేయటానికి పూనుకుంటే, తాము సహించబోమని, అనుమతించబోమని చైనా జవాబిచ్చింది. ఒక చిన్న గ్రూపు ప్రయోజనాల కోసం పనిచేసే సిద్ధాంతాన్ని కానీ, వ్యవస్థలను కానీ తాము అంగీకరించబోమని, తమ దేశ ప్రయోజనాలను, తమ ప్రజలందరి శ్రేయస్సును ముందుకు తీసుకుపోయే సిద్ధాంతాన్ని, వ్యవస్థలను మాత్రమే తాము అంగీకరిస్తామని చైనా పేర్కొంది. ఈ విషయంలో తాము "మరొక అమెరికా" కాదలచుకోలేదని, తమ 'స్వాతంత్ర్యాన్ని' కోల్పోదలచుకోలేదని చైనా స్పష్టం చేసింది. ఒక దేశం మరో దేశపు ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటానికి తాము వ్యతిరేకమని చైనా పేర్కొన్నది.

ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు చైనా నుండి ముప్పు యేర్పడిందనే అమెరికా వాదన యెంత మాత్రం వాస్తవం కాదు. అందులో యెంత మాత్రం పస లేదు. పైగా, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యాలకు అమెరికాయే పెను ముప్పుగా పరిణమించిందనేది కూడా నగ్న సత్యం. తన దోపిడీ, ఆధిపత్య విధానాలకు, తానే ప్రోత్సహించిన ప్రాపంచీకరణ విధానాలు ఆటంకాలుగా పరిణమించాయని భావించి, అమెరికా, నేడు, ప్రొటెక్షనిస్టు విధానాలకు పూనుకుంటున్నది. అంతర్జాతీయ సంస్థలన్నిటి నుండి అంతర్జాతీయ ఒప్పందాలన్నిటి నుండి బయటకు వస్తున్నది. ఈ విధానాలతో, చైనా లాంటి దేశాల పెరుగుదలను, తనకు పోటీగా మారే అవకాశాన్ని అరికట్టలేనని భావించి, అది, చైనాతో భౌతిక ఘర్షణకు సిద్ధమవుతున్నది. తన ఆర్థిక, రాజకీయ, సైనిక ఆధిక్యతను నిలబెట్టుకోవటానికి యెంత దూరమైనా వెళ్లటానికి అది సిద్ధమవుతున్నది. పర్యవసానమే అమెరికా, చైనాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితి యేర్పడి తీవ్రతరం కావటం.

అయితే, కోవిడ్-19 సంక్షోభం, దాని పర్యవసానంగా యేర్పడిన ఆర్థిక సంక్షోభం, చైనాతో సైనిక ఘర్షణకు అమెరికాకు అనేక పరిమితులను విధిస్తున్నాయి. అయినా, ఆధిపత్య శక్తులు అనాలోచితమైన తెగింపు చర్యలకు పూనుకోవని చెప్పలేము. ప్రపంచ దేశాలూ, ప్రజలూ, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధ చర్యలకు వ్యతిరేకంగా, ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం పోరాడాలి. ఆ విధంగానే మరో ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని, అణుయుద్ధ ప్రమాదాన్ని, మానవాళి వినాశనాన్ని నివారించుకోగల్గుతాం.

# భద్రాద్రి జిల్లాలో పోడు భూముల రక్షణకై పోరాటం

భద్రాద్రి జిల్లాలో పోడు భూముల సమస్య తీవ్రంగావున్నది. హరితహారం 6వ విడత కార్యక్రమంలో భాగంగా 2020 మార్చి, ఏప్రిల్, మే నెల నుండే అందుకు ముందస్తు చర్యలను టీఆర్ఎస్ ప్రభుత్వం అటవీ శాఖ అధికార్ల ద్వారా మొదలు పెట్టింది. జిల్లాలో వారు ఎక్కడైతే మొక్కలు నాటదలిచారో ఆ ప్రాంతాలను గుర్తించి, అక్కడ పోడు సాగు చేసుకొంటున్న ఆదివాసీ, గిరిజన, ఇతర పేదలను బెదిరించటం, కందకాలు తీయటం వంటివి చేపట్టారు. తొలకరి ప్రారంభం కావటంతో రైతులను పంటలు వేయవద్దని సాగును అడ్డగించుట, ట్రాక్టర్లను పట్టుకొని కేసులు పెట్టటం వంటి చర్యలు చేపట్టారు. నువ్వు, తదితర పంటలు వేశారు. ఈ పంటలను కొన్ని చోట్ల అటవీ అధికారులు ట్రాక్టర్లతో ధ్వంసం చేసి, మొక్కలు నాటారు. ఈ క్రమంలో కందకాలు తవ్వే దగ్గర నుండి చాలా చోట్ల ఆదివాసులు ప్రతిఘటించారు. నిర్మాణ బలం వున్న దగ్గర ప్రతిఘటించి రక్షించుకున్నారు. బలహీనమైన చోట్ల అటవీ అధికారులు హరిత మొక్కలు వేసుకోగలిగారు. ఒక వేళ అధికారులు బలవంతంగా వేసినా, ఆదివాసులు మొక్కలు పీకివేసి తిరిగి పంటలు వేసుకొన్నారు. ఈ క్రమంలో పోలీసు కేసులు నమోదు చేశారు. కొందరు జైలుపాలైనారు. అయినా జనం దృఢంగా నిలబడ్డారు. అంతేకాదు, అటవీ అధికారులు పోలీసులు ప్రజలను నీరుగార్చటానికి చేస్తున్న ప్రయత్నాలకి ప్రజలు సమాధానం చెప్పటం వారి చైతన్యానికి నిదర్శనం. భద్రాద్రి జిల్లాలోని కొన్ని మండలాల్లో జరిగిన ప్రతిఘటనా పోరాటాలు.

**1) దమ్మపేట మండలం మొండివర్రె** – గుండుగలపల్లి సమీపంలో సుమారు 1000 ఎకరాలలో 6 గ్రామాల ప్రజలు 2000 సం॥రానికి ముందు నుండే పోడు నరికి 400 ఆదివాసీ కుటుంబాలు సాగు చేసుకొని జీవిస్తున్నాయి. జీడి మొక్కలు వేసుకొన్నారు. పత్తి, కంది, మొక్కజొన్న, తదితర పంటలు పండించుకొంటున్నారు. ఈ భూమికి పట్టాలివ్వమని తహశీల్దార్‌కి, ఐటీడీఏ పీఓకు పలుమార్లు దరఖాస్తులు అందజేశారు. కానీ, పట్టాలివ్వటానికి ముందుకు రాని ప్రభుత్వం, ఈ సం॥రం జూన్ 16న కొందరు రైతులు జీడి మొక్కలు వేసుకొనుచుండగా అటవీ అధికారులు అడ్డుపడ్డారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. అటవీ అధికారులు ఆదివాసీలపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. జూన్ 18, 19 తేదీలలో పోడు భూమిలో పని చేసుకొంటున్న రైతులను పోలీసులు, అటవీ అధికారులు వచ్చి మొత్తం భూమిలో 50 ఎకరాలు విడిచి పెట్టాలని లేక పోతే కేసులు పెడతామని బెదిరించారు. ఆ తరువాత చాలా సార్లు గ్రామాల ముఖ్యులను, న్యూడెమోక్రసీ నాయకులను స్టేషన్‌కు పిలిపించి బెదిరించారు. 50 ఎకరాలు వదలాలని, లేకపోతే కేసులు పెడతామని మరోసారి హెచ్చరించారు. బెదిరింపుల కొనసాగింపుగానే 5.7.2020న అశ్వారావుపేట సి.ఐ. మండల కార్యదర్శి అప్పారావు, మరో 10 మందిని రాత్రి 10 గంటల వరకు వుంచుకొని బెదిరించారు. అయినా ధైర్యంగా, పోడు భూమిని వదలము అని చెప్పారు. అయితే ఏదో లాగా మొక్కలు వేసి తీరాలనే మొండి పట్టుదలగల అటవీ అధికారులు 6.7.2020న తెల్లవారు జామున ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి అప్పారావు, మరో 10 మంది ముఖ్యులను అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టారు. హరిత మొక్కలు నాటుటకు ఉదయం ఎవరుండరని భావించారు. అయినా అటవీ అధికార్లు, పోలీసులు గండుగుల పల్లి, మొండివర్రె కాలనీ, దురదపాడు, ముత్తాయిగూడెం, జారెగుంపు, తదితర గ్రామాలను దిగ్బందించి మొక్కలు వేయుటకు ట్రాక్టరుతో దున్నటం ప్రారంభించారు. ముందుగా మొండివర్రె గ్రామస్తులు అడ్డుకొన్నారు. వీరిని అరెస్టు చేశారు. అయినా తెలిసిన వారు తెలిసినట్లుగా 500 మంది ఆదివాసులు పోడులోకి వచ్చి అటవీ అధికార్ల పనులను అడ్డగించారు. దీనితో సాయంత్రం 2 గంటల వరకు ఆదివాసీలు అధికార్లతో గొడవ పడ్డారు. ఒక్క అడుగు ముందుకు సాగనివ్వలేదు. దీనితో పోలీసులు, అటవీ అధికార్లు వెనుదిరగవలసి వచ్చింది. సాయంత్రం ముఖ్యులను స్టేషన్‌కు రమ్మన్నారు. ఓటమిని మింగలేక పోలీసులు నాయకులను బెదిరించారు. అయినా ఆదివాసీలది ఎలా న్యాయమో, వారికి వున్న గత కేసుల ఆధారాలు, పిటిషన్లు చూపించి ఎదిరించుట జరిగింది. ఈ సందర్భంగా 41 మందిపై నాన్ బెయిల్‌బుల్ కేసులు పెట్టి జైలుకు పంపారు. ఇందులో న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి ఎ. రాముపై కేసు పట్టారు. ధైర్యంగా ప్రతిఘటించిన ఆదివాసులకు మద్దతుగా, అదే రోజు మరియు 13.7.2020న న్యూడెమోక్రసీ రాష్ట్ర బృందం పర్యటించి ధైర్యం చెప్పింది. బృందంలో పీఆర్, కేఆర్, జీవీఆర్, ఎంబీ, తదితర నాయకులున్నారు.

**2) దుమ్ముగూడెం మండలం** – దుమ్ముగూడెం మండలం గౌరారం ఆదివాసీలు 2000కి ముందు నుండే 130 కుటుంబాలు గ్రామానికి ప్రక్కనే గల 500 ఎకరాల అడివిని శుభ్రం చేసి పంటలు పండించు కొంటున్నారు. వీరంతా పేదలే. పోడు సాగును నిరోదించుటకు అటవీ అధికారులు అడవి ధ్వంసం చేశారని 2007లో 10 మందిపై కేసు పెట్టారు. తరువాత కేసు కొట్టివేశారు. అప్పటి నుండి ఆదివాసీలు పోడును అనుభవిస్తూనే వున్నారు. టీఆర్ఎస్ రెండుసార్లు గెలిచిన సందర్భంగా పట్టాలు వస్తాయని ఆదివాసీలు ఆశించారు. కేసీఆర్ ప్రకటనలను నమ్మారు. తమ గ్రామంలో కూడా టీఆర్ఎస్ ప్రెసిడెంట్‌నే గెలిపించుకొన్నారు. 2020 తొలకరిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 6వ విడత హరితహారంలో భాగంగా మొక్కలు వేయుటకు అటవీ అధికార్లు ప్రయత్నాలు మొదలు పెట్టారు. మరోప్రక్క కొందరిని వీడదీసి మెత్తబర్చటానికి, 100 ఎకరాల వరకు, 30 కుటుంబాలకిస్తామని సర్వే నాటకం ఆడారు. కానీ, పట్టాలివ్వ లేదు. ఇంతకు ముందు కూడా ఇదే ప్లాట్‌లో 9 మందికి 15 ఎకరాలు హక్కు పత్రాలిచ్చారు. మిగిలిన పోడు భూమిలో 2020 జూన్ 2న హరితహారం, మొక్కలు వేయుటకు అటవీ అధికార్లు పెద్దఎత్తున పూనుకొన్నారు. ఆదివాసీలకు – అటవీ అధికారులకు వాదోపవాదాలు జరిగాయి. డీఎఫ్ఓ సమక్షంలోనే వేసిన మొక్కలు పీకివేసి నిరసన తెలిపారు. అటవీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరునాడు అనగా 3.6.2020న దుమ్ముగూడెం స్టేషన్‌లో గ్రామస్తులంతా కలవాలని సి.ఐ. కబురు పెట్టాడు. సుమారు 100 మంది హాజరు కాగా, పోలీసులు తమ ధోరణిలో బెదిరించారు. హరితహారం కోసం మా బ్రతుకుదెరువు పోగొట్టుకోలేమని ఆదివాసీలు ముక్తకంఠంతో చెప్పారు. 60 మందిపై కేసు నమోదు చేశారు. అయినా, పోడు భూములపై పట్టుదలగల ఆదివాసీలు, న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు–కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో తహశీల్దార్, డీఎఫ్ఓ, ఐటీడీఏ పీఓలకు మెమోరాండాలు అందజేసి, తమ భూములకు హక్కులు కల్పించమని లాక్‌డౌన్ కాలంలో కూడా నిరసనలు తెలిపి మెమోరాండాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 40–70 మంది వరకు పాల్గొన్నారు. ఈ పోరాటంలో స్త్రీలు ముందు భాగంలో వున్నారు.

ఈ పోడు భూమిలో ఎలాగైనా హరిత మొక్కలు వేయాలనే పట్టుదలతో వున్న అటవీ అధికారులు 100 మంది ఆదివాసీలు 27.7.2020న వేసిన మొక్కలను తొలగించారు. అప్పటికే తాము వేసుకొన్న, బ్రతికి వున్న పంటలను రక్షించుకొనే ప్రయత్నంలో వున్నారు. మళ్లీ కేసు పెడతామని బెదిరిస్తున్నారు. ఇలా జరుగుతున్న క్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా ప్రతినిధి బృందం 24.7.2020న గౌరారం గ్రామం పర్యటించింది. పోడు రక్షణకు సమైక్యంగా పోరాడమని చెప్పింది. పర్యటన బృందంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కెచ్చెల రంగా రెడ్డి, జిల్లా నాయకులు ముద్దా బిక్షం, కె. కల్పన, డివిజన్ నాయకులు సాయన్న, తదితరులున్నారు.

**3) నారాయణరావుపేట పోడు పోరాటం** – దుమ్ముగూడెం మండలం నారాయణరావు పేట ఆదివాసీలు 2000 సం॥రంలో 50 కుటుంబాలు, 150 ఎకరాల పోడు నరుక్కుని సాగుచేస్తుండగా, 2007లో 10 మందిపై అటవీ అధికారులు కేసు పెట్టారు. జైలుకు వెళ్ళి వచ్చారు. పోడును మాత్రం వీడలేదు. 2020లో హరిత మొక్కలు వేయుటకు, అటవీ అధికారులు ఎండా కాలంలోనే ఆదివాసీలను బెదిరించుట మొదలు పెట్టారు. కందకాల తవ్వకం చేశారు. ఆ సందర్భంగా ఆదివాసీలు నిరసనలు తెలిపారు. అయినా ఆగలేదు. తొలకరి ప్రారంభం కాగానే అటవీ అధికార్లు 18.6.2020న పత్తి పంటలు ధ్వంసం చేసి, హరిత మొక్కలు వేశారు. ఆదివాసీలు ఆ మొక్కలను తొలగించి తిరిగి పంటలు వేశారు. ఈ విషయమై అటవీ అధికారులు పోలీసు కేసు పెట్టి, పోడులో పని చేసుకొంటున్న ఆదివాసీలను అరెస్టు చేయుటకు వెళ్ళగా ప్రతిఘటించారు. బలవంతంగా అరెస్టు చేశారు. 21 మందిపై కేసు పెట్టారు. అటవీ అధికారులు జులై మొదటి వారంలో మళ్లీ మొక్కలు వేశారు. కాగా, బ్రతికున్న పంటలను కాపాడుకొనుటకు అటవీ శాఖపై పోరాడాలని ఆదివాసీలు సమాయత్తమవుతున్నారు.

**చిన్న ఆర్లగూడెం పోడు రక్షణ పోరాటం** – దుమ్ముగూడెం మండలం చిన్న ఆర్లగూడెం, పెద్ద ఆర్లగూడెం, సింగారం ఆదివాసీ గ్రామాల మధ్యగల అటవీ భూమిని 200 మంది, 300 ఎకరాలు పోడు గొట్టి 2000 సం॥రం నుండి సాగు చేసుకొంటున్నారు. ఈ పోడుపై 2002–2003లో, 2007, 2013లో కేసులు అయినాయి. అయినా వదలకుండా ఆదివాసీలు సాగు చేస్తూనే వున్నారు. పట్టాలు ఇవ్వాలని నూరు దరఖాస్తులు కూడా చేసుకొన్నారు. కానీ, చిత్తశుద్ధి లేని ప్రభుత్వాలు దరఖాస్తులను పక్కన పెట్టాయి. అయితే 2020 సం॥రంలో 6వ హరితహారం కోసం ఈ 300 ఎకరాలనే అటవీ అధికారులు నిర్ణయించుకొన్నారు. సాగు మానమని బెదిరించుట మొదలు పెట్టారు. లాక్‌డౌన్ కాలంలో కందకాలు తీయించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు ప్రతిఘటించారు. కందకాలు పూడ్చి వేసి నిరసన తెలిపారు. అటవీ అధికార్లు ఆదివాసీల్లో తెచ్చే ప్రయత్నాల చేశారు. 17 మందికి సంబంధించిన భూమి, 50 ఎకరాలలో మొక్కలు వేయుటకు ప్లాన్ చేసుకొన్నారు. 2 ఎకరాలలోని పత్తి పంట ధ్వంసం చేశారు. మిగతా వారికి పట్టాలిస్తామని నమ్మ బలుకుతున్నారు. దీనితో 'మా భూములు పోవటం లేదుగదా మేమెందుకు పోరాడాలనే" భావన వచ్చింది. అయినా, భూములు కోల్పోతున్న 17 మంది మాత్రమే అటవీ అధికారుల దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అటవీ అధికార్లు వేసిన హరిత మొక్కలు తొలగించే పంటలు కాపాడుకోవాలని ఆరాటపడు తున్నారు. వీరి పోరాటానికి అందరిని సమైక్య పర్చే కృషి జరుగుతున్నది.

ఎపీలో కలిపిన ఎటపాక (భద్రాచలం), కూనవరం మండలాల్లో పోడు భూమి సమస్య – రామచంద్రుని పేట అనే ఆదివాసీ గ్రామం దుమ్ముగూడెం మండలంలో వున్నప్పటికీ, వారు సాగు చేసే పోడు భూమిలో కొంత అనగా 200 కరాలు పోలవరం ప్రాజెక్టు కోసం ముంపు మండలంగా కలిపిన ఎటపాక (భద్రాచలం) మండలంలోకి పోయింది. ఈ 200 ఎకరాల పోడు భూమిని, వలస వచ్చి ఆక్రమించారని అటవీ శాఖ ఆరోపిస్తూ దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవాలని, గత 3 సం॥రాలుగా ప్రయత్నిస్తున్నది. అయినా ప్రతిఘటించి రక్షించుకొంటూ వస్తున్నారు. నిర్బంధాన్ని సైతం ఎదుర్కొన్నారు. 2020 సం॥రం జులై 9న మరోసారి రేంజర్, ఒక నోటీసు పంపాడు. దీనికి గ్రామస్తులు సమాధానం పంపారు. ఐటీడీఏ, పీఓ చింతూరు వారిని కూడా రిప్రజెంట్ చేశారు. ఈ భూమిలో పత్తి, కంది, నువ్వు, వరి తదితర పంటు వేశారు.

ఈ పోడు భూమి వాస్తవానికి తాతల నాటిదే. దీనికి 1996లో అటవీ అధికారులు మోసిగించి వీఎస్ఎస్ ప్రారంభించారు. అది విఫలమైనది. దీనితో ఎవరి భూములు వారు తిరిగి పంటలు వేసుకోసాగారు. 2008లో ఉమ్మడి పట్టాలిచ్చారు. 2013లో షెడ్యూల్డ్ ప్రాంతంలో వి.ఎస్.ఎస్. చెల్లదని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. ఇంత వరకు ఎమి అనని అటవీ అధికారులు 2017 నుండి ఆ భూమిని కాజేయుటకు, మొక్కలు వేయుటకు, దాడులు, బెదిరింపులు, నిర్బందానికి పూనుకోగా న్యూడెమోక్రసీ నాయకత్వంలో తిప్పికొట్టి పంటలు కాపాడుకొంటున్నారు. 2020లో పట్టాలిచ్చేలా కృషి జరుగుతోంది. ఇది ప్రతిఘటనలో దృఢంగా నిలబడిన ఫలితమే. కూనవరం మండలం దూగుట్ట ఆదివాసీ గ్రామంలో అనేక సం॥రాలుగా ఆదివాసీలు సాగు చేసుకొంటున్న 50 కుటుంబాలు 100 ఎకరాలలోని ఆదివాసీలను గెంటి వేయుటకు గత 2 సం॥రాలుగా అటవీ అధికారులు ప్రయత్నిస్తుండగా ప్రతిఘటించి రక్షించుకొంటున్నారు. ఈ సం॥రం 2020లో కూడా మరోసారి గ్రామానికి వచ్చి బెదిరించగా ఆదివాసీలు ఎదురుతిరిగారు. "భూములు విడిచి పెట్టము" అని తేల్చి చెప్పారు. దానితో ఆగస్టు 9న పట్టాలిస్తామని చింతూరు పీఓ గ్రామానికి వచ్చి ప్రకటించారు.

ములకలపల్లి మండలం– ములకలపల్లి మండలం మూకమామిడి సమీపంలోని అడవిని 100 మంది ఆదివాసీలు, కొందరు ఇతర పేదలు 150 ఎకరాల వరకు సాగు చేసి పంటలు వేసుకొంటున్నారు. అయితే, ఇది కొత్త పోడు అని చెప్పి, అటవీ అధికారులు గత సం॥రం, రైతుల పత్తి పంట పాడు చేసి పోలీసుల సహకారంతో హరిత మొక్కలు నాటారు. వీటిని ప్రజలు పీకివేసి కొంత మేరకు పంటలు వేసుకొన్నారు. ఈ సం॥రం 2020లో కూడా మొక్కలు వేయుటలో భాగంగా అటవీ అధికారులు ప్రయత్నిస్తుండగా, ముఖ్యంగా మొక్కల కోసం కర్రలు పాతగా, వాటిని తొలగించి నిరసన తెలిపారు. అయినా అర్థం చేసుకోలేని అధికారులు మొక్కలు కూడా వేశారు. ఇట్టి చర్యలను ఎదిరించి పంటలు వేసుకొనుటకు, ఆదివాసీలు, ఇతర పేదలు సమాయత్తముతున్నారు.

## ఏఐకేఎంఎస్ ఆందోళనా కార్యక్రమాలు - జూలై 31 నుండి ఆగస్టు 9 వరకు ప్రచారం

లాక్‌డౌన్‌ను రద్దు చేయాలనీ, కరోనా కాలంలో పనిచేసే ప్రతి కుటుంబానికి నెలకు రూ. 10,000 అందించాలనీ, కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలనీ, రబీ సీజన్‌లో రైతాంగం అప్పులు రద్దు చేయాలనీ ఏఐకేఎంఎస్ కేంద్ర కమిటీ యిచ్చిన పిలుపులో భాగంగా పాలేరు డివిజన్‌లో జులై 26 నుండి ఆగస్టు 9 వరకు ప్రచార కార్యక్రమాలను, ఆందోళనలను నిర్వహించారు.

జూలై 31న తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులో గ్రూపు మీటింగ్ 10 మందితో నిర్వహించారు. ఏఐకేఎంఎస్ పాలలేరు డివిజన్ కార్యదర్శి ఆర్. శివలింగం, న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి సి.వై. పుల్లయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎం. రాజేంద్రప్రసాద్ మాట్లాడారు.

జింకల గూడెంలో గ్రూపు మీటింగు 20 మందితో జరిగింది. ఏఐకేఎంఎస్ పాలేరు డివిజన్ కార్యదర్శి ఆర్. శివలింగం, పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి సి.వై. పుల్లయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎం. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు.

దమ్మాయిగూడెంలో ఆగస్టు 1న 30 మందితో గ్రూపు మీటింగ్ జరిగింది. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, పాలేరు డివిజన్ కార్యదర్శి ఆర్. శివలింగం, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎం. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు.

ఆగస్టు 4న తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్ మండల ఆధ్వర్యంలో 20 మందితో ప్రదర్శన నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ అపర్ణారెడ్డికి ప్రతినిధి బృందం డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రసంగించారు.

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని దిల్దార్ నగర్ ధర్మాజీ పేట లింగాపూర్ చిట్యాల గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి ఈ నిరసన కార్యక్రమాలకు మండల నాయకుడు సుదర్శన్ నాయకత్వం వహించారు.

# భారత కార్మిక, రైతు, ప్రజా, రక్షణకు పోరాడుదాం ఆగస్టు 9 "సేవ్ ఇండియా" పిలుపు విజయవంతం

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి కరోనా ను కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా విఫలం అయ్యాయి. ఆనాడు ప్రణాళికాబద్ధంగా కాకుండా, అడ్డగోలుగా లాక్‌డౌన్ విధించి దేశ ప్రజానీకానికి కష్టాలను మిగిల్చింది. రెండు నెలల తర్వాత దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది వలస కార్మికులు ప్రభుత్వ నిబంధనలను ధిక్కరించి "తిండి అయినా పెట్టండి మా సొంత ప్రాంతాలకు అయినా పంపండి" అనే నినాదంతో రోడ్ల మీదికి వచ్చారు. ఎక్కడికక్కడ తీవ్ర ఆందోళనలు నిర్వహించారు. లక్షలాది మంది వలస కార్మికులు పొట్ట చేత పట్టుకొని వందల కిలోమీటర్లు కాలినడకతో ప్రయాణాలు సాగించారు.

ప్రజలందరూ కరోనా కష్టాల్లో మునిగి తేలుతుంటే, పాలకవర్గాలు 109 రైలు మార్గాలను ప్రైవేట్ వాళ్లకు కట్టబెట్టడానికి పచ్చజెండా ఊపడం దారుణం ,మరోపక్క 100% విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం దేశీయ ప్రభుత్వ రంగానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. అంతేకాక లాక్ డౌన్ సమయం సెలవుతో కూడిన వేతనాలు చెల్లించాలని జీవోలు విడుదల చేసిన ప్రభుత్వాలు తిరిగి వాటిని రద్దు చేయడం కార్మిక పట్ల వైఖరిని తెలియచేస్తోంది.

మహమ్మారి దెబ్బకు దేశవ్యాపితంగా ప్రజలకు ఆదాయం లేక కొనుగోలు శక్తి సన్నగిల్లింది. ఎక్కడికక్కడ పరిశ్రమలు, పరిశ్రమల ఉత్పత్తులు నిలిచిపోవడంతో ఉద్యోగాల కోత, అరకొర జీతాల వంటివి ముందుకు వచ్చాయి. భారతదేశంలో 14 కోట్ల మంది వలస కూలీలు, మరో 26 కోట్ల మంది ఇతర అసంఘటిత కార్మికులు, మోటారు, భవనం, షాప్స్, కాంట్రాక్ట్ పరిశ్రమల్లో పని చేస్తున్న వారు పనులు కోల్పోయారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ఒక సర్వేలో దేశములో 40 కోట్ల మంది అత్యంత దిగువ పేదరికంలో మగ్గే స్థితి దాపురించిందని పేర్కొన్నది.

కరోనా కల్లోల కాలమంతా పనులు లేక పోవడం, ఆకలితో అలమటించే దౌర్భాగ్యం రాకుండా కాపాడుట కొరకు, ఆకలి చావు లేకుండా నిరోధించడం కొరకు ప్రజలందరికీ నెలకు 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించి, దేశాన్నీ, శ్రమజీవుల ను రక్షించాలని డిమాండ్ చేస్తు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. నాటి ఆగస్టు 9 క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో, నేడు సేవ్ ఇండియా పిలుపుతో ఉద్యమించాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా జరిగిన కార్యక్రమాల రిపోర్టు ఇది.

**హైదరాబాద్:-** కేంద్ర కార్మిక సంఘాలు ఐఎఫ్‌టియు, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసిల నాయకత్వాన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు సేవ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎఫ్‌టీయు తరఫున కె. సూర్యం ,అన్వేష్ , సి ఐ టి యు పాలడుగు భాస్కర్, ఐఎన్టీయూసీ చంద్రశేఖర్, ఏ ఐ టి యు సి వి కె బోస్, టి ఎన్ టి యు సి బోస్ తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్:-** జిల్లా కేంద్రంలో సేవ్ ఇండియా కార్యక్రమాన్ని తెలంగాణ చౌరస్తా లో నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ తరఫున సి వెంకటేష్, సాంబశివుడు, నరసింహులు, సిఐటియు - కిల్లే గోపాల్, ఏఐటియు - సి. రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణపేట:-** జిల్లా కేంద్రంలో లో కలెక్టర్ కార్యాలయం ముందు సేవ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎఫ్‌టీయు తరఫున నర్సింహులు పాల్గొన్నాడు.

**వనపర్తి:-** జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తా ముందు గ్రామపంచాయతీ కార్మికులు చిన్న కురుమన్న, కురుమన్న, సురేష్, నరసింహ తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

**ఆత్మకూర్:-** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం కేంద్రంలో ప్రసాద్, చెన్నయ్య, రాములు, అలీ, నాగేష్ నాయకత్వాన నిరసన వ్యక్తం చేశారు.

**ఖమ్మం:-** జిల్లా కేంద్రంలో సేవ్ ఇండియా కార్యక్రమంలో ఐఎఫ్‌టియు తరఫున జి. రామయ్య, రామారావు, కె.శ్రీను, పి.వెంకన్న, పటేల్, సిఐటియు కళ్యాణ్ రావు ఏఐటియుసి నర్సింగ్ రావు ఐఎన్‌టీయుసి పాషా తదితరులు పాల్గొన్నారు.

**మాహబూబాబాద్:-** తొర్రూరు పట్టణంలో ఏఐకెఎమ్ఎస్ మరియు ఐఎఫ్‌టియు ఉమ్మడిగా నిరసన కార్యక్రమం చేశారు.

**అదిలాబాద్:-** జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో 'సేవ్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు వెంకట్ నారాయణ, జగన్, సుభాష్ సీఐటీయు రాజేందర్, ఏఐటియుసి విలాస్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్:-** జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. రాజన్న, జిల్లా నాయకులు బక్కన్న, గఫూర్, గంగన్న, సాయన్న, కిషన్ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు ఖాజామయ్య, ఏఐటియుసి నారాయణ తదితరులున్నారు.

# 1000 బీడీలకు 187 రూపాయలు సాధించిన కార్మికులకు విప్లవ జేజేలు

**వనపర్తి జిల్లా** బీడీ కార్మికుల వేతనాల కొరకు ఐఎఫ్‌టీయు, సిఐటియు, ఏఐటీయూసీ, టిఎన్‌టియుసి తదితర కార్మిక సంఘాల నాయకత్వాన యజమానులతో నాలుగు దఫాలుగా జరిగిన చర్చల ఫలితంగా 1000 బీడీలకు 20 రూపాయలు సాధించడం జరిగింది. గతంలో రూ. 167 లు ఉండగా, ప్రస్తుతం 20 రూ॥లు అదనంగా సాధించుకొన్నారు. ఇది కార్మిక విజయం,కార్మిక వర్గం ధైర్యంగా అధిక కూలి సాధించుకోవడం కొరకు తమ సంసిద్ధతను అనేకసార్లు వ్యక్తం చేసిన ఫలితంగా, బీడీ యజమాన్యంతో జరిగిన చర్చల్లో కార్మిక సంఘాల తరఫున సీరియస్ గా వాదించడం వలన యజమాన్యం 20 రూపాయలు ప్రకటించవలసి వచ్చింది. గత రెండు సంవత్సరాల కిందట పదిహేడు రూపాయల పెరుగుదల జరిగింది. ఈ దశలో 20 రూపాయలు సాధించడం అనేది కార్మికులు అందించిన విశ్వాసంతో నాయకత్వం, యాజమాన్యంతో చర్చించి సాధించే అవకాశం ఏర్పడింది. దీనికిగాను ఇఫ్టూ తరఫున కార్మికులకు విప్లవ జేజేలు తెలియజేశారు. పెరిగిన కూలి 2020 ఏప్రిల్ నుండి అమలవుతుంది.

**బీడీ ప్యాకింగ్ కూలి -** 2018 సం॥రం 5 రూ॥లు 50 పైసల నుండి 6 రూ॥లు 15 పైసలకు పెరిగింది. అంటే 65 పైసలు పెరిగినట్లు. నాడు బీడీ కూలి 17 రూ॥లు పెరిగింది. 2020 సం॥లో బీడీ కూలీ 20 రూ॥లు పెరగగా ప్యాకింగ్ రేటు 75 పైసలు పెరిగింది.

**రింగ్ బీడీ కూలి రేట్లు -** 2018 సంవత్సరంలో 18 రూపాయలు నుంచి 20 రూపాయల పది పైసలు పెరిగింది. బీడీ కూలి 17 రూపాయలు పెరిగిన నాడు, రెండు రూపాయల పది పైసలు పెరిగింది.

2020 బీడీ కూలి 20 రూపాయలు పెరిగింది. ఆ లెక్క ప్రకారం రెండు రూపాయల నలభై పైసలు పెరుగుదల ఉంటుంది. 1000 బీడీల కూలి ఇరవై రెండు రూపాయల యాభై పైసలు అవుతుంది.

**వేతన ఒప్పందాలు - ఖమ్మం:** ఇఫ్టు నాయకత్వాన మార్బుల్ హమాలి వేతన ఒప్పందం పాత వేతనాలపై 20 శాతం ,అలాగే నాపరాయి హమాలి కార్మికుల వేతన ఒప్పందం 20 శాతం పెరిగింది. ఐఎఫ్‌టియు, సిఐటియు, ఏఐటియుసి, టీఆర్ఎస్ కె.వి మరియు ఐ ఎన్ టి యు సి ల నాయకత్వాన దాల్ మిల్ ఐరన్ మరియు కోల్డ్ స్టోరేజ్ హమాలీల వేతన ఒప్పందం కొరకు కలెక్టర్‌తో చర్చలు జరిగాయి. పాత రేట్లపై 12 శాతం పెరుగుదలకు ఒప్పందం కుదిరింది.

**పెద్దపల్లి జిల్లా:** ఆర్జి3 సెంటినరీ కాలనీ సోలార్ ప్లాంట్ లో 45 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు సిఐటియు లో ఉన్నారు. ఈ మధ్యకాలంలో సీటు నుండి ఐ ఎఫ్ టి యు లోకి చేరారు. గతంలో 30 రోజులు పని చేస్తే 7000 రూపాయలు చెల్లించే వాళ్ళు. మన మన యూనియన్‌లో చేరిన తర్వాత నెలలో నాలుగు రోజుల సెలవులు మంజూరు చేయించాము, దీనితో 26 రోజుల పనికి 8వేల రూపాయల చెల్లింపుకు యజమాన్యంతో ఒప్పందం కుదిరింది. అలాగే గతంలో పిఎఫ్, ఈఎస్ఐ లేదు, నేడు పిఎఫ్, ఈఎస్ ఐ లు అమలు చేయడానికి యజమాన్యం అంగీకరించింది ,మరొక ముఖ్య విషయం కార్మికుడి, యజమాని వాటాలను(రెండు వాటాలు) యజమాన్యం చెల్లించడానికి అంగీకరించారు.

**వరంగల్:** వరంగల్ పట్టణంలో గల పోర్టు రోడ్డు గోదాం హమాలీలు 60 మంది ఉంటారు. వీరందరూ ఐఎఫ్‌టీయు సభ్యులు. పాత రేటు ఆరు రూపాయల నుండి తొమ్మిది రూపాయల యాభై పైసల పెరుగుదలకు ఒప్పందం కుదిరింది.

**మంచిర్యాల:-** ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. శ్రీనివాస్ నాయకత్వాన సేవ్ ఇండియా నిరసన కార్యక్రమం చేశారు. జిల్లా నాయకులు శ్రీనివాస్, తోకల రమేష్, అంజయ్య, మల్లన్న తదితరులు సిఐటియు ప్రకాష్, ఏఐటియుసి మేకల దాసు పాల్గొన్నారు.

**పెద్దపల్లి:-** జిల్లా కేంద్రంలో ఐఎఫ్‌టీయు నాయకులు లింగమూర్తి, రాజమల్లు నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

**గోదావరిఖని:-** గోదావరిఖని కేంద్రంలో సేవ్ ఇండియా కార్యక్రమానికి ఐఎఫ్‌టీయు నాయకులు రమేష్, ఈ. నరేష్, దుర్గన్న, సత్యనారాయణ రెడ్డి నాయకత్వం వహించారు.

**కొత్తగూడెం:-** జిల్లా కేంద్రంలో మూడు కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాన నిరసన జరిగింది. ఐఎఫ్‌టీయూ తరఫున సంజీవ్, చంద్రశేఖర్, కృష్ణ, సిఐటియు శ్రీధర్, ఏఐటియుసి గుప్త సత్యనారాయణ పాల్గొన్నారు.

**నిజామాబాద్:-** జిల్లా కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు నాయకులు ఎల్ బి రవి, శివకుమార్, మురళి సిఐటియు నాయకులు కూడా సేవ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఆర్మూర్:-** ఆర్మూర్ డివిజన్ కేంద్రంలో ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముత్తన్న, దాసు, శివాజీ, జి. కవితలు సేవ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు.

**బోధన్:-** ఐఎఫ్‌టీయు నాయకత్వాన సేవ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి మల్లేష్ నాయకత్వం వహించారు.

**(1వ పేజీ తరువాయి)**

సాగిస్తున్నది. ముఖ్యంగా ఇల్లెందు, గుండాల ప్రాంతాల్లో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నది. ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నది.

గత 50 సం॥లుగా గోదావరి లోయ ప్రాంతంలో విప్లవకారుల నాయకత్వంలో పోరాడి అనేక విజయాలను సాధించింది. ప్రారంభంలో పాక్షిక దోపిడీకీ వ్యతిరేకంగా ప్రజలు పోరాడారు. ఈ క్రమంలో భూపోరాటాలను సాగించారు. లక్షలాది ఎకరాలను ప్రజలు సాగు చేసుకొంటున్నారు. దాని నుండి వారి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యాన్ని మెరుగుపర్చుకొన్నారు. వారి హక్కులను సాధించుకుంటున్నారు.

నేడు ఆదివాసీల, మిగతా పేద ప్రజల స్వాధీనంలో వున్న భూములను స్వాధీనానికి రాజ్యం పూనుకున్నది. పోలీసులచే దారుణాతి దారుణంగా ప్రజలపై దాడులు కొనసాగిస్తూ వున్నది. తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నది. వారి జీవన భృతి కోసం సాగిస్తున్న వ్యవసాయాన్ని, ఇతర పనులను స్థంభింప చేస్తున్నది. అనేక వత్తిడిలకు గురి చేస్తున్నది. రాజకీయంగా లొంగతీసుకోవాలని ప్రయత్నిస్తుంది. కొంత మందిని ఏజంట్లుగా సృష్టించుకొని సమాచారం పొందుతూ, పాశవిక దాడులకు పూనుకొంటున్నది. అనేక మంది విలువయిన కామ్రేడ్స్‌ని పొట్టన పెట్టుకొన్నది. అందులో భాగమే కా॥ లింగన్నని చిత్రహింసలు పెట్టి క్రూరంగా చంపివేసింది.

విప్లవకారుల చీలికలు కూడా ప్రజలను నిరుత్సాహపర్చాయి. శత్రువు తన దాడులను మరింత తీవ్రం చేయడానికి దోహదపడ్డాయి. పటిష్టవంతమయిన విప్లవ పార్టీ నిర్మాణాన్ని ఈ చీలికలు దెబ్బ తీస్తున్నాయి. విప్లవోద్యమంలో ప్రారంభం నుండి నేటికీ కొనసాగుతున్న అతివాద, మితవాద, అరాచకవాద విధానాలు చాలా నష్టపర్చాయి. నిర్మాణానికి గుండె కాయ అయిన కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రం బాగా దెబ్బతిన్నది. ఇవన్నీ బలమైన విప్లవోద్యమ నిర్మాణానికి ఆటంకంగా తయారయ్యాయి.

ఉద్యమంలోని ఎగుడు, దిగుడు, ఆటుపోట్లు, స్థబ్దతలను విప్లవ కారులు విశ్లేషించుకొంటున్నారు. ఈ విశ్లేషణ పేరిట వుద్యమాలలోని లోటుపాటులను, వ్యతిరేక దృష్టితో చూసే ధోరణి బాగా పెరిగింది. ఇది నిరాశ, నిస్పృహలకి దారి తీస్తుంది. నక్సల్‌బరి పంథా నుండి దూరం చేస్తుంది. నయారివిజనిజంతో జరిగిన పోరాటంలో మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానాన్ని సిద్ధాంతంగా రూపొందించుకొన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని రాజకీయ కర్తవ్యంగా చేపట్టారు. దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాని కమ్యూనిస్టు విప్లవకారులు స్వీకరించారు. దాన్ని ఆచరిస్తున్నారు.

ప్రపంచంలో రష్యా, చైనా విప్లవాలు కూలిపోయాక దేశ దేశాల్లోని విప్లవోద్యమాలకి ఆటంకాలు ఏర్పడ్డాయి. రివిజనిజం పైచేయి సాధించింది. వీటికి వ్యతిరేకంగా పోరాడుతూ, ఆయా దేశాల్లోని పరిస్థితులపై ఆధారపడి విప్లవోద్యమాలను కాపాడుకొంటున్నారు. ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిని దెబ్బతీయడానికి సామ్రాజ్యవాదులు, వీరి అనుకూల పాలకవర్గాలు చేయని దాడి లేదు. పాల్పడని కుట్ర లేదు. భౌతిక దాడులను సాగిస్తున్నది. రాజకీయదాడులను సాగిస్తున్నది. మార్క్సిజానికే కాలం చెల్లిందని పెద్ద యెత్తున దాడి చేస్తున్నది. వీటన్నింటిని చాలా కష్టంతో ఎదుర్కోక తప్పదు.

సామ్రాజ్యవాదం, దాని అనుకూల పాలక వర్గాలు నేడు ఎప్పుడు లేని సంక్షోభం లో కూరుకుపోయాయి. అవి సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకి వ్యతిరేకంగా గొప్ప గొప్ప పోరాటాలు సాగుతున్నవి. ఇవన్నీ విప్లవోద్యమాల నిర్మాణానికి అనుకూలమయిన పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఈ పోరాటాలను వ్యవస్థ వ్యతిరేక ప్రత్యామ్నాయ పోరాటాల వైపు మళ్ళించడమే విప్లవకారుల ప్రధాన కర్తవ్యం. దానికి సరయిన సిద్ధాంతం, నిర్మాణం లేకుండా ముందుకు తీసుకుకెళ్ళలేం. అందుకే కమ్యూనిస్టు విప్లవకారుల సిద్ధాంతాన్నీ, రాజకీయాలనూ, నిర్మాణాన్నీ రూపొందించుకొన్నారు. వాటి అన్వయింపులో, ఆచరణలో, దొర్లుతున్న వాటిని సమీక్షించుకుందాం. ముందుకు పోదాం.

భారత దేశంలో సాగుతున్న విప్లవోద్యమంలో వేలాది మంది మన ఆత్మీయ సహచరులను కోల్పోయాం. అందులో మన రాష్ట్ర కమిటీ సభ్యుడు కా॥ లింగన్న ఒకరు. వారు కొనసాగించిన భారత విప్లవ పంథాని నిస్సంకోచంగా కొనసాగిద్దాం. మొక్కవోని ధైర్యంతో పోరాడుదాం. దృఢదీక్షతో కొనసాగుదాం. అమరవీరుల ఆశయాలను సాధించే వరకు అవిశ్రాంతంగా పోరాడుదాం. అమర వీరులకు జోహార్లు. కా॥ లింగన్నకి అరుణారుణ శ్రద్ధాంజలి.

**- పి. సూర్యం.**

# ప్రతిఘటనోద్యమ నాయకుడు కామ్రేడ్ పూనెం లింగన్న ప్రథమ వర్ధంతి సభలు

సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పూనెం లింగన్నను గత సంవత్సరం జులై 31న రోళ్ళగడ్డ అడవిలో ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపారు. వందలాది మంది పోలీసులు కూంబింగ్ నిర్వహించి, సజీవంగా లింగన్నను పట్టుకునే అవకాశం వున్నా, కాల్చి చంపి, ఎన్‌కౌంటర్ కథలల్లారు. ఇది పూర్తిగా రాజ్యహింసే. దీనికి నిరసనగా వందలాది మంది ప్రజలు పోలీసులపై తిరుగుబాటు చేశారు. కామ్రేడ్ లింగన్న భూమి, భుక్తి, విముక్తి కోసం దశాబ్దాలుగా పోరుచేసి, గిరిజన ప్రజల్ని ఐక్యం చేశారు. త్యాగజీవిగా నిలబడ్డారు. ఆయన ఆశయ సాధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ వర్ధంతి సభలు నిర్వహించాలన్న రాష్ట్ర కమిటీ, రీజనల్ కమిటీ పిలుపులో భాగంగా జులై 24 నుండి 31వ తేదీ వరకు సభలు నిర్వహించారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

**కొత్తగూడెం:-** కొత్తగూడెం పట్టణం, బంగారు చెలక, ఉల్వనూరులో సభలు జరిపారు. జిల్లా నాయకులు ఆజాద్, మండల నాయకులు సతీష్, సంజీవ్‌లు పాల్గొన్నారు.

**టేకులపల్లి మండలం:-** ముత్యాలపాడు, జోగు నాగారం, సిద్దారం గ్రామాల్లో లింగన్న వర్ధంతి సభలు జరిపారు. నాయకులు కె. వెంకటేశ్వర్లు, ఆజాద్, జోగు సత్యం, కుంజ రమేష్, వజ్జా పాపయ్య మాట్లాడారు.

**ఇల్లందు టౌన్:-** సత్యనారాయణపురంలో సభ జరిగింది. తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లందు:-** మండలంలో ముకుందాపురం, రేపల్లెవాడ, ఇల్లందు టౌన్, పోలారం, ఎల్లపురం, విక్రమ్‌నగర్ గ్రామాలలో వర్ధంతి సభలు జరిపారు. ఈ సభల్లో పార్టీ డివిజన్ నయకుడు బిచ్చా, అజయ్, మండల నాయకులు నారాటి వెంకన్న, పొడుగు నర్సింహారావు మాట్లాడారు.

ఇల్లందు టౌన్‌లోని రాజీవ్‌నగర్, స్టేషన్ బస్తీలో సభలు నిర్వహించారు. వీటిల్లో టౌన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, దండి వెంకటక్క మాట్లాడారు.

**చండ్రుగొండ మండలం:-** మర్రిగూడెం గ్రామంలో సభ జరపగా, ఎస్‌కె. ఉమర్ మాట్లాడారు. బచ్చన్నగూడెం, మర్రి గూడెం, మదుకూరు, తిప్పపల్లి, జెండాలపాడు, బాటన్న నగర్, కోండయిగూడెం, మండల కేంద్రంలో లింగన్ననగర్‌లో పూనెం లింగన్న వర్ధంతి సభలు జరిపారు. ఈ సభలో మండల కార్యదర్శి ఉమర్ మాట్లాడారు.

**గుండాల మండలం:-** లింగన్న వర్ధంతి సభలను జరపరాదని గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, సర్పంచు కోరం సీతారాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మానారపు వెంకన్న, పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు పర్శిక రవిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి, భయపెట్టడానికి ప్రయత్నించారు. సభలు పెడితే కేసులు పెడతామని హెచ్చరించారు. అయినా పోలీసుల నిర్బంధం మధ్య గుండాల మండలం రోళ్ల గడ్డ గ్రామంలో అమరుడు కామ్రేడ్ లింగన్న కు నివాళులర్పిస్తున్న లింగన్న కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో గుండాల జెడ్పిటిసి వాగబోయిన రామక్క, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గుండాల సబ్ డివిజన్ కార్యదర్శి గుండాల సర్పంచ్ కోమరం సీతారాములు,పర్శిక రవి, వై వెంకన్న, ఎస్కే అగ్గర్, ఈసం మంగన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తాపురంలో 100 మందితో వర్ధంతి సభ జరిపారు. ముక్తి సత్యం మాట్లాడారు. కాచనపల్లి జగ్గుతండాలో (50), బాటన్న నగర్ (100)లో సభలు జరిపారు. మండల నాయకులు జర్పుల కిషన్, పూనెం రంగన్నలు మాట్లాడారు.

కోడవటంచ గ్రామంలో (70), గలబాలో (50), వేపలగడ్డలో (100) సలు జరిగాయి. పర్శిక రవి, కోరం సీతారాములు మాట్లాడారు.

## మహబూబాబాద్ జిల్లా

**బయ్యారం:-** మండల కేంద్రంలో దొరన్న విజ్ఞాన కేంద్రంలో కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సభ జరిపారు. మండల కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, తుడుం వీరభద్రం, నాయకులు తోకల వెంకన్న, రామచంద్రపు మురళి, పొడుగు వెంకన్న, ఏపూరి వీరభద్రం, సోమక్కలు పాల్గొన్నారు.

బయ్యారం మండలంలో పెత్తాళ్ళగడ్డ, బాలాజిపేట, వినోభనగర్, గౌరారం, ఎల్.ఎన్.పురం, గంధంపల్లి, కొత్తపేట, రాయికుంట, కోటగడ్డ, ఇర్సులాపురం, కొత్తగూడెం, కోయగూడెం, కంబాలపల్లి, నర్సాపురం, కొత్తూరు, మిర్యాలపెంట, అల్లిగూడెం, రెడ్యాతాండా, కోళుకొండ, బీరోని మడవ, కస్తూరినగర్, రామగుండాల పందిపడివె మొత్తం 23 గ్రామాలలో పూనెం లింగన్న ప్రథమ వర్ధంతి సభలు నిర్వహించారు. ఈ సభలలో 10 నుండి 50 మంది పాల్గొన్నారు. బయ్యారం మండల కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకులు పూనెం భిక్షమన్న, బిల్లకంటి సూర్యం, ఉమ్మగని సత్యం, తుడుం వీరభద్రం, నాయకులు యాకయ్య, ఏపూరి వీరభద్రం, చింత వెంకన్న, మెంగు భఘవాన్, తోకల వెంకన్న, రామచంద్రపు మురళి, ఎం. రమేష్, పొడుగు వెంకన్న మాట్లాడారు.

**గార్ల:-** గోపాలపురం, గార్ల, మద్దివంచలో సభలు జరిగాయి. ఈ సభలో రీజనల్ నాయకులు గౌని ఐలయ్య, సక్రు, సింగు ఉపేందర్ (సీఎల్ఎఫ్), మద్దివంచ సర్పంచ్ కె. బాబురావు, సిహెచ్. గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల మండలంలో మంగలితండ, దేశ్యతండ, ఇందిరా నగర్, సత్యనారాయణ పురం, అంజనాపురం గ్రామాలలో వర్ధంతి సభలు జరిపారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు జి. సక్రు ప్రసంగించారు.

మహబూబాబాద్ పట్టణంలోని విక్రంనగర్, లక్ష్మిపురం, కంబాలపల్లిలో లింగన్న సభలు జరిపారు. 10 నుండి 40 మంది పాల్గొన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మండల వెంకన్న, హెచ్. లింగ్యా, దేవేందర్, హరీష్ (అరుణోదయ)లు మాట్లాడారు.

**కొరివి మండలం:-** కొరివి, రాజోలు, బండరాయి తండాలో సభలు జరిగాయి. రాష్ట్ర నాయకులు చిన్న చంద్రన్న, ఎస్‌కె. బాబు, ఆర్. రవిలు మాట్లాడారు.

**డోర్నకల్:-** మండలంలో బంజరలో సభ జరిగింది. హెచ్. లింగ్యా, వెంకటనారాయణ మాట్లాడారు.

**పాఖాల కొత్తగూడ:-** గంగారంలో, కాటి నాగారం, కోమట్ల గూడెం, జంగాలపల్లి, మర్రిగూడెంలలో సభలు జరిపారు. జిల్లా నాయకులు పుల్లన్న, బూర్క వెంకటన్న మాట్లాడారు.

**తొర్రూర్:-** డివిజన్ సెంటర్‌లో సభ జరిగింది. డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడారు.

దంతాలపల్లి, మెస్సు రాజుపల్లి, బంజర, పెద్ద ముప్పారం, నెల్లికుదురు కేంద్రాలలో సభలు జరిపారు. డివిజన్ నాయకులు కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, రాజేశ్వర్‌రెడ్డి, ఉడుగుల రామన్న, ఆలకుంట్ల సాయిలు, జక్కుల యాకయ్య, ఇ. అనిల్ పాల్గొన్నారు.

**కేసముద్రం:-** అమ్మినపురం కల్వల గ్రామంలో సభ జరపగా ఐఎఫ్‌టీయు నాయకులు భాస్కర్ రెడ్డి, గ్రామ నాయకులు మౌలానా, వెంకన్న, మల్లేషంలు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా:-

వరంగల్ జిల్లా కేంద్రంలో సభ జరిపారు. కోడి సోమన్న, చిర్ర సూరి, పసునూటి రాజులు పాల్గొన్నారు.

నర్సంపేట కేంద్రంలో లింగన్న సభ జరిపారు. అందులో జిల్లా కార్యదర్శి కోడి సోమన్న, లావుడ్య రాజు, సారంగపాణి, మాడె అశోక్‌లు మాట్లాడారు.

కొండాపూర్, చెన్నారావుపేట, పాపాయిపేట, జల్లిలో సభలు జరిగాయి. కోడి సోమన్న, గూబరాజు, సారంగపాణిలు ప్రసంగించారు.

మరుపాక ఎస్సీ కాలనీలో (50), చీమల గూడెం (100), గుండాల తండా (70)లో సభలు జరిగాయి. ముక్తి సత్యం, కోరం సీతారాములు పాల్గొన్నారు.

నర్సంపేట, కోనాపురం, మైరారం, వర్ధన్న పేట కేంద్రాలలో లింగన్న సభలు జరిపారు. జిల్లా కార్యదర్శి కోడి సోమన్న, లావుడ్య రాజు, అబర్ల రాజన్న, సారంగం, చిర్రా సూరి, బాలరాజు, పసునూట రాజు, తదితరులు పాల్గొన్నారు.

**డోర్నకల్:-** వెన్నారం, బంజారాలలో సభలు జరిగాయి. వెంకటనారాయణ, ఉపేందర్‌లు మాట్లాడారు.

## నల్లగొండ జిల్లా:-

నకిరేకల్‌లో యానాల మల్లారెడ్డి స్మారక భవన్‌లో లింగన్న సభ జరిపారు. నల్గొండ జిల్లా కార్యదర్శి రాయి కృష్ణ, పుట్ట సత్యం, బి. శ్రీను, పి. సోమన్న, మామిడి రోజు వెంకన్న, పి. అనిల్ పాల్గొన్నారు.

## హైదరాబాద్:-

కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సభ సందర్భంగా మార్క్స్ భవన్‌లో లింగన్న పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ సెక్రటేరియట్ సభ్యులు వి. వెంకట్రామయ్య, ఐఎఫ్‌టీయు ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, వి. కిరణ్, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి రాము, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా:-

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో 31న ఖానాపూర్ ప్రెస్ భవన్‌లో 50 మందితో జరిగింది. నంది రామయ్య, జక్కుల రాజన్న, ప్రసాద్, మాట్లాడారు.

## ఖమ్మం జిల్లా

**తిరుమలాయపాలెం మండలం:-** కామ్రేడ్ పూనెం లింగన్న ప్రథమ వర్ధంతి సభలు తిరుమాలయపాలెం మండలం తిప్పారెడ్డి గూడెంలో జూలై 31న 20 మందితో జరిగింది. పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి సి.వై. పుల్లయ్య, పార్టీ మండల కార్యదర్శి ఎం. రాజేంద్రప్రసాద్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె. సుబ్బారావు, మండల నాయకులు పోలేపొంగు నాగయ్య తదితరులు మాట్లాడారు. ఉప్పలయ్య, బోల్నే దాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాతర్లపాడు, చంకలగూడెం, దమ్మాయిగూడెం, బచ్చోడు గ్రామాలలో కా॥ లింగన్న వర్ధంతి సభలు జరిగాయి. ఈ సభలలో సి.వై. పుల్లయ్య, ఆర్. శివలింగం, రాజేంద్రప్రసాద్, జి. రమేష్, సుబ్బారావు తదితరులు మాట్లాడారు.

**కూసుమంచి మండలం:-** కూసుమంచి మండల కేంద్రంలో కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సభ 10 మందితో జరిగింది. పార్టీ మండల కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి, ఇఫ్టూ ఏరియా నాయకులు ఐ. వెంకన్న, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు మాతంగి రామస్వామి, తదితరులు మాట్లాడారు.

**నేలకొండపల్లి మండలం:-** నేలకొండపల్లి మండల కేంద్రంలో కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సభ 20 మందితో జరిగింది. ముందుగా కా॥ లింగన్నకు ఘనంగా నివాళులు అర్పించారు. న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి సి.వై. పుల్లయ్య, ఇఫ్టూ పాలేరు ఏరియా కమిటీ కార్యదర్శి పి. రామదాసు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె. సుబ్బారావు మాట్లాడారు.

**ఖమ్మం రూరల్ మండలం:-** కాచిరాజుగూడెం గ్రామంలో కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సభ జరిగింది. పార్టీ జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు, ఏఐకేఎఎస్ పాలేరు డివిజన్ అధ్యక్షులు మల్లన్న, పీవైఎల్ పాలేరు డివిజన్ కార్యదర్శి జి. మాధవరావు, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి వీర్ల వెంకటప్పారావు, తదితరులు మాట్లాడారు. మంగళగూడెం గ్రామంలో కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సభ జరిగింది.

**కారేపల్లి:-** పేరేపల్లి, చంద్రల గూడెం గ్రామాలలో సభలు జరిపారు. నాయకులు వై. ప్రకాశ్ మాట్లాడారు. టేకులగూడెం, జమాండ్లపల్లి, మదారంలో సభలు జరిపారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి (ఏఐకేఎంఎస్), కె. శ్రీను, జానకి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిభవన్ ముందు నల్లజెండాలతో నిరసన

కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో, ప్రజల ప్రాణాలను కాపాడటంలో నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష - రాజకీయ పార్టీలు ఆగస్టు 7న నిరసనను ప్రకటించాయి. "ముఖ్యమంత్రి మేలుకో... ప్రజల ప్రాణాలను కాపాడు, జీవితాలను నిలబెట్టు" నినాదంతో ఆగస్టు 7న ప్రగతిభవన్ ముందు నిరసన తెలపాలని నిర్ణయించాయి. ముఖ్యంగా కరోనా వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలనీ, పేద వర్గాలకు నెలకు 7,500 రూ॥లు ఇవ్వాలనీ, విస్తృతంగా కరోనా టెస్టులు చేయాలనీ, తదితర డిమాండ్స్‌తో నిరసన తెలిపారు.

7వ తేదీన ఉదయం 11.30 గం॥లకు ప్రగతిభవన్ ముందు నల్లజెండాలతో నిరసన తెలిపారు. కోదండరాం, నర్సయ్య (టీజేఎస్), ఎం. హన్మేశ్, వి. కిరణ్, కె.ఎస్. ప్రదీప్, అఫ్జల్ న్యూడెమోక్రసీల నాయకత్వంలో 25 మంది నిరసన తెలిపారు. పోలీసుల తోపులాట తర్వాత అరెస్టు చేసి గోషామహల్ స్టేడియంకు తరలించారు. అనేక దఫాలుగా జరిగిన అరెస్టుల్లో బాలమల్లేష్ (సీపీఐ), ఎం. శ్రీనివాస్ (సీపీఎం), గోవర్ధన్ (న్యూడెమోక్రసీ)లు ఉన్నారు. చాడ వెంకట్‌రెడ్డి, నారాయణ, జూలకంటి రంగారెడ్డిలు కూడా అరెస్టయ్యారు. సాయంత్రం 4 గం॥లకు వ్యక్తిగత పూచిపై వదిలిపెట్టారు.

If undelivered please
return to Manager

VOICE OF NEW DEMOCRACY
H.No.11-8-178/3, Lenin Nagar,
Khammam, Khammam Dist.
Telangana State,
Pincode - 507 001.
Email: voiceofnewdemocracy@gmail.com

Regd. No. L/RNP/KHM-13
BOOK-POST

To
........................................................
........................................................
........................................................
........................................................

Printed, Published and Edited by P. Ranga Rao, Printed at Sri Lalitha Offset Printers, Vinod Mahal Road, Khammam.
Published at H.No. 11-8-178/3, Lenin Nagar, Khammam, Khammam Dist, Telangana State, Pincode - 507 001. Phone: 9490700099, Email: voiceofnewdemocracy@gmail.com, Web: www.cpimlndtsap.org